ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-7-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 153 పేజీలు: 10+4 వెల: 6.50

కొవిడ్ టీకాపై ఆందోళన వద్దు: ఎయిమ్స్
హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం: నెతన్యాహు 5

# 'సన్నా'లకూ లావు రెక్కలు!



## దుకాణంలోంచే బియ్యం మాయం..

### లబ్ధిదారులకు అక్కడికక్కడే డబ్బులిచ్చి కొనేస్తున్న డీలర్లు

### డబ్బుకావాలా.. బియ్యమా? అంటూ బేరాలు

### కిలో రూ.25 నుంచి 30 వరకు ధర కట్టి కొనుగోలు

### నగదును రేషన్ డీలర్ల వద్ద పెడుతున్న బ్లాక్ మార్కెట్ పెద్దలు

### రేషన్ బియ్యంలో 25% నూక ప్రత్యక్షం




**హైదరాబాద్,జూలై 3,ప్రభాతవార్త:** అక్రమాలకు అలవాటు పడిన రేషన్ డీలర్లు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని కూడా వదలడం లేదు. ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయటంతో గతం కంటే ఎక్కువసొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ దుకాణాల్లో బియ్యం ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు. డీలర్ల వద్ద నగదు ఉండొద్దు. నగదును రేషన్ డీలర్ల వద్ద పెడుతూ నల్లబజారు పెద్దలు అక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. ఏ దుకాణానికి వెళ్లినా లబ్దిదారుల నుంచి బియ్యం కొనుగోలుకు డీలర్లు తెచ్చుకున్న నగదు రూ.వేలల్లో కనిపిస్తుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ పరిస్థితి ఉన్నా అధికారులు తనిఖీలు చేయట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న పంపిణీ చేస్తోంది. సన్నబియ్యం ప్రారంభించి కొద్ది రోజుల్లోనే వాటిని కూడా పలువురు బయట విక్రయిస్తుండటం విస్మయానికి గురిచేస్తోంది. వీటిని కొనుగోలు చేసిన, అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఓ వైపు ప్రభుత్వం హెచ్చరిస్తున్నాకొందరు ఏమాత్రం పట్టించుకోకుండా. దందాను నిర్భయంగా కొనసాగిస్తున్నారు. గత రెండు నెలులగా రాష్ట్రవ్యాప్తంగా వరుసగా పౌరసరఫరాల అధికారులు దాడులు చేసి సన్న బియ్యాన్ని పట్టుకోవడంతో మళ్లీ పాత కథే పునరావృతం అవుతున్నట్లు కనిపిస్తోంది. దొడ్డు బియ్యం కావడం వల్లే లబ్దిదారులు తినకుండా అమ్మేస్తున్నారని, దీన్ని ఆసరా చేసుకొని డీలర్లు దందాకు పాల్పడుతున్నారని భావించిన రాష్ట్ర ప్రభుత్వం అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు, పేదలు కడుపు >>2

## ప్రధాని మోడీకి 'ఘనా' మేటి పురస్కారం

### 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' అవార్డు అందజేసిన అధ్యక్షుడు మహామా

**అక్రా,(ఘనా),జులై3 :** భారత ప్రధాని నరేంద్ర మోడీ తన విదేశీ పర్యటనలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఆయన విశిష్ట రాజనీతిజ్ఞతకు, ప్రపంచవ్యాప్తంగా ప్రభావవంతమైన నాయకత్వానికి గుర్తింపుగా పశ్చిమ ఆఫ్రికా దేశమైన ఘనా తమ దేశ అత్యున్నత జాతీయ పురస్కారం 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా'తో సత్కరించింది. ఘనా రాజధాని >>2


గురువారం అక్రాలో 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' అవార్డును ప్రధాని మోడీకి అలంకరిస్తున్న అధ్యక్షుడు మహామా

మా దేశంలో 2500 రాజకీయ పార్టీలున్నాయి: మోడీ 2


మహేశ్వరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

# 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ

## అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తాం

### ప్రపంచంలో అతిపెద్ద నగరంగా హైదరాబాద్

### మహేశ్వరంలో జ్యూయెలరీ, జహీరాబాద్‌లో ఇవి, డిఫెన్స్ హబ్ అభివృద్ధికి చర్యలు

### తయారీ రంగానికి మరింత ప్రాధాన్యం: సిఎం రేవంత్

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం మహేశ్వరం ప్రాంతంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తూ రానున్న కాలంలో ప్రపంచంలోనే 4వ నగరంగా అంతర్జాతీయ ప్రమాణాలతో మహేశ్వరం నియోజకవర్గ ప్రాంతంలో నిర్మించడం జరుగుతుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలియజేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఇండస్ట్రియల్ పార్కులో మలబార్ జేమ్స్ జువెలరీ తయారీ యూనిట్ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి శ్రీధరాబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ, ఫార్మా తదితర రంగాల మాదిరిగానే తయారీ రంగంలోనూ తెలంగాణను హబ్ మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని, అందుకు అనుగుణంగా హైదరాబాద్ శివార్లలో ఎలక్ట్రానిక్ క్లస్టర్, మహేశ్వరంలో జువెలరీ తయారీ యూనిట్లు, జహీరాబాద్ ఈవీఅండ్ డిఫెన్స్ హబ్కు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్గా ప్రగతిపథంలో దూసుకెళ్తున్నామని, తెలంగాణ పరిశ్రమల కంటే ముందుకు వాటికి అవసరమైన ఏకో సిస్టమ్ ను నిర్మిస్తున్నామని ఆయన వివరించారు. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అతిపెద్ద నగరంగా తీర్చిదిద్దుతున్నామని, అది >>2

# ఎస్ఎస్‌సి, ఇంటర్ బోర్డులు విలీనం!

## కేంద్రం ప్రతిపాదనపై అధికారుల తర్జన భర్జన

### 8 మినహా మిగిలిన రాష్ట్రాల్లో ఒకే బోర్డు

### ఎన్ఇపిలో 5+3+4గా సిఫారసు.. 11,12 తరగతుల్లోకి ఎక్కువ మంది విద్యార్థులను రప్పించే యోచన



**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ (ఎస్ఎస్‌సి) ను అందిస్తున్న ఎస్ఎస్‌సి బోర్డు, ఇంటర్ బోర్డు ఒకేవేదిక మీదకు రానున్నాయా? కేంద్రం ప్రతిపాదించినట్టుగా రెండు బోర్డులను విలీనం చేసి ఒకే బోర్డుగా ఏర్పాటు చేసే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తుందా? ఇప్పుడు విద్య శాఖలో నడుస్తున్న చర్చ ఇదే. బుధవారం కేంద్ర విద్యా శాఖ నిర్వహించిన సమావేశంలో రాష్ట్రాల నుంచి పాఠశాల విద్యశాఖ అధికారులు పాల్గొన్నారు. అందులో భాగంగా తెలంగాణ నుంచి పాఠశాల విద్య శాఖ ఉన్నతాధికారులు కూడా సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలో రెండు ప్రస్తుతం 10వ తరగతి వరకు ఎస్ఎస్‌సి బోర్డు, ఇంటర్ విద్యకు ఇంటర్ బోర్డు కొనసాగుతున్న నేపథ్యంలో రెండు బోర్డులు అవసరమా? అని కేంద్రం ప్రశ్నించినట్టు తెలిసింది. రెండు బోర్డులు కాకుండా ఒకేబోర్డుగా కొనసాగితే పరీక్షల నిర్వహణతోపాటు ఇతర అంశాలను పరిశీలించడానికి కూడా సులభతరంగా ఉంటుందని సూచించినట్టు తెలిసింది. ప్రస్తుతం దేశంలో 8 రాష్ట్రాలు మినహా మిగిలిన రాష్ట్రాలన్నీ కూడా ఇంటర్మీడియట్ వరకు ఒకే బోర్డు పరిధిలో పనిచేస్తున్నాయని సూచించింది. ఈ నేపథ్యంలో మిగిలిన 8 రాష్ట్రాల్లో కూడా ఒకే బోర్డును ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం తెలంగాణ, ఏపీ, యూపీ, బీహార్, తమిళనాడుతోపాటు మరో మూడు రాష్ట్రాల్లో ఎస్ఎస్‌సి బరకు ఎస్ఎస్‌సి బోర్డు.. ఇంటర్మీడియట్‌కి ఇంటర్ బోర్డు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు బోర్డులు కాకుండా ఎస్ఎస్‌సి బోర్డులోనే ఇంటర్ బోర్డును విలీనం చేసి.. సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డుగా కొనసాగించేలా ఆలోచన చేయాలని సూచించినట్టు తెలిసింది. రెండు బోర్డులు కాకుండా ఒకటే బోర్డుగా కొనసాగితే పరీక్షల విధానంతోపాటు ఒకే సిలబస్ అమలు చేసుకోవడానికి వీలవుతుందని సూచించింది. ఒకే బోర్డు విధానం ఉంటే విద్యార్థులకు సైతం ఉపయోగకరంగా ఉంటుందని కేంద్రం సూచించినట్టు ఉన్నతాధికారి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 5 ప్లస్2 ప్లస్ 3 ప్లస్ 2 విధానం అమలులో ఉంది. అంటే 5వ తరగతి వరకు ప్రాథమిక(ప్రైమరీ), 7వ >>2


గురువారం బేగంపేట విమానాశ్రయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు స్వాగతం పలుకుతున్న సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్

# నేడు ఎల్బీ స్టేడియంలో సామాజికన్యాయ సమరభేరి

### కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షులతో ఎఐసిసి చీఫ్ ఖర్గే భేటీ

### ఖర్గేకు కవిత లేఖ హాస్యాస్పదం: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,జూలై 3,ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల రిజర్వేషన్‌పై తెంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేకు లేఖరాయడం హాస్యస్పదం అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మహేష్ కుమార్ మాట్లాడతూ శుక్రవారం లాల్ బహదూర్ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల స్మమేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే హాజరవుతారని ఆయన తెలిపారు. గ్రామ మండల, జిల్లా అధ్యక్షులు మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు కార్పొరేషన్ చైర్మన్లు కలిపి దాదాపు 40 వేల మంది వరకు పాల్గొంటారని ఆయన వివరించారు. "సామాజిక న్యాయ సమర భేరి" పేరిట జరిగే సభలో బిజెపి పాలనలో అంబెద్కర్ రూపొందించిన రాజ్యాంగంను పరిరక్షణ కోసం ప్రతి గ్రామంలో చర్చజరిపేందుకు వీలుగా చైతన్యం తీసుకొని >>2

# తెలుగు రాష్ట్రాలకు ఐదుగురు కొత్త జడ్జిలు

### తెలంగాణకు మొహిద్దీన్, చలపతిరావు, రామకృష్ణారెడ్డి, ప్రవీన్‌కుమార్.. ఆంధ్రప్రదేశ్‌కు తుహీన్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై3:** ఏపీ, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులకు కొత్త జడ్జిల నియామకానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. బుధవారం జరిగిన సుప్రీంకోర్టు కొలీజియం సమావేశంలో ఐగుదురు న్యాయవాదులను జడ్జీలుగా నియమించేందుకు సిఫారసు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు న్యాయమూర్తులు రానున్నారు. గౌసుమీరా మొహిద్దీన్, సుద్దాల చలపతి రావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీన్‌కుమార్ తెలంగాణ హైకోర్టు జడ్జీలుగా ఎంపిక అయ్యారు. ఏపీ హైకోర్టు జడ్జీగా తుహిన్ కుమార్ నియామకానికి కొలీజియం సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు కొలిజీయం వీరి పేర్లను ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపింది.

## అప్పటి మున్సిపల్ మంత్రి ఆదేశాలతో నిధులు విడుదల

### నా ప్రమేయం ఏమీ లేదు: ఎసిబి విచారణలో అరవింద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై3:** ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ గురువారం ఏసీబీ ఎదుట హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి మూడోసారి ఏసీబీ విచారణకు అరవింద్ వచ్చారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో నిధుల బదలాయింపులో అరవింద్ కుమార్ కీలక పాత్ర పోషించారని ఏసీబీ గుర్తించింది. హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌గా పని చేస్తూ నిధులను మళ్లించినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. కేబినెట్ అనుమతి లేకుండా నిధులను బదిలాయించినందుకు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో మాజీ మంత్రి, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా ఇప్పటికే రెండు సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. జూన్ 16న కేటీఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే >>2



# ఆసుపత్రిలో కెసిఆర్

### ఆయన ఆరోగ్య పరిస్థితిపై సిఎం రేవంత్ ఆరా

### పరిస్థితి నిలకడగానే ఉంది: హెల్త్ బులెటిన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై3:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుఅనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో గురువారం సాయంత్రం ఆయన సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు డాక్టర్లు వైద్యపరీక్షలు >>2

# అంగన్వాడీలు ఇక 'బలవర్ధకం'

### మహిళా స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం

### శిథిలావస్థలోని అంగన్వాడీలు తక్షణమే ప్రభుత్వ కార్యాలయాల్లోకి

### త్వరలో సరికొత్త బాలామృతం: మంత్రి సీతక్క


గురువారం అంగన్వాడీలపై సమీక్ష అనంతరం ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్ జూలై3 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అంగన్వా డీల బలోపేతంపై మహిళా శిశు సంక్షేమశాఖ దృష్టి సారించింది. చిన్నారుల్లో పోషకాహారాన్ని మెరుగు పరిచేందుకు మహిళా స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థల సహకారాన్నితీసుకోవాలని నిర్ణయించింది. మహిళా శిశు సంక్షేమ శాపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా అంగన్వాడి కేంద్రాల బలోపేతం, పోషకార మిషన్, ఉద్యోగ ఖాళీలభర్తీ, కారుణ్య నియమకాలు, అంగన్వాడి సేవల్లో మహిళా స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలకు భాగస్వామ్యం, చిన్నారుల పోషకాహారమెరుగుదల కోసం అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్వాడీలను బలోపేతం చేసే దిశలో పలు కీలక సూచనలు చేశారు. శిధిలావస్తలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తక్షణం సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాల్లోకి మార్చాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని నూతన అంగన్వాడీ భవనాలనిర్మాణం కోసం స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. వీలనైంత త్వరగా అంగన్వాడీసెంటర్లను అందుబాటులోకి తెచ్చేందుకు >>2

## 3 రోజులు వర్ష సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై3:** రుతుపవన ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది. గురువారం కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ తో పాటు నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సంగారెడ్డి జిల్లాల్లో ఉరుములు ఈదురు గాలులతో కూడిన తేలికపాటి >>2



గురువారం అక్రాలో ఘనా రిపబ్లిక్ పార్లమెంట్ హౌజ్‌లో ప్రజాప్రతినిధులతో కరచాలనం చేస్తున్న ప్రధాని మోడీ

# మా దేశంలో 2500 రాజకీయ పార్టీలున్నాయి..

## ఘనా పార్లమెంటులో ప్రధాని మోడీ

**అక్రా(ఘనా),జులై 3:** భారత్‌లో 2500కిపైగా రాజకీయ పార్టీలున్నాయని భారత్‌లోని మారాష్ట్రాలను వివిధ పార్టీలు పాలిస్తున్నాయని చెపుతూ 22 అధికారిక భాషలున్నాయని చెప్పారు. ఘనాదేశ పార్లమెంటులో సభ్యులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇక దేశంలో విదేశీభాషలు వేలాదిగా ఉన్నాయని, భారత్‌కు వచ్చే పర్యాటకులను విశాలహృదయంతో స్వాగతించడానికి ఈ భిన్నత్వమే కారణమని ఆస్ఫూర్తివల్లనే భారతీయులు ఎక్కడికి వెళ్లినా అక్కడి ప్రజలతో సులభంగా మమేకం అవుతున్నారని చెప్పారు.రాజకీయ పార్టీల సంఖ్యను చెప్పినవెంటనే ప్రధానిమోడీ వ్యాఖ్యలకు ఘనా పార్లమెంటుసభ్యులు మొత్తం విస్తుపోయారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశప్రతినిధిగా 140 కోట్లమంది భారతీయుల శుభాకాంక్షలు మీకు నావెంట తెచ్చానని, ఘనా దేశ పురస్కారాన్ని అందుకోవడం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. రెండుదేశాల సంబంధాలకు ఈ పురస్కారాన్ని అంకితం ఇస్తున్నట్లు తెలిపారు. మాకు ప్రజాస్వామ్యం ఒక వ్యవస్థ మాత్రమే కాదని, ప్రాథమిక విలువల్లో అదిభాగమని, రెండోప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన ప్రపంచక్రమం వేగంగా మారుతోందని సాంకేతికతలో విప్లవం, గ్లోబల సౌత్‌లో ఎదుగుదల ఈమార్పునకు దోహదంచేస్తున్నాయని, గ్లోబల్ సౌత్ గళం వినిపించకుండా ఈ అభివృద్ధి, పురోగతి సాధ్యంకాదన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధిచెందిన దేశంగా మార్చాలనిమా ప్రజలు సంకల్పంతో ఉన్నారని బలమైన భారత్, సుస్థిరమైన ప్రపంచానికి దోహదంచేస్తుందని ఆఫ్రికా అభివృద్ధి దిశగాచేసే ప్రయాణంలో మా సహాయాన్ని అందిస్తామన్నారు. మనదేశాల పురోగతికి పరస్పరం సహకరించుకుందామని ప్రధానిమోడీ పిలుపునిచ్చారు. జి20కి భారత్ సారథ్యం వహిస్తున్న తరుణంలోనే ఆగ్రూప్‌లో ఆఫ్రికా యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందకరమన్నారు. ఈ పర్యటనలోభాగంగా రెండుదేశాలమధ్య పరిశోధన అభివృద్ధి, ఔషధ ఉత్పత్తి సరఫరా తదితరరంగాలకు సంబంధించిన ఒప్పందాలు చేసుకున్నారు.

# సామాజికన్యాయ సమరభేరి

>> రానున్నారు. సామాజిక న్యాయ సమరభేరి సభలో మల్లికార్జున ఖర్గేతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాత్రమే ప్రసంగిస్తారని తెలిపారు. గ్రామ అధ్యక్షులకు ఎఐసిసి జాతీయ అధ్యక్షులు దిశా నిర్దేశం చేస్తారు. ఎమ్మెల్సీ కవిత జాతీయ అధ్యక్షులు ఖర్గే లేఖ రాయడం విడ్డూరంగా ఉందని ఆమె ఇంతకు కవిత జాగ్రుతి తరపున రాశారా? బిఆర్ ఎస్ తరపున రాశారా క్లారిటీ లేదని మహేష్‌కుమార్ అనుమానం వ్యక్తంచేశారు. నవ్వి పోదురు గాక నాకేమి సిగ్గు అన్నట్టు కవిత లెటర్ రాయడం ఉందని అన్నారు.పదేళ్ళు ఏళ్ళు బిఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం వెలగబెట్టారని మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు తగ్గించింది కెసిఆర్ కదా అని అన్నారు. పదేళ్లలో బిసి గురించి కవిత మాట్లాడినట్లు ఒక్క క్లిపింగ్ చూపించగలరా అని ఆయన నిలదీశారు రాజకీయ శూన్యంలో కవిత మనుగడ కోసం బిసి జపం చేస్తున్నారు.బిసిల గురించి మాట్లాడటానికి కవితకు అర్హత లేదని మహేష్ కమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసిలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల తో పాటు విద్య ,వైద్య లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీ సొంతమని స్వోత్కర్షలు చెప్పుకున్నారు. బిసిల గురుంచి కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ సమయంలో కవిత లిక్కర్ స్కాం లో జైల్లో ఊచలు లెక్కపెడుతున్నారని అందుకే ఆమెకు అది తెలియలేదేమో అని అన్నారు.బిసి బిల్లు చట్టం చేసి చట్టబద్దత కోసం కేంద్రంకు పంపామని ఆయన వివరించారు.నిరుద్యోగుల ఉసురు తగిలి బిఆర్‌ఎస్ అధికారం కోల్పోయింది. పదేళ్ల లో సాటి మహిళల గురుంచి కవిత ఏనాడైనా మాట్లాడారా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బనకచర్ల పై రేవంత్ చేసిన సవాల్ కి హరీష్ రావు సిద్ధమా అని అన్నారు. ఆ నాడు ఎపి ప్రభుత్వ నేతలతో చెట్టాపట్టాలు వేసుకొని తిరిగింది మీరు కదా అని నిలదీశారు. రోజా ఇంట్లో చేపల పులుసు తిని నీటి వాటా విషయంలో కాంప్రమైజ్ అయింది మీరు కదా అని ప్రశ్నించారు. బనకచర్ల విషయంలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆవేదనచెందారు. రాష్ట్ర అధ్యక్షుడిగాబిసి నాయకుడి నియమించలేని స్థితిలో బిజెపి ఉండటం విచారకరం అని నిష్ఠూరాలు పలికారు. ఆస్తి పంపకాల వాట తెగిందా అని కవితని సూటిగా అడుగుతున్నారు. రైతు భరోసా పేరిట 9 రోజుల్లో రూ.9వేల కోట్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని ఆయన చెప్పారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని అన్నారు అన్ని వర్గాలను మోసం చేసిన బిఆర్‌ఎస్ పార్టీ కి ఓట్లు అడిగే అర్హత లేదు అన్నారు. కవిత ఏ రోకో చేసిన సరే, పదేళ్లు ఏం చేశారో చెప్పి రైల్ రోకో చేయండి అనిఅన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్టేట్మెంట్ విషయంలో క్రమ శిక్షణ కమిటీ పర్యవేక్షి స్తుందని అన్నారు.

**ఎఐసిసి చీఫ్ ఖర్గేకు ఘనస్వాగతం**

గురువారం హైదరాబాద్ కు చేరుకున్న ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కు ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమానశ్రయంలో ఘన స్వాగతం పలికారు.శుక్రవారం ఎల్‌బి స్టేడియంలో మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే "సామాజిక న్యాయ సమర భేరి" పేరిట జరిగే సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు.ప్రతి నియోజకవర్గం నుంచి ఐదువందల మంది ప్రతినిధులు హాజరవుతారు. ముఖ్యంగా కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులతో ఎఐసిసి చీఫ్ సమావేశం జరుగుతోన్నది.

# అంగన్వాడీలు ఇక 'బలవర్థకం'

>> మొబైల్ అంగన్వాడీ, కంటేనర్ అంగన్వాడీలను ఏర్పాటు చేయాలని సూచించారు. వీటికి సంబంధించి వెంటనే నిపుణులతో చర్చించి డిజైన్ ను సిద్దం చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతం కోసం ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకునేందుకు అన్ లైన్ పోర్టల్ ను అందుబాటులోకి తేవాలని సూచించారు.ఇక అంగన్వాడీ చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించే విధంగా కార్యచరణ సిద్దం చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారి చేశారు. చిన్నారుల్లో పోషకాహార మెరుగుదల పరిశీలించేందుకు ప్రోగ్రెస్ రిపోర్ట్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని పారదోలేందుకు...వారికి అందించే ఆహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా వంద రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సుప్రీం కోర్టు కేసు నేపథ్యంలోఅంగన్వాడీల్లో ఖాళీలభర్తి, కారుణ్య నియామకాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

# మేటి పురస్కారం

>> అక్రాలో జరిగిన కార్యక్రమంలో ఆ దేశ అధ్యక్షుడు జాన్ ద్రమాని మహామ స్వయంగా ఈ అవార్డును ప్రధాని మోడీకి అందజేశారు. ఈ గౌరవం పట్ల ప్రధాని మోడీహర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాన్ని తాను 140 కోట్ల మంది భారతీయుల తరఫున స్వీకరిస్తున్నానని తెలిపారు. భారత యువత ఆకాంక్షలకు, దేశ సాంస్కృతిక వైవిధ్యానికి, అలాగే భారత్‌ఘనా మధ్య ఉన్న చారిత్రక బంధానికి ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రత్యేక గౌరవం అందించినందుకు ఘనా ప్రభుత్వానికి, ప్రజలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. ఘనా అత్యున్నత పురస్కారం అందుకోవడం గౌరవంగా ఉంది. ఇది భారత్‌ఘనా మధ్య ఉన్న బలమైన, చిరకాల సంబంధాలకు నిదర్శనమని ప్రధాని మోడీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ప్రధాని మోడీకి ఈ పురస్కారం లభించడంపై భారత విదేశాంగ శాఖ కూడా స్పందించింది. గ్లోబల్ సౌత్ దేశాల వాణిని బలోపేతం చేయడానికి మోదీ చేస్తున్న నిరంతర కృషికి లభించిన గుర్తింపు ఇదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఘనాతో మన స్నేహానికి, సహకారానికి ఇది నిదర్శనమని ఆయన 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఈ పురస్కారం ఇరు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు తనపై కొత్త బాధ్యతను పెంచిందని ప్రధాని మోడీ పేర్కొన్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోడీమొదటగా ఘనా చేరుకున్నారు. గత మూడు దశాబ్దాల కాలంలో ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

# వివాదరహితుడిగా పేరు పొందిన సిఎం రోశయ్య: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై3:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను స్మరించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంలో 16 సార్లు ఆర్థిక శాఖ మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్య దక్కించుకున్నారన్నారు. రోశయ్య జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని తమ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. మా ప్రభుత్వం అరుదైన గౌరవం ఆయనకు కల్పించిందని పేర్కొన్నారు. రోశయ్య సుమారు 50 ఏళ్ళు రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నా వివాదరహితుడిగా పేరు పొందారని సిఎం అన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 04-07-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
నవమి సా.4.32
చిత్త సా.4.50
వర్జ్యం రా.11.08-12.56
దు.ఉ.8.17-9.09, 2) మ.12.39-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**వృషభం :** టెంపరరిగా ఉన్న ఉద్యోగం పర్మినెంట్ అవుతుంది. రాజకీయరంగాల వారికి ప్రభుత్వరంగం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మిథునం:** సోదరుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు పొందు తారు.

**కర్కాటకం:** ప్రముఖుల నుండి వచ్చిన ఆహ్వానం ఆశ్చర్యపరుస్తుంది. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**సింహం:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**కన్య :** జీవిత భాగస్వామితో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**తుల :** ప్రముఖుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.సంతానం, విద్యా,ఉద్యోగావకాశాలు పొందుతారు.

**వృశ్చికం:** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండటం మంచిది. సంతానం నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**ధనుస్సు:** ఉద్యోగులకు ఎదురైన చికాకులు కొంతవరకు తొలుగుతాయి. కళా, సినిమా రంగాలవారికి ప్రోత్సహకరంగా ఉంటుంది.

**మకరం:** సోదరుల నుండి వచ్చిన వార్తవల్ల ఆనందం కలుగుతుంది. పెట్టుబడులకు తగిన లాభాలు కష్టమే.

**కుంభం :** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మీనం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటాయి. జీవిత భాగస్వామి నుండి సహాయ సహకారాలు అందుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'సన్నా'లకూ లావు రెక్కలు!

>> నిండా తినేందుకు సన్నబియ్యం పంపిణీకి ఉగాది రోజున శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడంతోపాటు కొత్త రేషన్‌కార్డులు జారేయడంతో బియ్యం తీసుకొనే వారిసంఖ్యగణీయంగా పెరిగింది. దొడ్డుబియ్యం పంపిణీ చేసిన రోజుల్లో రాష్ట్రంలో 89.59శాతం మంది లబ్దిదారులు ప్రతి నెల రేషన్ తీసకొనేవారు. సన్నబియ్యం పంపిణీ పథకం ప్రారంభం నాటి నుంచి బియ్యం కొనుగోలు చేసే లబ్దిదారుల 3.62శాతం పెరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి సన్నబియ్యం భోజనాన్ని తిన్నారు. ఇక అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే అంతా అనుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా మార్పు రాలేదు. గతంతో పోలిస్తే ఎక్కువ మంది లబ్దిదారులు సన్న బియ్యం తీసుకెళ్లి తింటున్నారు. కొందరు ఇప్పటికీ రేషన్ డీలర్లకే అమ్ముతున్నారు. ఈ సన్నబియ్యానికి కొందరు డీలర్లు కిలోకు రూ.25 నుంచి రూ.30 వరకు ధర కట్టి రేషన్ దుకాణంలోనే లబ్దిదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. భారమైనా భరిస్తూ సన్న బియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు.కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్1 నుంచి జూన్ 30 వరకు తెలంగాణలో 541439.333మెట్రిక్ టన్నుల బియ్యంను 33జిల్లాలో పంపిణీచేశారు. గత సంవత్సరం కంటే 5.62శాతం అధికంగా ఈ సంవత్సరం జూన్‌లో లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింది. మూడు నెలల సరుకు ఒకే సారి ఇవ్వడంతో సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది. దొడ్డుబియ్యం వలే సన్నబియ్యం అమ్మకాలు కూడా పెరిగిపోతున్నాయి. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి రెవెన్యూ,సివిల్‌సప్లయ్‌శాఖలు ఎంత కట్టడి చేసినా కూడా సన్నబియ్యం అక్రమ రవాణా ఆపలేకపోతున్నారు.బియ్యం దందా సన్నబియ్యమైనా నిరాటకంగా కొనసాగుతున్నట్లు ఇటీవల అధికారులు పట్టుకున్న కేసులకు సంబంధించి నిందితులు చెప్పిన వివరాలను బట్టి స్పష్టమవుతోంది. వివిధగ్రామాలు, మండలాల్లో పట్టుబడిన వారు జిల్లా కేంద్రంలోని వారికే బియ్యాన్ని చేరవేస్తుండటం జరుగుతోంది. అధికారుల తనిఖీల డొల్లతనానికి నిదర్శనంగా నిలుస్తోంది. అనేక జిల్లా కేంద్రాలలో జోరుగా సాగుతున్న దందాను నిలువరించడంలో విఫలమవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.మంచిర్యాల జిల్లా తాండూర్‌లో అచలాపూర్‌లో సన్నబియ్యం కిలోకు 16రూపాయలకు విక్రయించిన వ్యక్తులను గుర్తించి 11 కార్డులను రద్దుచేసినా విక్రయాలు ఆగడంలేదు.మహబూబ్‌నగర్‌లోని 61నంబర్ రేషన్ దుకాణం యజమాని పై సన్నబియ్యం పంపిణీ ప్రారంభంలోనే స్ట్రింగ్ ఆపరేషన్ చేసి సివిల్ సప్లయ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒక లబ్దిదారుడు 35 కిలోల సన్నబియ్యం తాలుకు డబ్బులు కిలోకు 20 రూపాయలు చొప్పున ఏడు వందలు తీసుకొన్నట్లు అప్పట్లో పౌరసరఫరా శాఖ అధికారులు గుర్తించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఒక కొత్త జిల్లా కేంద్రంలోని బజార్వాడిలో వ్యాపారి మధుసూదన్ ఇంట్లో సన్నబియ్యం పథకం ప్రారంభమైన నెలన్న రోజుల్లోనే ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసిల్దార్ తనిఖీ చేయగా 2.79 క్వింటాళ్ల సన్నబియ్యం లభించాయి. వీటిని 25 కిలోల చొప్పున వేరే సంచుల్లో నింపుతున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వ్యాపారితోపాటు అతనికి విక్రయించిన మరో వ్యక్తిపై 6ఏ కేసులు నమోదు చేశారు.కౌటాల మండలం రవీంద్రనగర్ పెట్రోల్ పంప్ సమీపంలోని ఓ ఇంట్లో రెండునెలల క్రితం ఎన్ఫోర్స్మెంట్ డీటీలు తనిఖీలు చేశారు. 13.40 క్వింటాళ్ల బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. షక్ జాయినొద్దిన్, ప్రభాకర్లు లబ్దిదారుల నుంచి కొనుగోలు చేసినట్లుగా గుర్తించారు. వీరితో పాటు మరో అయిదుగురు ఉన్నట్లు గుర్తించి అందరిపై కేసులు నమోదు చేశారు.వాంకిడి మండలం బోర్దా గ్రామంలోని ఓ ఇంట్లో అధికారులు తనిఖీ చేయగా మూడు క్వింటాళ్ల సన్న బియ్యం సంచులు లభించాయి. ఆసిఫాబాద్ మండలం సాలెగూడకు చెందిన దిగంబర్ అనే కార్డుదారుల నుంచి సేకరించి జెండగూడలోని సల్మాన్‌ఖాన్‌కు, వాంకిడికి చెందిన ముస్తాబ్ అలీకి విక్రయించేందుకు సిద్ధం చేసినట్లు గుర్తించారు. వారందరిపై 6ఏ కేసులు నమోదు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా చౌకధరల దుకాణలకు వెళ్లిన లబ్ధిదారులను డీలరు డబ్బులు కావాలా బియ్యమా అని అడగటం క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయటంతో గతం కంటే ఎక్కువ సొమ్ము డీలర్లు, లబ్దిదారులు ఇద్దరు చేసుకుంటున్నారు. మూడు నెలల సరుకు ఒకేసారి ఇవ్వడంతో ఏ దుకాణానికి వెళ్లినా లబ్దిదారులకు వేలలో నగదు జేబుల్లో పడ్డది. దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకొవచ్చనే నిబంధనలతో తెలంగాణకు వలసవచ్చిన కూలీలు ఎక్కువగా బియ్యం తీసుకొని వాటిని వెంటనే విక్రయించినట్లు చర్చకొనసాగుతోంది. మెదక్ జిల్లాలో 116శాతం అత్యధికంగా బియ్యం పంపిణీ జరిగింది. రంగారెడ్డిలో111.17శాతం,హైదరబాద్‌లో 104.57శాతం పంపిణీచేశారు.వనపర్తి,నాగర్‌కర్నూల్‌లో అత్యల్పంగా 81శాతం మాత్రమే లబ్దిదారులు బియ్యం తీసుకొన్నారు.

**25శాతం నూక కారణంగా నల్లబజారుకు సన్నబియ్యం**

సన్నబియ్యం తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నా అందులో నూక 25శాతం ఉండటంతో వాటిని వండుకోవడానికి లబ్దిదారులు మక్కువ చూపడంలేదు.కొత్త మంది ప్రభుత్వం ఇచ్చే బియ్యం సన్నబియ్యంగా దొడ్డుబియ్యంనే మలిచి ఇస్తున్నారనే దురభిప్రాయంతో ఉన్నారు. దీనికి తోడు సన్నబియ్యం ముద్దగా అవుతుండటంతో అది నిజమని భావించి డీలరుకో ఇంటి ముందుకు వచ్చిన వారికో విక్రయిస్తున్నారు. హాస్టల్,అంగన్‌వాడీ వంటి కేంద్రాలకు సరఫరాచేసే బియ్యంలో పదిశాతం మాత్రమే నూక ఉంటుంది. పేదలకు పంపిణీ చేసే బియ్యంలో నూక అధికంగా ఉండటంతో ఇంటిల్లిపాది పనిచేసుకొంటేకానీ పూటగడవని కుటుంబాలు తమకు ఉన్న పరిమితమైన సమయంలో నూక ఏరివేయడం ఇబ్బందిగా మారింది. ఇది కాకుండా పూర్వం ప్రతి ఇంట్లో నూకలు పట్టే జల్లెడలు ఉండేవి కానీ ఇప్పుడు ఇంట్లో చేటలే ఉండటంలేదు. ఇలాంటి పరిస్థితిలోనూకను చెరగడం మహిళకు ఇబ్బందిగా మారింది. దీనితో వాటిని ఇంటి ముందుక బియ్యం కొనుగోలు చేసేవారికి కిలోకు 20విక్రయించి మళ్ళీ 60రూపాలకు కిలోకు బియ్యం కొనుగోలు చేసేవారు కూడా ఉన్నారు.

# 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్‌సిటీ

>> ఇదే ప్రాంతంలో ఉందని, హైదరాబాద్ నగరం ప్రపంచంలోనే పెద్ద నగరంగా అవతరిస్తుందని ఆయన అన్నారు. హైదరాబాద్ నగరం చుట్టుపక్కల పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, వాటి పెట్టుబడులకు రక్షణ కల్పిస్తామని, లాభదాయకంగా ఉండే పరిశ్రమలను పారిశ్రామికవేత్తలు ఈ రాష్ట్రానికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. 202324 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ద్వితీయ రంగంలో (మ్యాన్యాక్చరింగ్, కన్స్ట్రక్షన్స్, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా) వృద్ధి రేటు 9.6 శాతం, అదే జాతీయ సగటు 8.3 శాతం మాత్రమేనని ఆయన అన్నారు. ఈ మలబార్ జేమ్స్ అండ్ జువెలరీ సంస్థ ముందుకు వెళుతూ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ముందంజలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధరాబాబు మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన మలబార్ జేమ్స్ అండ్ జువెలరీ తయారీ యూనిట్ ఈ ప్రాంతానికి రావడం తమకెంతో ఆనందంగా ఉందని, ప్రారంభించుకున్న మలబార్ తయారీ యూనిట్ తెలంగాణను తయారీ రంగంలో హబ్ అభివృద్ధికి దిక్సూచిగా తీర్చిదిద్దుతుందని ఆయన విశ్వసించారు. తెలంగాణలో ఫర్నీచర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఈ సంస్థ ముందుకు రావాలని, ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా సహకరిస్తామని ఆయన తెలియజేశారు. తెలంగాణ యువతకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఇలాంటి సంస్థలు చేతులు కలపాలని ఆయన కోరారు. 2035 నాటికి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్ ఎకనామిగా తీర్చిదిద్దాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మలారెడ్డి, మలబార్ గ్రూప్స్ ఛైర్మన్ ఎం.పీ.అహ్మద్, వైస్ ఛైర్మన్ సలీం, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ నిషద్ ఏకే, శాసనమండలి సభ్యులు, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, స్థానిక నాయకులు కేఎల్ ఆర్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పట్టణ స్థానిక సంస్థల అధ్యక్షుల జాతీయ స్థాయి సమావేశాన్ని గురువారం హర్యానాలోని గురుగ్రామ్‌లో జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

# ఎస్ఎస్‌సి, ఇంటర్ బోర్డులు విలీనం!

>> తరగతి వరకు అప్పర్ ప్రైమరీ(ప్రాథమికోన్నత), 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాల(హైస్కూల్)గా కొనసాగుతోంది. ఎస్ఎస్‌సి తరువాత ఇంటర్ రెండు సంవత్సరాలు ఇంటర్ బోర్డులో కొనసాగుతోంది. ఇంటర్ విద్యను కూడా స్కూల్ ఎడ్యుకేషన్ కిందకు తీసుకొచ్చి సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డుగా కొనసాగించాలనే యోచనలో కేంద్రం ఉన్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే రెండు బోర్డులు కాకుండా ఒకటే బోర్డు ఉండాలని సూచించింది. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపి)లో భాగంగా 5 ప్లస్ 3 ప్లస్ 4గా కొనసాగించాలని సూచించింది. అందులో భాగంగా 5వ తరగతి వరకు ప్రీ ప్రైమరీ, 8వ తరగతి వరకు అప్పర్ ప్రైమరీ, 9 నుంచి 12 వరకు సెకండరీ ఎడ్యుకేషన్‌గా నిర్ణయించారు. ఇలా చేయడంతో ప్రస్తుతం పాఠశాల విద్య శాఖ అధ్వర్యంలో ఇంటర్ వరకు కొనసాగే కెజిబివి, మోడల్ స్కూల్స్ కూడా వాటిలోనే కలుస్తాయి. ప్రస్తుతం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారందరూ ఇంటర్‌లో చేరడం లేదని.. డ్రాపౌట్స్ ఉంటున్నాయని కేంద్రం తన పరిశీలనలో తేల్చింది. ఇదే అంశాన్ని రాష్ట్రం నుంచి హాజరైన అధికారుల దృష్టికి తీసుకొచ్చింది. అదే ఇంటర్ వరకు ఒకే బోర్డు కింద ఉంటే 10వ తరగతి తరువాత కూడా వారు కొనసాగే అవకాశం ఉంటుందని కేంద్రం సూచించింది. దాంతోపాటు ఎక్కువ మంది మాతృ భాషలో కంటే ఇంగ్లీష్ మీడియంలోనే ఎక్కువ మంది పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొంది. ఈ నేపథ్యంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో సైతం ఇంటర్ వరకు ఒకే బోర్డు కింద కొనసాగితే ఎటువంటి నష్టాలు వస్తాయనే అంశాన్ని పరిశీలించాలని కూడా సూచించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్ఎస్‌సి బోర్డు, ఇంటర్ బోర్డు స్థాయిలోని అధికారులతోపాటు, విద్యార్థి సంఘాలు, అధ్యాపక సంఘాలు, విద్యారంగ నిపుణులతో కలిసి చర్చించిన అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# 3 రోజులు వర్ష సూచన

>> వర్షాలు పడే అవకాశమున్నట్లుగా తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.గంటకు 30 నుంచి 40కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ వారు ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో కృష్ణా బేసిన్‌లోని రిజర్వాయర్లు జలకళను సంతరించుకుంటున్నాయి. ఆలమట్టి నుంచి నాగార్జున సాగర్ వరకు అన్ని జలాశయాల్లోకి వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువ నుంచి వరదనీరు వస్తుండటంతో ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి రోజూ లక్ష క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతుండడంతో అక్కడి కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నిత్యం సుమారు 50 వేల క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి వస్తుండడం వల్ల సాగర్ జలాశయం నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సాగర్ జలాశయ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు (312.04 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 519.80 అడుగులు(148.94 టీఎంసీలు)గా ఉంది. ఈ ఏడాది సాగర్ ఆయకట్టుకు ముందుగానే నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆసుపత్రిలో కెసిఆర్

>> నిర్వహిస్తున్నారు. కాగా, వారం రోజులుగా జలుబు, దగ్గు, తలనొప్పితోపాటు సీజనల్ జర్వం ఆయన్ని ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. అయితే గురువారం నాడు ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసానికి కుటుంబసభ్యులతో కలిసి కేసీఆర్ చేరుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో చేరారు. అదీకాక.. జూన్ 11వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ ఎదుట కేసీఆర్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సైతం ఆయన కొంత అస్వస్థతతో ఉన్నారు. ఆ సమయంలో కమిషన్ ఎదుట విచారణ నేపథ్యంలో ఓపెన్ కోర్టుకు తాను రాలేనని.. ఇన్‌సైడ్ విచారణకు హాజరవుతానంటూ కమిషన్‌కు ఆయన స్పష్టం చేశారు. అందుకు కమిషన్ సానుకూలంగా స్పందించి అనుమతించింది. కాగా, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కె. చంద్రశేఖర్ రావు ఆరోగ్యం గురించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. గురువారం అకస్మాత్తుగా కేసీఆర్ అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు.హాస్పిటల్ డాక్టర్లు, అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.... చంద్రశేఖర్ రావుకు ఉత్తమ చికిత్స అందించాలని కోరారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి తాను అడిగి తెలుసుకున్నట్లు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఆయనకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు బండి సంజయ్ పేర్కొన్నారు. అనారోగ్యం నుంచి బయటపడి, ఆయన వీలైనంత త్వరగా తిరిగి ప్రజా జీవితంలోకి రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తన సందేశంలో వెల్లడించారు.

**కెసిఆర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది: హెల్త్ బులెటిన్**

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై యశోద ఆసుపత్రి వైద్యులు హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశారు. నీరసం కారణంగా ఆయనను ఆసుపత్రిలో చేర్చినట్లు వైద్యులు తెలిపారు. ప్రాథమికంగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో కేసీఆర్ రక్తంలో బ్లడ్ షుగర్ స్థాయులు అధికంగా, సోడియం మోతాదు తక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. అయితే, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు స్పష్టం చేశారు.

# అప్పటి మున్సిపల్ మంత్రి ఆదేశాలతో నిధులు విడుదల

>> అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నిస్తోంది. ఎఫ్‌ఈవో కంపెనీకి దాదాపు రూ.45 కోట్లు 71 లక్షల నగదును బదిలీ చేశారు. వాటికి సంబంధించే మూడో సారి అరవింద్ కుమార్‌ను విచారణకు పిలిచి ఏసీబీ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తోంది. అయితే రెండు సార్లు కేటీఆర్‌ను విచారణ జరిపిన సమయంలో ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని గతంలో అరవింద్ కుమార్‌ను ప్రశ్నించారు. అలాగే అరవింద్ కుమార్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కేటీఆర్‌ను కూడా ప్రశ్నించారు. ఇక రెండో సారి కేటీఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ప్రస్తుతం ఐఏఎస్ అధికారిని ఏసీబీ ప్రశ్నిస్తోంది.

హైదరాబాద్‌లో 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్ కోసం విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్దంగా సొమ్ము చెల్లించడం వల్ల ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఏసీబీ కేసు నమోదు చేసింది. రేస్ నుంచి ఫార్ములా-ఈ ఆపరేషన్స్(ఎఫ్‌ఈవో) సంస్థ తప్పుకొన్న అనంతరమూ నిధులు ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందనే కోణంలో ఆరా తీస్తోంది. కాగా, అప్పటి మంత్రి స్వయంగా వాట్సప్ ద్వారా ఎఫ్‌ఈఓకి నిధులు విడుదల చేయాలని ఆదేశించారు అని ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్ ఏసీబీ విచారణలో తెలిపారు. ఇందులో నాకు ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదు. బిజినెస్ రూల్స్,ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని మంత్రికి చెప్పాను... ఎప్ఈఓ కంపెనీకి వెంటనే నిధులు విడుదల చేయాలని, అవ్వని నేను చూసుకుంటానని మంత్రి చెప్పారని అరవింద్‌కుమార్ వెల్లడించారు. దీంతో 45.71కోట్ల రూపాయలనగదును ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ద్వారా బ్రిటన్‌పౌండ్స్ రూపంలో చెల్లించామని తేల్చి చెప్పారు.



## కాంగ్రెస్ లోక్‌సభ చీఫ్‌విప్ సురేశ్‌తో ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** కేరళ రాష్ట్ర మావళికర సీనియర్ ఎంపి, లోక్ సభలో కాంగ్రెస్ పార్టీ చీఫ్ విప్ కె.సురేశ్ గురువారం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎర్రమంజిల్ లోనీ ఆర్ అండ్ బి కార్యాలయంలో ఆయనతో సమావేశమై పలు అంశాలు చర్చించారు. కె.సురేశ్ కేరళ నుండి 8సార్లు ఎన్నికైన సీనియర్ లోక్ సభ సభ్యుడని, తను ఎంపీగా ఉన్నపుడు ఆయనతో పార్లమెంట్ లో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర మంత్రిగా ఆయనతో భేటీ సంతోషకరం అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారంగా మారిందని, అయినా వెల్ఫేర్, డెవలప్మెంట్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎక్కడా తగ్గకుండా పనిచేస్తున్నామని తెలిపారు.

## నేడు రోశయ్య విగ్రహావిష్కరణ

**హైదరాబాద్ (సంజీవరెడ్డినగర్), జూలై 3, ప్రభాతవార్త:** మాజీముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహం ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపడంపై రోశయ్య మెమోరియల్ ఫోరమ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం రోశయ్య నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మెమోరియల్ ఫోరమ్ సభ్యులు కామిశెట్టి అనిల్‌కుమార్, ఫెడరేషన్ ఆఫ్ అవోపాస్ జాతీయ అధ్యక్షుడు సి.ఏబెల్లి శ్రీధర్, రోశయ్య కుమారుడు శివసుబ్బారావ్ మాట్లాడుతూ గత రోశయ్య వర్ధంతి సభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రోశయ్య జయంతి జూలై 4న అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించడం హర్షనీయమన్నారు. అంతేకాకుండా అతి తక్కువ సమయంలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటుచేసి నేడు ఆవిష్కరణ చేయడంపై యావత్తు వైశ్యజాతి ఆనందం వ్యక్తం చేస్తుందన్నారు. అలాగే రోశయ్య జ్ఞాపకార్థం అమీర్‌పేటలోని ప్రకృతి వైద్యశాలకు కె.రోశయ్య ప్రకృతి వైద్య శాలగా పేరు పెట్టడం గర్వకారణమన్నారు. శుక్రవారం జరగబోయే రోశయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి, జయంతి సభకు తెలుగు రాష్ట్రాల వైశ్యులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## బాలి సముద్ర జలాల్లో చిన్ననౌక మునక

### 61 మంది ఆచూకీ గల్లంతు.. నలుగురి మృతదేహాలు స్వాధీనం

### 20 మందిని అపస్మారకస్థితిలో ఉండగా రక్షించిన బృందాలు

**బాలి(ఇండోనేసియా), జూలై 3:** ఇండోనేసియాలోని బాలి సమీపంలోని సముద్రజలాల్లో ఒక పడవ మునిగిపోవడంతో సుమారు 61 మంది ఆచూకీ గల్లంతయింది. కెఎంపి తునా ప్రతమా జయా అనే ఈ భారీ పడవ ప్రయాణీకులతో 30 మైళ్ల దూరంలోని గిలిమనుక్ రేవుకు వెళుతోంది. రాత్రి 10.56 గంటలకు తూర్పుజావా ప్రావిన్స్ నుంచి బయలుదేరని ఈ చిన్నపాటి నౌక 11.20 గంటలకల్లా మునిగిపోయిందని రక్షణ ఏజెన్సీ సురబయా వెల్లడించింది. ఈ పెద్ద పడవ బయలుదేరిన 20 నిమిషాలకే మాకు సందేశం వచ్చిందని వెంటనే సహాయక బృందాలను పంపించినట్లు కోఆర్డినేటర్ సెటియాబుడి వెల్లడించారు. అయితే 2.5 మీటర్ల ఎత్తువరకూ అలలు రావడంతో సహాయక చర్యలు కష్టం అవుతున్నదన్నారు. ఈ పడవలో 53 మంది ప్రయాణీకులు 12 మంది సిబ్బంద ఇమ ఒత్తం 65 మంది ఉన్నట్లు తేలింది. వీటితోపాటే 22 వాహనాలు వాటిలో 14 ట్రక్కులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం నాలుగు మృతదేహాలు లభించాయని, 20 మందిని రక్షించామని వీరంతా స్పృహలేనిస్థితిలోఉన్నారని పోలీస్ చీఫ్ రమా సమ్‌తామా పుత్రా వెల్లడించారు. బాలిద్వీపంలో ఇలాంటిప్రమాదాలు సాధారణం అయిపోయాయి. సుమారు 17 వేల ద్వీపాల సమూహంగా ఉన్న ఇండోనేసియాలో జలరవాణాకే ఎక్కువ ప్రాధాన్యం. మౌలికవసరుల లేమి, కార్గో, ప్రయాణీకుల ఓవర్‌లోడింగ్, భద్రత కార్యాచరణలు మందగించడం వంటి వాటితో తరచూ ఈప్రమాదాలు సంభవిస్తున్నాయి. 2018లో లేక్ తోబా వద్ద ఇలాగేప్రమాదంజరిగి 150 మంది చనిపోయారు. గత మార్చినెలలోకూడా 16 మందితో వెళుతున్న పడవ ఒకటి మునిగిపోయింది. సముద్రంలో వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోతుండటం కూడా ఇందుకు కారణం అవుతోంది.



## పాక్ సరిహద్దుల్లో అధునాతన అపాచీ హెలికాప్టర్ల మొహరింపు

**న్యూఢిల్లీ, జూలై 3:** ఆపరేషన్ సిందూర్ అనంతరం సరిహద్దుల్లో రక్షణను మరింత బలోపేతం చేయాలని భారత్ నిర్ణయించింది. ఈ క్రమంలో అత్యాధునిక అపాచీ బీ64ని అటాక్ హెలికాప్టర్లను పాకిస్థాన్ సరిహద్దులో మోహరించనుంది. ఈ మేరకు అమెరికాతో గతంలోనే భారత్ ఒప్పందం చేసుకుంది. అమెరికా తయారీ ఆధునిక యుద్ధ హెలికాప్టర్లు అపాచీ బీ 64లు ఈ నెలలో భారత్‌కు చేరనున్నాయి. మొదటి విడతగా ఈ నెలలో మూడు హెలికాప్టర్లు భారత్‌కు రానున్నాయి. మిగిలిన మూడు ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నాయి. మొత్తం ఆరు అపాచీల కోసం భారత్ 2020లోనే అమెరికాతో 600 మిలియన్ డాలర్ల (రూ.5 వేల కోట్లు) విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. వాస్తవానికి గత ఏడాది మార్చి నెలలోనే ఈ యుద్ధ హెలికాప్టర్ల డెలివరీ పూర్తి కావాల్సి ఉండగా, పలు లాజిస్టిక్ కారణాల వల్ల ఆలస్యమైంది. అపాచీ యుద్ధ హెలికాప్టర్ల ప్రత్యేకతల విషయానికి వస్తే డబుల్ టర్బైన్ ఇంజిన్ ఉన్న ఈ హెలికాప్టర్లు అధిక ఎత్తులో కూడా పూర్తి సామర్థ్యంతో పనిచేస్తాయి. క్షిపణులు, రాకెట్లు, గన్ వంటి శక్తివంతమైన ఆయుధ వ్యవస్థ ఇందులో ఉంటుంది. పగలు, రాత్రి ఆపరేషన్లలో కూడా సమర్థంగా పనిచేయగల సామర్థ్యం దీని సొంతం. రియల్ టైమ్ టార్గెట్ ట్రాకింగ్, హైవిజన్ నైట్‌విజన్ టెక్నాలజీ వంటి ఆధునిక ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ఇది అత్యంత కచ్చిత్వంతో లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం కలిగి ఉండటంతోపాటు శత్రువాహనాలు, బంకర్లు, ట్యాంకులు వంటి వాటిని ధ్వంసం చేయగలదు.

# హ్యామ్‌రోడ్లపై అపోహాలు వద్దు.. టోల్ వసూల్ ఉండదు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** తెలంగాణలో కొత్తగా చేపడుతున్న హ్యామ్ రోడ్ల కు సంబంధించి ఎలాంటి అపోహాలు వద్దని టోల్ వసూల్ లాంటిది ఏమి లేదని రోడ్లుభవనాలు శాఖ మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ హ్యామ్ రోడ్లపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని, కేబినెట్‌లో 5,190 కి.మి.ల నిడివితో రోడ్లు వేయడానికి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎక్కువ ట్రాఫిక్ ఉన్న అవసరం ఉన్న చోట 14 ప్యాకేజీల్లో ఆగస్టు చివరి నాటికి టెండర్ కాల్ ఫర్ చేసేలా ప్రయత్నం చేస్తున్నా మని ఆయన వివరించారు..సిఎం రేవంత్ రెడ్డి ఫైనల్ చేయగానే సెప్టెంబర్ నాటికి పనులు స్టార్ట్ చేసే అవకాశం ఉందని కొమటిరెడ్డి తెలిపారు. డిసెంబర్ జనవరి లో సెకండ్ ఫేజ్ కూడా స్టార్ట్ చేస్తామని ప్రకటించారు. ఆర్ అండ్ బి శాఖ రోల్ మోడల్ గా నిలవనుందిసిఎంతో మాట్లాడి ఆర్ అండ్ బి లో ఎన్నడూ లేని విధంగా ప్రమోషన్స్, పోస్టింగ్స్ ఇచ్చామని తెలిపారు. డి.ఈ నుండి ఈ.ఈ లుగా 72 మందికి ప్రమోషన్ ఇచ్చాం.64 మందికి ఆల్రెడీ పోస్టింగ్స్ ఇచ్చాంఈ.ఈ ల నుండి ఎస్.ఈ లు 29 మంది ప్రమోషన్, పోస్టింగ్స్ కొత్తగా ఏ.ఈ లు 181 మందినీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రిక్రూట్ చేసుకున్నాం.

డిపార్ట్‌మెంట్ బలోపేతం పై చర్చించడం జరిగింది. అందరూ బాగా పని చేయాలని ఇవాళ దిశానిర్దేశం చేశాను. మెయిం టెన్స్ ఆఫ్ రోడ్స్‌పై డిస్కస్ చేశాం. వానకాలం సీజన్‌కు అలెర్ట్ గా ఉండాలని బ్రిడ్జి, కల్వర్టులు వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాను. క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని ఆదేశించాను రోడ్ ప్యాచ్ వర్క్ ల కోసం ఈనెలలో 140 కోట్లు రిలీజ్ చేస్తామని మంత్రి తెలిపారు. ఈ.ఈ.ఎస్.ఈ లతో రాష్ట్రంలోని ప్రతి రోడ్ గురించి సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు కోసం ముఖ్యమంత్రితో కల్సి వెళ్లి ప్రధాని మోడీ, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలుస్తాం..రీజనల్ రింగ్‌రోడ్డుతో హైదరాబాద్, చుట్టుపక్కల ముఖ చిత్రమే మారబోతోందని ఆశాభావం వ్యక్తంచేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కొమటిరెడ్డి కోరారు. కేసీఆర్ వస్తే అన్ని అంశాలపై చర్చ జరుపుతామని ఆయన అన్నారు. హరీశ్‌రావు, కెటిఆర్‌లతో మాకు సంబంధం లేదని అన్నారు.

వాళ్లు లెక్కలోకి రారు. కెసిఆర్ మేం ఉద్యమంలో పనిచేశామని ఆయన తెలిపారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే హరీశ్‌రావు ఉత్తి ఎమ్మెల్యే అని ఆయన డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కాదని అన్నారు. అసెంబ్లీకి ప్రతిపక్ష నేత వచ్చి మా తప్పు ఒప్పులు చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిలదీశారు

# ఉత్తరప్రదేశ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

### అక్కడి ఉద్యోగులకు అండగా ఉంటాం

### తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ జెఎసిలు

### జూలై 9న 27లక్షల మంది విద్యుత్ ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె




సదస్సులో పాల్గొన్న నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజినీర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్త

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 3 ప్రభాతవార్త:** ఉత్తర్రపదేశ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీ కరణను అడ్డుకోవడంతోపాటు అక్కడి ఉద్యోగులకు అండగా ఉంటామని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీలు ప్రకటించాయి. విద్యుత్ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిఘటిస్తామని హెచ్చరిం చారు. అదేవిధంగా జూలై 9న 27లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిపిఈజేఏసీ) ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ జేఏసీల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించడం జరిగింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో రెండు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ప్రైవేటు పరం చేస్తున్నందుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎన్‌సిసిసి ఒఇఇ (నేషనల్ కోఆర్డి నేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రి సిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె విజయ వంతం చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగింది. ఉత్తరప్రదేశ్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను ప్రైవేటీకరిస్తే దేశవాప్త సమ్మె చేయడానికి వెనకాడబోమని హెచ్చరించారు. సమావేశంలో నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కన్వీనర్, సుదీప్ దత్త మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న 27 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఐపీఎఫ్) పాట్రన్ అశోక్ రావు మాట్లాడుతూ విద్యుత్ విద్యుత్ ప్రైవేట్ ఇస్తే ధరలు సగటు మనిషికి అందుబాటులో ఉండవని, విద్యుత్తు అత్యంత ఖరీదైన వస్తువుగా మారుతుందని, రైతులకు సామాన్య పౌరులకు భారమవుతుందని తెలిపారు. ఎలాగైనా విద్యుత్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, కోచైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీ రెడ్డి, అనిల్ కుమార్, చైర్మన్ రాధాకృష్ణ. ఆంధ్రప్రదేశ్ జేఏసీ చైర్మన్ కృష్ణయ్య, ఇంజనీర్ల సంఘం జనరల్ సెక్రటరీ కే నాగప్రసాద్, కన్వీనర్ రాఘవరెడ్డి, ప్రతాపరెడ్డి, కో చైర్మన్ శేషారెడ్డి పాల్గొన్నారు.

# బహిరంగసభలో అదనపు ఎస్పీని అవమానించిన సిఎం

### రాజీనామా సమర్పించిన పోలీసు అధికారి బరమణి

**బెళగావి, కర్ణాటక, జూలై 3:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనను బహిరంగంగా అవమానించి, చెంపదెబ్బ కొట్టేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తూ ఓ సీనియర్ పోలీసు అధికారి స్వచ్ఛంద పదవీ విరమణ (విఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకోవడం సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనతో తీవ్ర మన స్తాపానికి గురయ్యానని, తన ఆత్మగౌరవం దెబ్బ తిన్నదని అదనపు ఎస్పీ ఎన్వీ బరమణి తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ యేడాది ఏప్రిల్ 28న బెళగావిలో కాంగ్రెస్ పార్టీ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఓ నిరసన సభ నిర్వహించింది.

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పాల్గొన్న ఈ సభలో వేదిక వద్ద బందోబస్తు విధుల్లో ఎఎస్పీ బరమణి ఉన్నారు. ఈ క్రమంలో కొందరు బిజెపి మహిళా కార్యకర్తలు సభకు అంతరాయం కలిగించడంతో సిఎం సిద్ధరామయ్య తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. వెంటనే వేదికపై ఉన్న బరమణిని పిలిచి 'హేయ్! ఎవరు ఇక్కడ ఎస్పీ? బయటకు వెళ్లు!' అని అందరి ముందూ గట్టిగా అరిచినట్టు బరమణి తెలిపారు. అంతటితో ఆగకుండా, తనను చెంపదెబ్బ కొట్టేందుకు చెయ్యి పైకి లేపారని, తాను వెంటనే వెనక్కి జరగడంతో త్రుటిలో ఆ దాడి నుంచి తప్పించుకున్నానని ఆయన వివరించారు.

ఈ ఘటన మీడియాలో ప్రసారమవడంతో తీవ్ర అవమానానికి గురయ్యానని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. శారీరకంగా దాడి జరగకపోయినా,




వేలాది మంది ముందు జరిగిన ఈ అవమానాన్ని నేను తట్టుకోలేకపోయాను. ఈ ఘటన తర్వాత ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం ఆవరించింది. నా భార్యా పిల్లలు గుండెలవిసేలా ఏడ్చారు. 31 యేళ్లుగా నిజాయితీగా పనిచేసిన నాకు ఇలాంటి అవమానం జరగడం దారుణమని బరమణి పేర్కొన్నారు.

# గ్రూప్-1 పిటిషన్లపై కొనసాగిన వాదనలు

### తెలుగు మీడియం వారిపట్ల ఎటువంటి వివక్ష చూపలేదు

### కోర్టుకు తెలిపిన టిజిపిఎస్‌సి తరపు న్యాయవాది

### విచారణ నేటికి వాయిదా వేసిన హైకోర్టు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** హైకోర్టులో గ్రూప్-1పై దాఖలైన పిటిషన్లపై గురువారం వాదనలు కొనసాగాయి. టిజిపిఎస్‌సి వాదనలు విన్న హైకోర్టు.. విచారణను నేటి (శుక్రవారం)కి వాయిదా వేసింది. గ్రూప్-1 మెయిన్స్‌లో తెలుగు మీడియం అభ్యర్థుల సమాధాన పత్రాలు సరిగ్గా వాల్యుయేషన్ చేయలేదని, కోఠిలోని ఒక పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన అభ్యర్థులే ఎక్కువమంది ఎంపిక అయ్యారని .. మెయిన్స్ పరీక్షను పూర్తిగా రద్దు చేసి, మళ్ళీ పరీక్ష నిర్వహించాలని కొంతమంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్స్ దాఖలు చేశారు. అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. విచారణలో భాగంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) తరపున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య విషయంలో ఎలాంటి తేడా లేదన్నారు. నామినల్ రోల్స్, అభ్యర్థుల వేలిముద్రల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు చెప్పారు. కోఠిలోని ఒక పరీక్షా కేంద్రంలో రాసిన వారే ఎక్కువ మంది ఎంపికయ్యారనేది అవాస్తవమని.. అక్కడ ఉన్న రెండు కేంద్రాల్లో 1500 మంది అభ్యర్థులు మెయిన్స్ రాశారని.. మిగిలిన పరీక్షా కేంద్రాల్లో రాసిన వాళ్లలో అంతకంటే ఎక్కువ మందే ఎంపికయ్యారని కోర్టుకు తెలిపారు. కోఠిలోని రెండు కేంద్రాలను కేవలం మహిళలకు కేటాయించడంతో సౌకర్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని.. ఉద్యోగానికి ఎంపిక కాని అభ్యర్థులు ఏవేవో అనుమానాలతో పిటిషన్లు దాఖలు చేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పిటిషన్ దారులు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవని.. వారివి కేవలం అపోహాలు మాత్రమేనన్నారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియం అభ్యర్థుల పట్ల కమిషన్ ఎలాంటి వివక్ష చూపించలేదని.. వారు సమాధానం రాసిన అంశాలను బట్టి నిపుణులు మార్కులు వేశారని కోర్టుకు తెలిపారు. గ్రూప్-1కి ఎంపికైన తెలుగు మీడియం అభ్యర్థులు 9.95 శాతం ఉండగా, ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులు 89.88 శాతం, ఉర్దూ మీడియం వారు 0.1 శాతంగా ఉన్నారని నిరంజన్ రెడ్డి కోర్టుకి చెప్పారు. ఏపీలో రెండేళ్ల క్రితం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారని గుర్తు చేశారు. టిజిపిఎస్‌సికి తెలుగు.. ఇంగ్లీష్, ఉర్దూ మీడియం అభ్యర్థుల పట్ల ఎలాంటి వివక్ష లేదదని.. అందరికీ నిపుణులు ఎంపిక చేసిన అంశాల ఆధారంగా మార్కులు వేశారని సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. టిజిపిఎస్‌సి తరపున వాదనలు విన్న ధర్మాసనం.. ఎవాల్యూ యేటర్‌కి ఏమైనా మార్గదర్శకాలున్నాయా? అని ప్రశ్నించింది. అందుకు సమాధానంగా టిజిపిఎస్‌షి నుంచి వివరాలు తీసుకొని సీల్డ్ కవర్లో సమర్పిస్తామని నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. దీంతో హైకోర్టు ధర్మాసనం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.



తమ వారి జాడ చెప్పాలంటూ అధికారులతో వాగ్వాదానికి దిగిన బాధితులు

# మృతదేహాన్నయినా అప్పగించండి

### కార్మికుడి కుటుంబసభ్యుల రోదనలు

### పరిశ్రమ వద్దే బాధిత కుటుంబాల పడిగాపులు

### కొనసాగుతున్న సహాయక చర్యలు

**పటాన్‌చెరు/సంగారెడ్డి బ్యూరో, జూలై 3, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు సమీపంలోని పాశమైలారం సిగాచి పరిశ్రమ వద్ద తమ వాళ్ల ఆచూకీ చెప్పాలని, కిందపడి గుండెలవిసేలా బాధిత కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. తమ వారి జాడ చెప్పాలని, లేదంటే మృతదేహాన్ని అయినా అప్పగించాలని వారి కుటుంబ సభ్యులు పడుతున్న యాతన అందరినీ ఎంతగానో కలిచివేస్తోంది. ఘటన జరిగిన సిగాచీ పరిశ్రమ వద్దకు తరలి వస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు తమ వారి ఆచూకీ కోసం అక్కడ ఉన్న అధికారులను వేడు కుంటున్నారు. గురువారం పరిశ్రమ ముందు తమ కుమారుడు జస్టిన్ మృతదేహం అప్పగించాలంటూ తండ్రి రాందాస్ పోలీసుల ఎదుట తలను బండ రాయికి బాదుకున్నాడు. రక్త స్రవం కావడంతో వెంటనే ఆరోగ్య సిబ్బంది స్పందించి ప్రాథమిక చికిత్స అందించారు. కార్మికుడు జస్టిన్ ఉద్యోగంలో చేరి రెండురోజులే అయింది. అంతలోనే మృత్యు ఒడిలోకి వెళ్లాడని కుటుంబ సభ్యుల రోదనలు అందరి హృదయలను కలిసి వేశాయి. కార్మికుడి కుటుంబ సభ్యులను అక్కడ ఉన్న పోలీసులు సముదాయించి ఓదార్చారు..

**సిగాచి పరిశ్రమను పరిశీలించిన నిపుణుల కమిటీ**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు సమీపంలోని పాశమైలారం ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ గురువారం సిగాచి పరిశ్రమకు చేరుకుంది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ఘటనా స్థలాన్ని మూడున్నర గంటల పాటు క్షుణ్ణంగా పరిశీలించారు. శాస్త్రవేత్తలు వెంకటేశ్వరరావు, ప్రతాప్, సూర్యనారాయణ, సంతోష్ లతో కూడిన కమిటీ నెల రోజుల్లో ప్రమాదంపై నివేదిక ఇవ్వనుంది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. సిగాచి పరిశ్రమను నిపుణుల కమిటీ పరిశీలించిన అనంతరం పటాన్ చెరు, మదీనాగూడ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను పలకరించి, వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు.

# 'సింగిల్స్' మూవీ పైరసీ విక్రేత అరెస్ట్

### తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చి యేడాదిగా అక్రమ వ్యవహారం

### 40 సినిమాలు పైరసీ చేసినట్లు పోలీసులు వెల్లడి

### తెలుగు సినీపరిశ్రమకు రూ. 3,700 కోట్ల నష్టం



**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** ఓ తెలుగు చిత్రాన్ని సింగిల్ స్క్రీన్‌పై డిజిటల్ వీడియో తీసి అదే ఆన్‌లైన్‌లో అక్రమంగా విక్రయించిన పైరసీ దారుడును గురువారం నగర సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడాదిలో నలభై వరకు చిత్రాలను పైరసీ చేసినట్లు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ నరేశ్ తెలి పిన వివరాల ప్రకారం ఏపీ ఈస్ట్‌గోదావరి జిల్లాకు చెందిన జన కిరణ్‌కుమార్ (29) నగరానికి వచ్చి వనస్థలిపురంలోని ఎన్జీవో కాలనీలో ఏసీ టెక్ని షియన్‌గా పనిచేస్తున్నాడు. ఈజీమని సంపాదించేందుకు మూవీ పైరసీ చేయ డం మొదలెట్టాడు. ఇందుకు సంబంధించిన పైరసీ మూవీలను కొనుగోలు చేసేవారిని పరిచయం చేసుకున్నాడు. దీంతో ఏడాదిగా పైరసీలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అయితే మూవీ కంటెంట్‌ల లింక్‌లు పంపించి ఒప్పందం చేసుకుంటాడు. తాజాగా గత నెలలో 'సింగిల్స్' తెలుగుచిత్రం విడు దలైంది. అయితే నగరంలోని ఓ థియేటర్‌లోనే బ్లాక్‌లో టికెట్టు కొను గోలు చేసి మొబైల్‌తో సినిమాను అక్రమంగా వీడియో తీశాడు. ఆ తర్వాత ఈమెయిల్‌లో ముందు సమాచారం ఇవ్వడం ఆపై ఎవరికీ అనుమానం రాకుండా భద్రత చర్యలు చేపట్టి ఆన్‌లైన్ టెలిగ్రామ్‌లో పంపిస్తున్నాడు. పైరసీ గ్రూపులు అయిన తమిళ్‌ఎంవీ, తమిళ్‌బ్లాస్టర్స్‌తో పాటు మరొకటి దానికి పంపించి ఒక్కో సినిమాకు క్రిప్టో కరెన్సీలో చెల్లింపులు జరిగేలా రాజీ కుదుర్చుకొని వాటిని భారత్ కరెన్సీలోకి మార్చుకుంటున్నాడు. ఇటీవల సినిమాపై అనుమానం తలెత్తడంతో టీఎఫ్‌సీసీ ప్రతినిధి మణీంద్రబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతేడాది తెలుగు ఇండస్ట్రీ రూ.3700కోట్లు నష్టపోయిందని ఆయన పేర్కొన్నారు. వెంటనే దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ పోలీసులు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనపరుచుకొని రిమాండ్‌కు తరలించారు.

**పైరసీపై కఠినచర్యలు: ఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు**

సినీ పరిశ్రమలో పైరసీని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, ఇందు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్ ప్రియాంకతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రితో పలు కీలక సమావేశాలు నిర్వహిం చామని, సినిమా ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైతే నూతన నిబంధనల రూపకల్పన కూడా చేస్తామని చెప్పారు. ఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా , ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సినిమా షూటింగ్‌లకు ఆన్‌లైన్ అనుమతుల ప్రాసెస్‌తో పాటు వీడియో పైరసీ నియంత్రణకు కఠిన చర్యలు ఉంటాయని దిల్ రాజు పేర్కొన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందరం కలిసి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్. ప్రియాంక మాట్లాడుతూ సినిమా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అంశంపై సమీక్ష జరిపి, సాధ్యసాధ్యాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇండస్ట్రీ సమస్యలపై ఎవరైనా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తప్పకుండ తాము కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## రేపు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్.రాంచందర్‌రావు బాధ్యతల స్వీకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూలై 3:** బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్ రాంచందర్ రావు ఈ నెల 5న బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటగా ఆ రోజు ఉదయం 9 గంటలకు అసెంబ్లీ దగ్గర్లో ఉన్న గన్‌పార్క్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తారన్నారు. తర్వాత ఉదయం 10 గంటలకు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు, కేంద్రమంత్రులు, ఎంపిలు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, బిజెపి రాష్ట్ర పదాధికారులు, బిజెపి సీని యర్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొంటా రన్నారు. అనంతరం 11 గంటలకు భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహిస్తారన్నారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT : HYDERABAD
O.A. No. 137 of 2025

ICICI Bank Limited ...Applicant
AND
Bommepalle Jayarami Reddy ...Defendants

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
1. Bommepalle Jayarami Reddy S/o Narayana Reddy, Aged about: Major, Occ: Business, R/o: Kopparthi (V), Near Water Tank, Sree Ranga Raju Palli, CK Dinne, Cuddapah- 516216. A.P. ...Defendants

Please take the summons in the above O.A. No. 137 of 2025 filed by the Applicant for Recovery of Money Rs. 26,72,357.78Ps/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "Vartha" Telugu daily newspaper and posted the matter on 04.08.2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under Serial No. 3A of the original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under Serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 04.08.2025 at 10.30 A.M. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad- 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
2 day of July, 2025.
(By order of the Court)
Registrar
Debts Recovery Tribunal- II
Hyderabad

> తప్పులు చేయకుండా ఉండే శక్తి మనిషికి లేదు. కానీ తమ తప్పులు, దోషాల ద్వారా వివేకవంతులు భవిష్యత్తుకవసరమైన జ్ఞానం పెంపొందించుకుంటారు.
>
> -ఒవిడ్

# పతనం అంచున ప్రజారోగ్యం?

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే ఆశయం, లక్ష్యంకోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, దేశ ప్రజలందరికి వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని పాలకులు ఎంతగా చెప్తున్నా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్నో లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామసీమల్లో ఆరోగ్యపరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పొచ్చు. అందరికి వైద్యం అనేదిఇన్నేళ్లు దాటిపోయినా కనుచూపుమేరలో కన్పించడం లేదు. నేటికీ భారత్‌లో దాదాపు నలభైకోట్ల మందికిపైగా అత్యవసర మందులు అందుబాటులో లేవని అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అన్నింటికంటే ప్రధానంగా దిగువ, మధ్య తరగతి పెట్టే ఖర్చులో దాదాపు డెబ్భైశాతానికిపైగా మందుల కొనుగోళ్లకే ఖర్చు చేస్తున్నారు. అందులో నాసిరకం, నకిలీవి కూడా ప్రజారోగ్యాన్ని పతనం అంచునకు తీసుకుపోతున్నాయి. దేశవ్యాప్తంగా దాదాపు ఇరవైఐదువేలకు పైగా రకాల మందులు నమోదై ఉంటే అంతకు రెట్టింపు స్థాయిలో అనధికారికంగా చెలామణి అవుతున్నాయి. ఒక వ్యూహం ప్రకారం నకిలీ, నాణ్యతలేని మందులను మార్కెట్లో ప్రవేశపెడుతున్నారు. మందుల్లో ప్రామాణికత దెబ్బతినడం వల్ల చోటుచేసుకుంటున్న అనర్థాలు అన్నీఇన్నీకావు. గతంలో నకిలీ మందులు వాడడంతో ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ముంబయిలో నాసిరకంమందులతో డజన్ మందికిపైగా మరణించడంతో జస్టిస్ లెంటిన్ కమిషన్‌ను ఆనాటి ప్రభుత్వం నియమించింది. సమగ్ర దర్యాప్తు, అధ్యయనం అనంతరం మంత్రిత్వస్థాయి మొదలు దిగువస్థాయి వరకు ఆరోగ్య ఔషధాలలోని లొసుగులను, వైఫల్యాలను ఎత్తిచూపుతూ లెంటిన్ తన నివేదికలో స్పష్టంగా ఆనాడే పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వం కానీ, ఆ తర్వాత కానీ ఆ ప్రతిపాదనలు పట్టించుకున్నట్లు కన్పించదు. చివరకు విదేశాలకు ఎగుమతులు చేసే మందుల్లో కూడా నాసిరకం బయటపడింది. ఇంత భారీ ఎత్తున నకిలీ, నాసిరకం విస్తరిస్తున్నా అవసరమైన చర్యలు తీసుకొని నివారించడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. నకిలీ మందుల వల్ల కలిగే దుష్ఫలితాలు అటుంచి జబ్బుతగ్గకపోవడంతో వైద్యుడి వైఫల్యమా? ఉపయోగించిన మందులు కారణమా? అర్థంకాక వైద్యులు కూడా మళ్లీ మళ్లీ పరీక్షలు చేయిస్తూ ఇతర మందులతో రోగులపై ప్రయోగాలు చేస్తున్నారు. అందువల్ల రోగి ఆరోగ్యంతోపాటు ఆర్థికపరంగా కూడా కుప్పకూలిపోతున్నాడు. అసలు వైద్య, ఆరోగ్యం విషయంలో నిర్దిష్టమైన ప్రణాళికలు, ముందుచూపు లేకపోవడమే వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా అవినీతి, అంతకుమించి నిర్లక్ష్యం, ఉదాసీనతతోపాటు వైద్యఆరోగ్య రంగంలో సిబ్బంది కొరత కూడా ఈ పరిస్థితికి కారణాలనేది కాదనలేని వాస్తవం.

గత నాలుగైదు వారాలుగా దేశంలో విస్తరిస్తున్న విషజ్వరాలు, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఇటీవల దేశంలోని అనేక రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూ వ్యాధి పంజా విసురుతుంది. ఈ యేడాది తెలంగాణలో జనవరి నుంచి మార్చి చివరి నాటికి దాదాపు రెండువందల డెబ్భై కేసులు నమోదు కాగా మార్చి నుంచి జూన్ చివరి వరకు ఎనిమిదివందల డెబ్భై కేసులకుపైగా నమోదయ్యాయి. గత నెలలోనే ఐదు వందలకుపైగా కేసులు నమోదైనట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. గత యేడాది రాష్ట్రవ్యాప్తంగా పదివేల కేసులు నమోదుకాగా అందులో జులై నుంచి డిసెంబర్ వరకే తొమ్మిదివేల కేసులు రికార్డుఅయ్యాయి. ఈయేడాది ఇది మరింత విస్తరించే అవకాశం ఉందని వైద్యరంగ నిపుణులే హెచ్చరిస్తున్నారు. డెంగ్యూ వ్యాధికి నిర్దిష్టమైన చికిత్స లేదనే చెప్పొచ్చు. దీనికితోడు సోకింది మామూలు జ్వరమా? లేక డెంగ్యూనా, లేక ఇంకొకటాని తెలుసుకోవడానికే గ్రామీణులకు రోజుల తరబడి సమయం పడుతున్నది. ఈలోగా వ్యాధి ముదిరి ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. వీటితోపాటు చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ లాంటి వ్యాధులు కూడా విస్తరిస్తున్నాయి. వాస్తవానికి సీజన్ వ్యాధుల కట్టడికి పటిష్టమైన ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా నిర్దిష్టమైన అడుగులు వేస్తున్నట్లు కన్పించడం లేదు. పెరుగుతున్న వ్యాధులకు అనుగుణంగా దేశవ్యాప్తంగా పరిశీలించినా ఆస్పత్రులు కానీ, సిబ్బందిగాని లేరనే చెప్పొచ్చు. ఉన్న సిబ్బందిని కూడా మారుమూల గ్రామాలకు పంపి వైద్యసేవలు అందించడంలో పాలకులు విఫలమవుతున్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న బడుగు వర్గాల కుటుంబాలకు కనీస వైద్యం అందుబాటులోలేదు. దీంతో గ్రామాల్లో వచ్చీరాని వైద్యంతో డాక్టర్లుగాచెలామణి అవుతూ తోచినమందులు ఇచ్చేవారు కూడాతక్కువసంఖ్యలో లేరు. కనీసం మందుల పేర్లు రాయలేనివారు డాక్టర్ల జాబితాలో చేరిపోతున్నారు. చిన్నచిన్న ఆపరేషన్లు చేయడానికి వెనుకాడడం లేదు. అర్హతలేని ఇలాంటివైద్యులు చేసే చికిత్సలతో కొన్నిసందర్భాల్లో ప్రాణాలుగాలిలో కలిసిపోతున్నాయి. ఈపరిస్థితి అంతకంతకు పెరుగుతుండడం ఆందోళన కలిగించేఅంశం. ప్రపంచ ఆరోగ్యసంస్థ గతంలో విడుదలచేసిన నివేదికప్రకారం వైద్యం చేసేవారిలో యాభైఏడు శాతానికిపైగా ఎటువంటి విద్యార్హతలు లేనివారనే విషయం బయటపడింది. అల్లోపతితోపాటు, హోమియోపతి, ఆయుర్వేదం, యూనాని, సిద్ధ, యోగా విధానాల్లో వైద్యులతో కలిపి భారత్‌లో లక్ష జనాభాకు ఎనభై నుంచి వంద మందికంటే మించిలేరు. రాబోయే రోజుల్లో ప్రజారోగ్యం అత్యంత క్లిష్టపరిస్థితులు ఎదుర్కోబోతున్నట్లువైద్య నిపుణులే అభిప్రాయపడుతున్నారు. పాలకులు ఇప్పటికైనా గత అనుభవాలతో పాఠాలునేర్చుకొని ప్రజారోగ్యంఎదుర్కోబోతున్న సవాళ్లకు అనుగుణంగా సమాయత్తం కావాలి.

> ఘర్షణ వల్ల శక్తి వృథా అవుతుంది.
> హెచ్చుతగ్గులు వస్తాయి.
> ఆందోళనలు చెలరేగుతాయి.
> అశాంతి కలుగుతుంది.



ఐ.జాన్సన్

> చీకటిలో ఉన్నప్పుడు తచ్చాడి
> వెలుగు కోసం ప్రయత్నించాలి
> గాని, ఎవరో వెలుగును
> ప్రసాదిస్తారని ఉన్న చోటనే
> ఉండకూడదు.



వీరేశలింగం

# బాలల్లో 'మానసిక ఆరోగ్యం' పెంచాలి

*గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య సలహాలు (కౌన్సిలింగ్) అందుబాటులోకి తేవాలి. కథా వేదికలు, ఆటల పండుగలు నిర్వహించాలి. పల్లెల్లో పిల్లల క్లబ్‌లు, కథా వనాలు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. చైతన్య కార్యక్రమాలు జరగాలి. నేరరహిత సమాజాన్ని నిర్మించాలంటే చిన్నతనం నుండే పిల్లలకు విలువలు, సంస్కారంతో కూడిన నడవడికకు అలవాటు చేయాలి. బాల్యం మొగ్గ లాంటిది. దానిని ఎలా పెంచుతామో అలాగే అది వికసిస్తుంది. ప్రేమతో, సహనంతో, మంచి విలువలతో బాల్యాన్ని బలంగా తీర్చిదిద్దితే రేపటి సమాజం కూడా బాగుంటుంది. తిరిగి రానిది ఎంతో మధురమైనది బాల్యం. దానిని వ్యసనాలకు బానిసలుగా మార్చుకొని భవిష్యత్తును అంధకారంగా మార్చుకోకండి. నేటి బాలలే రేపటి దేశ భవిషత్తు. అలాంటి భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరికీ, వ్యవస్థలకు వుంది. బాల్యాన్ని జ్ఞాపకంగా మార్చుకోండి గాయంగా కాదు.*

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు మనల్ని తీవ్ర ఆవేదనలో ముంచుతున్నాయి. ఫోన్ ఇవ్వలేదని, మొబైల్‌లో గేమ్ ఆడనివ్వలేదని 12, 14, సంవత్సరాల పిల్లలు ప్రాణాలు తీసుకోవడం, తన ప్రేమకు అడ్డు వస్తుందని ఒక బాలిక వాళ్ల తల్లిని చంపడం, వంటివి ఎన్నో సంఘటనలు నిత్యం నేటి సమాజంలో జరుగుతున్నాయి, వీటిని మనం ఎప్పుడైనా ఊహించమా? ఒక్కసారి ఆలోచించండి – ఏ వయసులో జీవితం ప్రారంభించాలో ఆ వయసులోనే జీవితం ముగింపు చూపడం ఎలాంటి ప్రమాదకర పరిస్థితికి సంకేతం?. పిల్లలను చిన్నతనం నుండి పద్ధతిగా పెంచకుండా, విలువలు నేర్పకుండా, మంచి చెడు చెప్పకుండా పెంచితే వారు పెద్దవాళ్ళు అయ్యాక దాని పర్యవసానాలు చాలా ప్రమాదకరంగా ఉంటాయి. అవి కుటుంబం మీదే కాకుండా సమాజం మీద కూడా చెడు ప్రభావాన్ని చూపిస్తాయి. ఒకప్పుడు అమ్మ చందమామను చూపిస్తూ అన్నం తినిపించేది ఇప్పుడు మొబైల్ చూపిస్తూతినిపిస్తుంది. అదే వ్యసనంగా మారి పిల్లలలో మానసిక వైకల్యానికి దారి తీస్తుంది. తల్లిదండ్రులు తమ ప్రశాంతత కోసం పిల్లలకు మొబైల్ ఫోన్లు అలవాటు చేస్తే భవిష్యత్‌లో ఎవ్వరికీ ప్రశాంతత లేకుండా చేస్తున్నారనేది నిజం. దానితో పాటు నేడు పాఠశాల, కళాశాలల స్థాయిలోనే పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి టీనేజ్ వయసు కూడా దాటకముందే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడం, నేరస్తులుగా మారడం అనేది కూడా ఆందోళన కలిగించే అంశం. ఇది ప్రతీ ఇంట్లో, సమాజంలోనూ, దేశంలో బలంగా చర్చించాల్సిన అంశం. బాల్యం అనేది ఒక వ్యక్తి జీవితానికి పునాది. అది బలంగా విలువలతో కూడి ఉంటేనే మనిషి మంచి జీవితాన్ని నిర్మించుకోగలడు. కానీ అదే బాల్యం దారి తప్పితే జీవితం దిక్కుతెలియని దారిలో నడుస్తుంది. అదే కాకుండా కుటుంబం, సమాజం, దేశం కూడా దాని పర్యవసానాలు ఎదుర్కొంటుంది. ఒకప్పుడు మట్టిలో ఆడిన బాల్యం ఇప్పుడు స్క్రీన్‌లోనే బంధించబడింది. చెట్టు కింద కథలు విన్న ఆ రోజులు.. ఇప్పుడు ఆన్లైన్ ఆటలతో సాగిపోతోంది స్నేహితులతో పెట్టిన ముచ్చట్లు నవ్వుకున్న రోజులు ఇప్పుడు సోషల్ మీడియా మాయలో కనుమరువుతున్నాయి. పిల్లలకు నీతి కథలు చెప్పేవారు కరువయ్యారు,

**జి. అజయ్ కుమార్**

ఉమ్మడి కుటుంబాలు లేక పెద్దవారి పర్యవేక్షణ లోపించి పిల్లలలో మానసిక వికాసాన్ని పెంపొందించే విధానం లోపించింది. మొబైల్ స్క్రీన్ బానిసత్వం ఒంటరితనం, మూడ్ స్వింగ్స్ మానసిక ఒత్తిడి, డిప్రెషన్ మత్తుపదార్థాల వ్యసనం, చిన్న వయసులో ఆత్మహత్యల యత్నాలు, నేరపూరిత స్వభావం ఈ పరిస్థితులన్నీ మాటల్లో చెప్పదగ్గవే కాదు. గణాంకాలు కూడా చెబుతున్నాయి. ఇటీవల ఒక సంస్థ లెక్కల ప్రకారం 12–17 ఏళ్ల వయసు పిల్లల్లో 26 మంది డిజిటల్ అడిక్షన్ బారినపడ్డారు. వారిలో డిప్రెషన్



కేసులు కూడా 40వరకు పెరిగాయి. రోజుకి 2 గంటలకంటే ఎక్కువ స్క్రీన్ టైమ్ వల్ల పిల్లల్లో మానసిక స్థిరతపై తీవ్రమైన ప్రభావం పడుతోంది. దీనివలన మానసిక కుంగుబాటు, ఒంటరితనం, ఆత్మహత్య ఆలోచనలు కలుగుతాయి. చైల్డ్ లైన్ నివేదిక ప్రకారం బాలలపై వేధింపుల కేసులు 300వరకు పెరిగాయి. యూనిసెఫ్ లెక్కల ప్రకారం భారత దేశంలో మత్తుపదార్థాల తొలిసారి వినియోగం వయస్సు – సగటున 11.5 ఏళ్లు అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పిల్లల్ని ఏడవకుండా ఉంచేందుకు ఫోన్ ఇవ్వడం ప్రేమను పంచకుండా స్క్రీన్‌ని ప్రత్యామ్నాయంగా ఉపయోగించడం, ఎప్పుడూ బిజీగా ఉండి వారితో రోజుకు కొంత సమయం కూడా గడపకపోవడం, పిల్లలకు వ్యక్తిగత గదులు ఇచ్చి వాళ్ళు ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, వంటివి పట్టించుకోకపోవడం, మార్కులు, ర్యాంకుల మాత్రమే ప్రాధాన్యంగా నడిచే విద్యాసంస్థలు ఆటలకు, భావోద్వేగాలకు, విలువలు నేర్పడానికి మొగ్గు చూపకపోవడం విలువలతో కూడిన విద్యాబోధన లేకపోవడం, విద్యాలయాల్లో పిల్లలు ఏంచేస్తున్నారు, చేడుఅలవాట్లకు ఏమన్నా బానిసలుగా మారుతున్నారా అనే పర్యవేక్షణ లేకపోవడం, హింసాత్మక, అసభ్య కంటెంట్ సులభంగా అందుబాటులో ఉండటం, ప్రతి ఇంట్లో ఇంటర్‌నెట్ అందుబాటులోకి రావడం, పిల్లలు ఏం చూస్తున్నారో తల్లిదండ్రులు పట్టించుకోవడం వల్ల వారికి స్వేచ్ఛ పెరగడం, గేమ్స్, రీల్లు మానసికంగా కలుషితపరచడం, పిల్లల ఆటలకు స్థలాల లేమి, మితిమీరిన పోటీ వాతావరణం, పిల్లల ప్రవర్తనను గమనించకుండా పెద్దలు తమ జీవితాల్లోనే బిజీగాగడపడం, ఇలాంటి దుష్పరిణామాలకు కారణంగా ఉన్నాయి. పిల్లులు మొబైల్ చూసే స్క్రీన్ టైమ్‌పై పరిమితి విధించాలి పిల్లలతో రోజూ కనీసం 1 గంట కలసి గడపాలి. ప్రేమతో కూడిన సంభాషణలు, విలువల బోధన అవసరం. ప్రకృతి, పుస్తకాలు, ఆటలవైపు వారిని ప్రోత్సహించాలి. విలువల బోధనను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి. ఆటలు తప్పనిసరి భాగంగా ఉండాలి. పిల్లల మనోభావాలను గుర్తించి ఆ దిశగావిద్యార్థులను ప్రోత్సహించాలి. హానికర కంటెంట్‌పై నియంత్రణ విధించాలి. స్క్రీన్ టైమ్ నియంత్రణ విధానాలు పెట్టాలి. గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య సలహాలు (కౌన్సిలింగ్) అందుబాటులోకి తేవాలి. కథా వేదికలు, ఆటల పండుగలు నిర్వహించాలి. పల్లెల్లో పిల్లల క్లబ్‌లు, కథా వనాలు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. చైతన్య కార్యక్రమాలు జరగాలి. నేరరహిత సమాజాన్ని నిర్మించాలంటే చిన్నతనం నుండే పిల్లలకు విలువలు, సంస్కారంతో కూడిన నడవడికకు అలవాటు చేయాలి. బాల్యం మొగ్గ లాంటిది. దానిని ఎలా పెంచుతామో అలాగే అది వికసిస్తుంది. ప్రేమతో, సహనంతో, మంచి విలువలతో బాల్యాన్ని బలంగా తీర్చిదిద్దితే రేపటి సమాజం కూడా బాగుంటుంది. తిరిగి రానిది ఎంతో మధురమైనది బాల్యం. దానిని వ్యసనాలకు బానిసలుగా మార్చుకొని భవిష్యత్తును అంధకారంగా మార్చుకోకండి. నేటి బాలలే రేపటి దేశ భవిషత్తు. అలాంటి భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరికీ, వ్యవస్థలకు వుంది. బాల్యాన్ని జ్ఞాపకంగా మార్చుకోండి గాయంగా కాదు. •

# విమానయానంపై బెదురు తగ్గాలంటే..

అహ్మదాబాద్ విమానం ప్రమాదంలో దాదాపు 274 మంది మరణించడంతో ముఖ్యంగా మన భారతదేశంలో విమాన ప్రయాణం చేసే వారిలో ఒక్కసారిగా 'ఫ్లయిట్ ఫియర్' పెరిగింది. దీంతో ఒక్కసారిగా నలభై శాతం విమాన ప్రయాణం చేసే వారు తాము చేసుకున్న టికెట్ బుకింగ్స్ క్యాన్సిల్ చేసుకోవడం జరుగుతుంది. దీనికితోడు ప్రయాణించే విమానాలు తరచూ వివిధ కారణాల వల్ల చేరవలసిన గమ్యస్థానాలకు చేరకుండా వెనుదిరిగడం లేదా వేరే విమానాశ్రయాల్లో అత్యవసర ల్యాండింగ్ జరగడం వల్ల విమాన ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణం చేయడం అంటే భయపడే పరిస్థితికి వచ్చింది. ఇటీవల విమాన ప్రయాణం చేసే వారు, విమానాలకు సంబంధించిన పూర్తి వివరాలు అనగా విమానం తయారుచేసిన కంపెనీ, మోడల్, వాటి పూర్తి చరిత్ర తెలుసుకుని టికెట్ బుకింగ్స్ చేసుకోవడం జరుగుతుంది.' డ్రీమ్ లైనర్' విమానం అంటే ఆమడదూరం పారిపోతున్న పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా ఎయిర్ ఇండియా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.. ప్రయాణికులకు భరోసా కల్పించాలి. ముఖ్యంగా అన్ని విషయాల్లో అన్ని సంస్థల విమానాలు డి.జి.సి.ఏ గైడ్లెన్స్ తూ.చ తప్పకుండా పాటించాలి. తరచూ విమానాలను తనిఖీ చేయాలి. ముఖ్యంగా మనదేశంలో ఉన్న విమానాశ్రయాల పరిసరాల్లో అనేక చర్యలు తీసుకోవాలని. విమానాశ్రయాల చుట్టుప్రక్కల నివాసప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. అదే సమయంలో విమానాల ఫిట్నెస్‌పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. టైర్లు, ఇంధనం, ఇంజన్లు తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. సాంకేతిక సమస్యలపై దృష్టి సారించాలి. సిబ్బంది, పైలెట్లు స్థితిగతులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ఒత్తిడి లేకుండా చూడాలి. ప్రస్తుతం సంవత్సరానికి 40 కోట్లకు పైబడిన సంఖ్యలో ప్రయాణాలు నమోదు

**ఐ.ప్రసాదరావు**

అవుతున్నాయి. రోజూ లక్షల సంఖ్యలో ప్రయాణికులు విమానయానం చేస్తున్నారు. 'ఉడాన్' పథకం ద్వారా విమానయానానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, దేశంలో అనేక చోట్ల నూతన విమానాశ్రయాలు నిర్మిస్తున్నారు. కొత్త కొత్తవిమాన సర్వీసులు ప్రారంభిస్తున్నారు. నిమిషాలు, గంటల వ్యవధిలో దూర ప్రాంతాలకు చేరేవిధంగా వివిధ చర్యలు రూపకల్పన చేస్తున్నారు. ఏవియేషన్ దగ్గర అందరికీచేరవుతుంది.



గతంలో ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండే విమానప్రయాణం ఇటీవల కాలంలో సామాన్యులకు కూడాఅందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా సాఫ్ట్వేర్‌రంగం ఊపుఅందుకోవడం వలన విమాన ప్రయాణం సులభతరం అవుతుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం చదువుకున్న వారు దేశంలో వివిధ పెద్దపెద్ద నగరాలకు, పట్టణాలకు వెళ్ళటంవలన, త్వరితగతిన వెళ్ళడానికి విమాన ప్రయాణాన్ని వాడుతున్న పరిస్థితి. అదే సందర్భంలో చదువుల నిమిత్తం, వ్యాపారాల నిమిత్తం, ఉద్యోగ ఉపాధి అవకాశాల నిమిత్తం, దేశవ్యాప్తంగా పల్లెటూరి నుంచి పట్టణాల నుంచి దేశ విదేశాలకు ప్రజలకు వలస వెళ్లడం ప్రారంభమైంది. దీనికి విమానయానం అత్యవసరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో విమాన ప్రమాదాలు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి.

ఇకనైనా తగు భద్రతా చర్యలు తీసుకోవాలి. ఒకప్పుడు దూర ప్రాంతాలకు వెళ్ళాలన్నా, విదేశాలకు వెళ్ళాలన్న నౌకాయానమే సాధనం. కానీ కాలానుగుణంగా విమానయానం త్వరితగతిన దాదాపు అన్ని చోట్లకు అందుబాటులోకి వచ్చింది. అవసరాలు పెరిగాయి. కొంతమేరకు ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఆకాశమే హద్దుగా అందరూ ఆకాశయానం అనగా విమానయానం ద్వారా ప్రపంచ దేశాలను చుట్టేస్తున్నారు. ఇక ఇటీవల కాలంలో 'టూరిజం' ఒక ఫ్యాషన్‌గా మారింది. దీంతో అవకాశం ఉన్నవారు అందరూ దేశంలో వివిధ ప్రాంతాలకు, అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాలకు పర్యటనకు వెళుతున్నారు. దీనికి ప్రధాన కారణం 'విమానయానం' అందుబాటులోకి రావడమే. ఇక భవిష్యత్తు అంతా 'టూరిజమే' అంటున్న ప్రస్తుత తరుణంలో విమాన రంగాన్ని అభివృద్ధి పరుచుకోవాలి. ఆధునిక విమానాలు, సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం తోపాటుప్రయాణికులకు భద్రత కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానికి, విమానయాన సంస్థలకు, రక్షణ సంస్థలకు, ఎయిర్ లైన్స్ సంస్థలకు, సంబంధిత ప్రభుత్వ సంస్థలపై ఉంది. ఇప్పుడే ఊపు అందుకున్న విమాన సర్వీసులు, విమాన ప్రయాణికులకు భరోసా కల్పించాలి. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఎయిర్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రతిష్టాత్మకంగా చర్యలు తీసుకోవాలి. ప్రయాణికుల్లో ప్రబలుతున్న 'ఏవియో( ఏరో) ఫోబియా' కు ఫుల్‌స్టాప్ పెట్టాలి. ప్రయాణికులు కూడా భయాందోళనలకు గురి కాకూడదు. ముఖ్యంగా మానసిక ధైర్యాన్నిఇనుమడింపచేసుకోవాలి. ధైర్యంగా ముందుకు సాగాలి. అవసరమైన సందర్భాల్లో వైద్య నిపుణులను సంప్రదించాలి. సాధ్యమైనంత త్వరలో మన విమానయానం గాడిలో పడుతుంది అని ఆశిద్దాం. ఆ విధంగా పటిష్టమైన చర్యలు ప్రభుత్వం, విమానయాన సంస్థలు తీసుకుంటాయని ఆశిద్దాం. •

# ప్రజావాక్కు



## విచారణ జరిపించాలి

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు దగ్గరున్న పాశమైలారంలో గల సిగాచి ఫార్మాకంపెనీలో జూన్‌నెల ముగియనుండగా జరిగిన ఘోర ప్రమాదంలో ప్రస్తుతానికి నలభై రెండు మంది మరణించగా అందులో కొందరు గుర్తుపట్టలేనంతగా మాడిమసైపోయారు. ఈ ప్రమాదాలకు ముఖ్య కారణాలు మొదటిది సేఫ్టీకి ఎంత బడ్జెట్‌ను కేటాయించారు? దీనికో లెక్కుంది. దీని ప్రకారం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారా? నియమిత కాల ప్రకారం ప్రభుత్వ కార్మిక శాఖ, పరిశ్రమ యాజమాన్యం అన్ని యంత్రాలు, ఇతర సాంకేతిక పనిముట్లు లోప భూయిష్టంగా లేకుండా ఉన్నాయా? పని వారందరికి కంపెనీ వారు ఇన్స్యూరెన్స్ చేసారా? ఏడాదికోసారి పూర్తిగా బయటి నిపుణులతో నిర్వహణా కార్యక్రమాలు చేపడుతున్నారా? కార్మికులకు సంబంధిత కార్మాగారాలలో పనిచేసే సర్టిఫికెట్లు, అనుభవం ఉన్నదా? ఇలా అనేక విషయాల మీద సంపూర్ణ విచారణ జరిపించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఉపాధి హామీని అవకాశంగా తీసుకోవాలి

తెలంగాణలో బీడు భూములు దాదాపు 5 శాతం ఉన్నాయి. గాలిలో తేమ పెరిగిన నేపథ్యం లో వర్షం కూడా సమృద్ధిగా కురుస్తుంది కావున నీటి పారుదల వసతులు పెరగడం మూలంగా బీడుగా ఉన్న భూములు సాగులోకి తేవడంవల్ల రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఉపాధి హామీలో భూమి అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం వల్ల దాని చుట్టూ పండ్ల తోటలు ఉదాహరణకు కొబ్బరి లాంటి తోటల వల్ల అభివృద్ధి చేసిన భూమిలో అంతర పంటలకు ఆస్కారం వుంటుంది.

- భారత అవినాష్, జనగాం

## ఉగ్రవాదం అంతమైందా!

ఆపరేషన్ బ్లూస్టార్ సైనిక చర్యతో స్వర్ణదేవాలయంలో నక్కి ఉన్న ఉగ్రవాదులను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పారద్రోలగలిగారు. కానీ ఇందిరాగాంధీఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉగ్రవాదసమస్య తీవ్రరూపం దాల్చింది. ఎంతో మంది నాయకులు, పౌరులు ఉగ్రవాదుల ఉగ్రరూపానికి బలయ్యారు. ఆపరేషన్‌బ్లూస్టార్, ఆపరేషన్ సింధూర్ వాటి వల్ల కలిగే ప్రయోజనాలు తాత్కాలికమే.

- ఎమ్.ఎస్. శర్మ, హైదరాబాద్

## లాటరీ పద్ధతిలో పాఠశాల ప్రవేశాలు

నేటితరం తల్లిదండ్రులు విద్యావంతులైనప్పటికీ తమ పిల్లలకు తీర్చిదిద్దగల సమర్థత, వాళ్లకు ఉన్నప్పటికీ సమయం వెచ్చించలేనందువలన, వారికోసం డబ్బులు సంపాదించాలనే ఒక పిచ్చి కోరికతో వారిపిల్లలను పిల్లలమాటలను, ఆలోచనలను పట్టించుకోకుండా వారిని ప్రైవేట్ స్కూళ్లలో, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తూ ఉన్నారు. కార్పొరేట్ లేదా ప్రైవేట్ స్కూల్లోని టీచర్లు పట్ల సదరు తల్లిదండ్రులకు చులకన భావం ఉంటుంది. నిజానికి తల్లిదండ్రులు చదువులు చెప్పే ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు దేవుడి కంటే ఎక్కువగా గౌరవించబడాలి. అలా గౌరవించడానికి ఇష్టం లేని నేటి తరం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు లేదా కార్పొరేట్‌స్కూల్లో చేర్పిస్తూఉన్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తూ ఒక అడుగు ముందుకు వేసి నిరుపేద లైన తల్లిదండ్రుల పిల్లలను ప్రైవేటు లేదా కార్పొరేట్ స్కూల్లో చేర్పించడానికి ఇష్టపడితే వారికి లాటరీ పద్ధతిలో ఎన్నిక చేసి ప్రైవేట్ పాఠశాలలకు, కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలల నుండి పంపిస్తూ ఉన్నారు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## పర్యవేక్షణ ఉండాలి

ఇటీవలి పూరీ జగన్నాథ రథయాత్రలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన ముగ్గురు భక్తుల మృతి, 50 మందికిపైగా గాయపడటం అత్యంతవిషాదకరం. ఈతరహా సంఘటనలు మతపరమైన ఉత్సవాల్లో భద్రతా చర్యలను పునర్విమర్శించాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ప్రతి ఉత్సవానికి ముందస్తు ప్రణాళిక, సమగ్ర భద్రతా ఏర్పాట్లు అత్యవసరం. భద్రతా చర్యల్లోభాగంగా, భక్తుల ప్రవాహాన్ని నియంత్రించేందుకు టికెట్ లేదా టోకెన్ విధానం రూపొందించాలి. స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాలంటీర్లు ముందుగానే నియమించాలి. ఆధునిక సాంకేతిక పరికరాలు డ్రోన్లు, సీసీటీవీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## వికలాంగులకు డిప్యూటేషన్ రద్దు చేయాలి

వికలాంగుల ఉద్యోగులు వారి ఇష్ట ప్రకారం వారు కోరుకొంటేనే డిప్యూటేషన్‌లో పంపాలి. కానీ బలవంతంగా పంపవద్దు. వారు దృష్టి లోపంతో, వివిధ రకాల వైకల్యంతో బాధపడుతున్నారు. ఒక సంవత్సర కాలం కూడా పూర్తి కాకముందే డిప్యూటేషన్ అని అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

**మనవి** | **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# విద్యలో విప్లవాత్మక మార్పులు ఏఐతో సాధ్యమా?



డాక్టర్ మోటె చిరంజీవి

విద్యార్థుల్లో చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి సామర్థ్యాలు పెంపొందించేందుకు ఏఐ ఎంతగానో దోహదపడనుంది. వారి సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచే విధానంలో ఎంతో ఉపయోగపడుతుంది. ఇంతకు ముందు ప్రాథమిక విద్యార్థులకు కనీస అభ్యర్థన సామర్థ్యాల పెంపునకు ఫౌండేషనల్ లిటరసీ న్యూమర్సీ (ఎఫ్ఎల్ఎన్) ప్రోగ్రామ్‌ను అమలు చేశారు. ఇప్పుడు, మరోసారి ఏఐ విద్యతో విద్యార్థుల్లో మరింత నైపుణ్యాలు మెరుగుపడతాయని యోచిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే దిశగా పయనిస్తున్న అత్యాధునిక సాంకేతికత కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో జీవిస్తున్నాం. ఈ మధ్యకాలంలో విడుదలవుతున్న దాదాపు ప్రతి సాధనం (సాఫ్ట్‌వేర్) ఏఐ వెర్షన్‌ను అందిస్తూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం, ప్రతి ఇద్దరు భారతీయుల్లో ఒకరు ఏదో ఒక రూపంలో ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. విద్యలో ఏఐ (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) అనేది విద్యార్థులకు అభ్యాస అనుభవాలను వ్యక్తిగతీకరించడానికి ఎక్కువగా ఉపయోగించబడుతోంది. ఇది వారి నైపుణ్యాలు, ఆసక్తులు అభ్యాస శైలుల ఆధారంగా రూపొందించబడిన విద్యా కంటెంట్‌ను అందిస్తుంది. ఏఐ విద్యార్థుల పనితీరు డేటాను విశ్లేషిస్తుంది అభ్యాస ఇబ్బందులు లేదా అవగాహనలో అంతరాలను గుర్తిస్తుంది. బ్రిటానికా ఎడ్యుకేషన్ పరిశోధనల ఆధారంగా, మొదటి ఏఐ ప్రోగ్రామ్ 1951లో వ్రాయబడింది. 1950లలో, బ్రిటిష్ లాజిషియన్ కంప్యూటర్ మార్గదర్శకుడు అలాన్ ట్యూరింగ్ ఒక యంత్రానికి ఆలోచించే సామర్థ్యం ఉందా అని ప్రశ్నించాడు. ఏఐ కేంద్ర భావనలను ప్రవేశపెట్టాడు. తరువాతి దశాబ్దాలలో సాంకేతికత ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతూనే ఉంది. ఈ విధంగా తరగతి గదిలోకి ప్రవేశించింది. తరువాతి దశాబ్దాలలో సాంకేతికత తరగతి గదికి ప్రవేశించడంతో, కె 12 విద్యలో విశ్లేషణలకు ఏఐ పరివర్తన కలిగిస్తుందని నిరూపించబడింది. ఏఐ ఆధారిత సాధనాలతో ఈ పెరిగిన వినియోగం విద్యా, పర్యావరణ వ్యవస్థకు బోధన అభ్యాస అవకాశాలను ప్రభావితం చేసింది. ఒకే రకమైన అభ్యాసన పద్ధతులు విద్యార్థులకు భిన్నంగా నేర్చుకుంటున్నందున నిరాశ కలుగుతుంది. విద్యార్థులకు సంబంధిత లేదా ఆసక్తికరమైన విషయం దొరకకపోవడంతో వారు నిరాశకు లోనవుతారు. తరగతితో ముందుకు సాగడానికి విద్యార్థులకు తరచుగా కొన్ని



అంశాలపై అదనపు సహాయ సహకారాలు అవసరం అవుతాయి. మానవుల వలె ఆలోచించడానికి నేర్చుకోవడానికి రూపొందించబడిన, ప్రోగ్రామ్ చేయబడిన కంప్యూటర్లలో కృత్రిమ మేధస్సు మానవ మేధస్సును ప్రేరేపిస్తుంది. ప్రస్తుతం, స్మార్ట్ కంటెంట్ అభివృద్ధి అనుకూలీకరించిన ట్యూటరింగ్ నుండి ఆటోమేటిక్ గ్రేడింగ్, వర్చువల్ తరగతి గదుల వరకు విద్యకు సంబంధించిన వివిధ రంగాలకు ఏఐ వర్తించబడుతుంది. ఇటువంటి సాంకేతికత, సాంప్రదాయ బోధనా పద్ధతులను విప్లవాత్మకంగా మార్చడమే కాకుండా, మొత్తం అభ్యాస ప్రక్రియ ప్రాధాన్యతను మరింత పెంచడానికి అడ్డంకులను కూడా తొలగిస్తున్నాయి. సాంప్రదాయ బోధన విద్యార్థులు తమ సందేహాలకు వివరణ కోరుకోవడానికి తరగతి గది సమయంపై ఆధారపడి ఉంటుంది. ఉపాధ్యాయులు పాఠాలతో ముందుకు సాగే ముందు ప్రశ్నలను పరిష్కరించడానికి నిర్దిష్ట సమయాన్ని కేటాయిస్తారు. కృత్రిమ మేధస్సు ఏకీకరణతో, ఉపాధ్యాయులు వర్చువల్ అప్లికేషన్ల ద్వారా రియల్‌టైమ్ సహాయాన్ని అందించడం ద్వారా ఈ ప్రక్రియను మెరుగు పరచవచ్చు. ఇది విద్యార్థులకు అవసరమైనప్పుడల్లా తక్షణ సహాయం పొందడానికి వీలు కల్పిస్తుంది. తరగతి గదిబోధనను పూర్తి చేస్తుంది. ఉపాధ్యాయులు తరగతి సమయంలో మరింత లోతైన చర్చలు, వ్యక్తిగతీకరించిన మద్దతుపై దృష్టి పెట్టడానికి వీలు కల్పిస్తుంది. ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టులను పిల్లలకు సంపూర్ణంగా అర్థం అయ్యేలా బోధించాలని గత విద్యా సంవత్సరం (2024–2025) చివరిలో నిర్ణయించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఏక్ స్టెప్ ఫౌండేషన్ సహకారంతో ప్రయోగాత్మకంగా పలు జిల్లాల్లో ఏఐ ఆధారిత బోధనను విద్యాశాఖ స్టార్ట్ చేసింది. రాబోయే విద్యా సంవత్సరంలో వందల స్కూల్లో దాన్ని అమలు చేయనున్నారు. అందుకోసం యాభై మందికి మించి విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు అందించాలని విద్యాశాఖ ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో విద్యార్థులు వారి నైపుణ్యాలు మరింత మెరుగుపర్చుకునేలా వారి సామర్థ్యాన్ని పెంచేందుకు సర్కార్ వివిధ రకాలుగా పథకాలను సృష్టిస్తున్నారు. అంతేకాకుండా, విద్యార్థులకు వివిధ కోర్సులను, సబ్జెక్టులను కూడా బోధిస్తున్నారు. వారి పరిజ్ఞానం, నైపుణ్యం పెరిగేందుకు చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా రాష్ట్రంలోని సర్కార్ బడుల్లో విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులు అధ్యాపకులు తెలియని విషయాలను తెలుసుకోవడం జరుగుతుంది. కృత్రిమమేధా ద్వారా తెలుసుకొని జ్ఞానాన్నిపొందుతున్నారు. భవిష్యత్తులో కూడా దీని ఉపయోగం, వినియోగం ఎక్కువగా అవసరమవుతుందని మేధావులు యోచిస్తున్నారు. విద్యా సంస్థల స్థాయిలో డిజిటల్ పౌరసత్వం అనే అంశాన్ని పాఠ్యాంశాల్లో ప్రవేశపెట్టాలి. తల్లిదండ్రులు పిల్లల మొబైల్ వాడకాన్ని పర్యవేక్షించి, సరైన మార్గనిర్దేశనంచేయాలి. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి, అశ్లీలతకు బలపడేకంటెంట్‌ను ప్రోత్సహించకూడదు. •

# కొవిడ్ టీకాపై ఆందోళన వద్దు



## ఆకస్మిక మరణాలకు ఆ టీకాతో సంబంధం లేదు..

## వ్యాక్సిన్లు పూర్తిగా సురక్షితం: సీరమ్ ఇన్‌స్టిట్యూట్, ఎయిమ్స్

**న్యూఢిల్లీ,జులై 3:** కొవిడ్ వ్యాక్సిన్‌లపై మరోసారి ఆందోళనలు నెలకొంటున్న వేళ ప్రముఖ టీకాల తయారీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) స్పందించింది. వ్యాక్సిన్లు సురక్షితమేనని, శాస్త్రీయంగానూ రుజువైందని స్పష్టం చేసింది. ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలకు మధ్య సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే రెండు సమగ్ర అధ్యయనాల్లో తేలిక విషయాన్ని గుర్తు చేసిన సీరమ్.. వాటిని ధ్రువీకరిస్తున్నామని పేర్కొంది. కర్ణాటకలోని హాసన్ జిల్లాలో గుండె సంబంధిత సమస్యలతో ఇటీవల నెల రోజుల వ్యవధిలోనే 20 మంది మరణించడాన్ని కొవిడ్ టీకాతో ముడిపెడుతూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆందోళనలకు దారితీశాయి. వీటిపై కేంద్ర ఆరోగ్య శాఖ ఇప్పటికే స్పష్టతనివ్వగా తాజాగా ఎయిమ్స్ వైద్యులు కూడా టీకాల పనితీరుపై మాట్లాడారు.

**టీకాలతో సంబంధం లేదు: గులేరియా**

'ఆకస్మిక గుండెపోటు కారణంగా యుక్తవయసు వారు చనిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. వీటిపై ఇప్పటికే అధ్యయనాలు జరిగాయి. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్), ఎయిమ్స్ ఆధ్వర్యంలో జరిగిన రెండు సమగ్ర అధ్యయనాల్లో ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలకు సంబంధం లేదని తేలింది. అన్ని టీకాలు, ఔషధాలతో కొన్ని దుష్పరిణామాలు ఉన్నట్లే.. ఈ టీకాలకు కొన్ని ఉంటాయి. కానీ, గుండెపోటు మరణాలకు వీటికి సంబంధం లేదు. ఈ విషయాన్ని ఏ అధ్యయం వెల్లడించలేదు' అని ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డా. రణీదీప్ గులేరియా పేర్కొన్నారు.

**ఎటువంటి హాని లేదు: డాక్టర్ రాజీవ్ నారంగ్**

'గుండెపోటుకు సంబంధించి యువకులు, వృద్ధులకు కారణాలు వేరుగా ఉంటాయనే విషయం మనందరికీ తెలుసు. వాస్తవానికి ఆకస్మిక గుండెపోటు ముప్పు కొవిడ్ టీకాలు తీసుకున్న వారికి తక్కువగా ఉన్నట్లు ఐసిఎంఆర్, ఎయిమ్స్ అధ్యయనాల్లో తేలింది. కొవిడ్ వ్యాక్సిన్‌తో ప్రయోజనం తప్ప ఎటువంటి హాని లేదని స్పష్టంగా రుజువైంది' అని ఎయిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ వెల్లడించారు. మరోవైపు యుక్తవయసువారి ఆకస్మిక మరణాలకు జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే కారణం తప్పితే కొవిడ్ వ్యాక్సిన్ కాదని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. దేశీయంగా తయారైన కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని, తీవ్ర దుష్పరిణామాలు సంభవించిన ఉదంతాలు అత్యంత అరుదుగా కనిపించాయని ఐసిఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం (ఎన్‌సిడిసి) అధ్యయనాలు వెల్లడించినట్లు వివరించింది.



# హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం..

## -ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

**టెల్‌అవీవ్, జులై 3:** హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. గాజాలో 60 రోజులపాటు కాల్పుల విరమణకు అవసరమైన షరతులను ఇజ్రాయెల్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తరుణంలో ఈ స్పందన వచ్చింది. 'హమాస్ ఉండదు.. హమస్థాన్ ఉండదు. ఆ విషయంలో మేం వెనక్కి తగ్గబోం. ఆ సంస్థను తుడిచిపెట్టేస్తాం' అని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ నెతన్యాహు వ్యాఖ్యలు చేశారు. యుద్ధాన్ని నిలువరించడానికి ఈజిప్టు, ఖతార్‌నుంచి వస్తున్న కాల్పుల విరమణ ఒప్పందాలను హమాస్ పరిశీలిస్తున్నదశలో ఈవ్యాఖ్యలుచేయడం గమనార్హం. కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ఓకే చెప్పిందని, హమాస్ కూడా అంగీకరించాలని ఇటీవల ట్రంప్ ప్రతిపాదించారు. అందుకు తాము సిద్ధమేనని చెప్పిన హమాస్.. గాజాపై యుద్ధాన్ని శాశ్వతంగా ఇజ్రాయెల్ ముగిస్తామంటేనే సంధి చేసుకుంటామని స్పష్టం చేసింది. గాజా భూభాగాల నుంచి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కి వెళితే దానికి బదులుగా మిగిలిన 50 మంది బందీలను విడుదల చేస్తామని తీవ్రవాద సంస్థ ప్రతినిధి తాహెర్ అల్-నును తెలిపారు. యుద్ధాన్ని ముగిస్తామంటే చర్చలకు సిద్ధమేనని వెల్లడించారు. అయితే, ఆయుధాలు అప్పగించి హమాస్ లొంగిపోవాలని పాలస్తీనాను వీడి వెళ్లిపోవటానికి అంగీకరిస్తేనే 60 రోజుల కాల్పుల విరమణకు అంగీకరిస్తామని ఇజ్రాయెల్ తెలిపింది. యుద్ధానంతరం గాజాలో హమాస్ కనిపించడానికి వీల్లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు.

# వైట్‌హౌస్‌నుంచి జుకర్‌బర్గ్‌ను బయటకు పంపించేసారా?

## ట్రంప్‌పై వైరల్ అవుతున్న సంచలన కథనాలు

**వాషింగ్టన్,జులై 3:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కీలకమైన సమావేశంలో ఉండగా మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ అనూహ్యంగా ప్రత్యక్షం కావడం, ఆయన్ను బయటకు పంపించేశారంటూ భారీ ఎత్తున ప్రచారంలోకి వచ్చింది. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది. అయితే, ఈ ఆరోపణలను అప్పటి వైట్‌హౌస్ వర్గాలు తోసిపుచ్చడంతో అసలు ఏం జరిగిందనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఓవల్ ఆఫీస్‌లో డొనాల్డ్ ట్రంప్ అమెరికా వైమానిక దళానికి చెందిన ఉన్నతాధికారులతో తర్వాతి తరం యుద్ధ విమానాల గురించి అత్యంత రహస్యంగా చర్చిస్తున్నారు. ఆ సమయంలో మార్క్ జుకర్‌బర్గ్ హఠాత్తుగా సమావేశంలోకి వచ్చారని మీడియా వార్తలొచ్చాయి. అత్యంత కీలకమైన ఈ భేటీలో పాల్గొనేందుకు జుకర్‌బర్గ్‌కు ఎలాంటి భద్రతా అనుమతులు లేవు. దీంతో ఆయన్ను అక్కడ చూసిన సైనిక అధికారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారని ఆ కథనం తెలిపింది. పరిస్థితిని అర్థం చేసుకున్న అధికారులు, సమావేశం కొనసాగించడానికి వీలుగా జుకర్‌బర్గ్‌ను గదిలో నుంచి బయటకు వెళ్లి వేచి ఉండాల్సిందిగా కోరినట్టు సమాచారం. ఓవల్ ఆఫీస్‌లో గోప్యత కొరవడటంపై అధికారులు ఆశ్చర్యపోయారని ఒక అధికారి ఈ పరిస్థితిని 'వింత ప్రపంచంలా ఉంది' అని వ్యాఖ్యానించారు. సమావేశం నుంచి జుకర్‌బర్గ్‌ను బయటకు పంపించారనే వార్తల్లో వాస్తవం లేదని, అసలు విషయాన్ని తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆయన తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్ అభ్యర్థన మేరకే జుకర్‌బర్గ్ కేవలం పలకరించడానికి మాత్రమే లోపలికి వచ్చారని ఆ అధికారి వివరించారు. సైనిక అధికారులతో సమావేశం ముగిసిన తర్వాత జుకర్‌బర్గ్‌తో ట్రంప్‌కు వేరేభేటీ ఖరారైందని, అందుకే పలకరించి బయటకు వెళ్లి తన మీటింగ్ కోసం వేచి ఉన్నారని స్పష్టం చేశారు.



# అమెరికాలోని షికాగోలో కాల్పులు..

## నలుగురు మృతి, 14 మందికి గాయాలు!

**వాషింగ్టన్, జులై 3:** అమెరికాలోని షికాగోలో కాల్పులు కలకలం రేపాయి. ఓ గుర్తు తెలియని దుండగుడు జరిపిన కాల్పుల్లో నలుగురు మృతి చెందగా 14 మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చికాగోలోని రివర్ నార్త్ పరిసరాల్లో ఉన్న ఓ రెస్టారెంట్ దగ్గర ఓ ఆల్బమ్ రిలీజ్ పార్టీ జరుగుతోంది. అదే సమయంలో అక్కడ లాంజ్‌లో ఉన్న వారిపై ఓ దుండగుడు కాల్పులు జరిపి పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. మొత్తంగా 13 మంది మహిళలు, అయిదుగురు పురుషులపై కాల్పులు జరగ్గా వీరిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. బాధితుల వయసు 21-32 మధ్య ఉందని వీరిని స్థానిక ఆసుపత్రులకు తరలించినట్లు పేర్కొన్నారు.

# అమెరికా స్వాతంత్ర్య వేడుకలకు ఇరాన్ దాడుల ముప్పు



**వాషింగ్టన్,జులై 3:** అమెరికా స్వాతంత్ర్య వేడుకల వేళ దేశవ్యాప్తంగా ఉగ్రదాడుల భయం నెలకొంది. ముఖ్యంగా లోన్ వుల్ఫ్ (ఒంటరిగా దాడులకు పాల్పడేవారు) దాడులు జరగవచ్చని ఫెడరల్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఈ ముప్పు మరింత పెరిగిందని, దీంతో రేపటి వేడుకల సందర్భంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వంటి సంస్థలు సంయుక్తంగా ఒక బులెటిన్‌ను విడుదల చేశాయి. న్యూయార్క్‌లో జరిగే మేసీస్ జులై 4 బాణసంచా వేడుకలకు ఒంటరి వ్యక్తులు లేదా చిన్న చిన్న బృందాల నుంచే ప్రధాన ముప్పు ఉంది. జాతి, మత, రాజకీయ, ప్రభుత్వ వ్యతిరేక లేదా వ్యక్తిగత కారణాలతో దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఆ బులెటిన్‌లో హెచ్చరించింది. ఈ హెచ్చరికలు కేవలం న్యూయార్క్‌కే పరిమితం కాదని, దేశంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పెద్ద కార్యక్రమాలు కూడా లక్ష్యంగా ఉండవచ్చని స్పష్టం చేశాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో న్యూయార్క్ గవర్నర్ కేథీ హోచుల్ స్పందించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా గత కొన్ని వారాలుగా భద్రతా పరిస్థితిపై నాకు నిరంతరం నివేదికలు అందుతున్నాయి. జులై 4 సెలవుల సందర్భంగా లోన్ వుల్ఫ్ దాడుల ముప్పు ఎక్కువగా ఉందని మా ఫెడరల్ భాగస్వాములు నిన్న మరోసారి స్పష్టం చేశారు. ఈ సెలవుల్లో కుటుంబాలు సంతోషంగా గడిపేలా చూడటం, న్యూయార్క్ వాసుల భద్రతే నా ప్రథమ ప్రాధాన్యత అని ఆమె తెలిపారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల తర్వాత రాష్ట్రంలోని భద్రతా బలగాలు ఇప్పటికే అప్రమత్తంగా ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద కార్యక్రమాల వద్ద స్టేట్ పోలీసుల మోహరింపును మరింత పెంచుతామని గవర్నర్ తెలిపారు. ప్రధాన రవాణా కేంద్రాలు, వంతెనలు, సొరంగాల వద్ద నేషనల్ గార్డ్ సిబ్బందిని మోహరించామని, సోషల్ మీడియా కార్యకలాపాలను, సైబర్ దాడుల ముప్పును నిశితంగా గమనిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఇజ్రాయెల్‌తో జరిగిన ఘర్షణలో భాగంగా అమెరికా సైన్యం జూన్ 22న ఇరాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై బాంబు దాడులు చేసింది. ఆ తర్వాత గతనెల 23న కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి, జూన్ 24 నాటికి అది పూర్తిగా అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే డీహెచ్ఎస్ గతనెల 22న ఒక బులెటిన్‌ను విడుదల చేసింది. 2020 జనవరిలో తమ సైనిక కమాండర్ మృతికి కారణమైన అమెరికా అధికారులను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవచ్చని అందులో హెచ్చరించింది. ఇజ్రాయెల్ఇరాన్ ఉద్రిక్తతలు అమెరికాలోని కొందరిని దాడులకు పురిగొల్పవచ్చని కూడా పేర్కొంది. దాదాపు 2 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉన్న శాన్ ఫ్రాన్సిస్కో జులై 4 బాణసంచా కార్యక్రమంపై కూడా ఫెడరల్ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని సామూహిక ప్రాణనష్టం కలిగించే దాడులకు అనువైన సాఫ్ట్ టార్గెట్స్ సముదాయంగా ఎఫ్‌బీఐ, డీహెచ్ఎస్ నివేదిక అభివర్ణించింది. ఈ ఏడాది జనవరి 1న న్యూ ఓర్లీన్స్‌లో ఐసిస్ ప్రభావంతో ఒక వ్యక్తి ట్రక్కుతో జనంలోకి దూసుకెళ్లి 14 మందిని చంపిన ఘటనను గుర్తుచేస్తూ, అలాంటి కాపీక్యాట్ దాడులు జరగవచ్చని అధికారులు హెచ్చరికలు జారీచేసారు.

# అమర్‌నాథ్‌యాత్రకు పటిష్టమైన బందోబస్తు



**జమ్ము,జులై 3:** జమ్మూకశ్మీర్‌లో 36 రోజుల పాటుజరిగే పవిత్ర అమర్‌నాథ్ యాత్ర ఘనంగా ప్రారంభమైంది. దేశం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లమధ్య మంచులింగాన్ని దర్శించుకునేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, భారత సైన్యం కల్పించిన సౌకర్యాలు, భద్రతపై యాత్రికులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఏర్పాట్లు చాలా అద్భుతంగా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా, భారత సైన్యం తమకు పూర్తి భద్రతా భరోసా కల్పిస్తోందని, వారి అండతోనే తాము నిర్భయంగా యాత్ర చేయగలుగుతున్నామని పలువురు యాత్రికులు తెలిపారు. ఒకప్పుడు ఉగ్రదాడుల భయంతో తక్కువ మంది వచ్చేవారని, కానీ ఇప్పుడు ప్రభుత్వం కల్పించిన భద్రతతో పెద్ద సంఖ్యలో యాత్రకు వస్తున్నామని ఆనందంవ్యక్తం చేశారు. గురువారం ఉదయం బల్తాల్, పహల్గామ్ బేస్ క్యాంపుల నుంచి యాత్రికుల తొలి బృందాలు బయలుదేరాయి. 5,246 మంది భక్తులతో కూడిన రెండో బృందం జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి ప్రత్యేక భద్రతా కాన్వాయ్‌ల నడుమ కశ్మీర్ లోయకు బయలుదేరింది. అంతకుముందు, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం యాత్రను అధికారికంగా ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఈసారి అధికారులు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా చర్యలు చేపట్టారు. భారత సైన్యం, పారామిలటరీ బలగాలతో పాటు అదనంగా 180 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను (సిఆర్‌పిఎఫ్) మోహరించారు. యాత్రికులు తప్పనిసరిగా భద్రతా కాన్వాయ్‌లలోనే ప్రయాణించాలని, ఒంటరిగా వెళ్లవద్దని అధికారులు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. సముద్ర మట్టానికి 3,888 మీటర్ల ఎత్తులో ఉన్న పవిత్ర గుహకు భక్తులు పహల్గామ్ లేదా బల్తాల్ మార్గాల గుండా చేరుకోవచ్చు. అయితే, ఈ ఏడాది భద్రతా కారణాల దృష్ట్యా హెలికాప్టర్ సేవలను నిలిపివేశారు. ఈ యాత్ర శ్రావణ పౌర్ణమి రోజైన ఆగస్టు 9న ముగియనుంది.

# వారసుని ఎంపికలో దలైలామాకు మాత్రమే పూర్తి అధికారం

## కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ,జులై 3:** టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయంలో చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామాకు, ఆయన సంస్థకు మాత్రమే ఉంటుందని, ఈ విషయంలో ఇతరుల జోక్యానికి తావులేదని గురువారం స్పష్టం చేసింది. చైనా డిమాండ్‌ను తోసిపుచ్చుతూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తన వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని, దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టుకు మాత్రమే ఉందని దలైలామా ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే చైనా స్పందించింది. తదుపరి దలైలామా ఎంపికకు తమ ఆమోదముద్ర తప్పనిసరి అని, తమ విధానాలకు అనుగుణంగానే ఈ ప్రక్రియ జరగాలని డిమాండ్ చేసింది. చైనా వాదనపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. "దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం విషయంలో జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనే ఉంటుంది. దలైలామా స్థానం కేవలం టిబెటన్లకే కాక, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులందరికీ ఎంతో ముఖ్యమైనదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తేల్చిచెప్పారు.

# గుజరాత్‌లో బిజెపికి కాంగ్రెస్ సహకారం

## కాంగ్రెస్‌తో మాకు పొత్తు లేదు : కేజ్రీవాల్



**గాంధీనగర్, జులై3:** కాంగ్రెస్‌తో తమకు పొత్తు లేదని ఆప్ జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గుజరాత్‌లో అధికార బిజెపికి కాంగ్రెస్ సహకరించిందని ఆరోపించింది. కాంగ్రెస్ సారథ్యంలో విపక్ష పార్టీలతో ఏర్పాటైన ఇండియా కూటమి కేవలం గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ఉద్దేశించింది. మాత్రమేనన్నారు. గురువారం ఆయన అహ్మదాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 2027లో జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పోటీ చేసి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అక్కడి ప్రజలు ఇప్పుడు బిజెపి, కాంగ్రెస్‌లను కాకుండా ఆప్‌వైపే చూస్తున్నారన్నారు. కాంగ్రెస్‌తో మాకు పొత్తు లేదు. ఒకవేళ ఏదైనా పొత్తు ఉందనుకుంటే, విశావదర్ ఉప ఎన్నికల్లో వాళ్లెందుకు మాపై పోటీ చేశారు? మమ్మల్ని ఓడించాలని చూశారు. ఓట్లు చీల్చి ఆప్‌ను ఓడించేందుకు కాంగ్రెస్‌ను బిజెపి పంపించింది. కాంగ్రెస్ విఫలం కావడంతో బిజెపి వారిని కూడా చీవాట్లు పెట్టింది. ఇండియా కూటమి కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే. ఇప్పుడు మా వైపు నుంచి ఎలాంటి పొత్తు లేదు అన్నారు. ఇటీవల గుజరాత్‌లోని విశావదర్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ నేత గోపాల్ ఇటాలియ విజయం సాధించిన విషయం తెలిసిందే. బిజెపి అభ్యర్థి కిరీట్ పటేల్‌పై 17 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి నితిన్ రణ్‌పారియాకు కేవలం 5501 ఓట్లు మాత్రమే వచ్చాయి. గుజరాత్‌లో నేటి నుంచి గుజరాత్ జోడో అభియాన్‌ను ప్రారంభిస్తున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. దీని ద్వారా ప్రజలు తాము ఇచ్చిన నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ఆప్‌లో చేరవచ్చన్నారు. తమ కార్యకర్తలు కూడా ప్రతి ఇంటిని సందర్శిస్తారన్నారు. ఆప్ యువకుల పార్టీ అని, అవినీతి రహిత గుజరాత్‌ను కోరుకునే యువత పెద్ద సంఖ్యలో తమతో కలిసి రావాలని ఈ సందర్భంగా కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు.

# జపాన్‌లో రెండు వారాల్లో 900 సార్లు భూప్రకంపనలు!

**టోక్యో, జూలై 3:** రెండువారాల వ్యవధిలో గంటకు సగటున మూడు కంటే ఎక్కువసార్లు భూమి కంపిస్తుంటే ఎలా ఉంటుంది? ఏ క్షణాన ఏం జరుగుతుందో అని ఆందోళనతో క్షణక్షణం గడపాల్సి వస్తుంది. ఇదే పరిస్థితి జపాన్‌లో నెలకొంది. అక్కడ టొకార దీవుల్లో జూన్ 21 నుంచి భూఫలకాల కదలికలు చురుగ్గా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. బుధవారం కూడా ఇక్కడ 5.5 తీవ్రతతో భూకంపం వచ్చింది. సునామీ హెచ్చరికలు జారీ చేసినా.. తర్వాత ఆపేశారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి గత రెండు వారాలుగా నమోదైన భూ ప్రకంపనల సంఖ్య 900 అని జపాన్ వాతావరణ శాఖ ఏజెన్సీ అధికారి అయాటకా ఎబిటా పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే టొకార దీవుల్లో జనావాసాలు తక్కువగా ఉండటం ఒక్కటే కొంచెం ఊరటనిచ్చే అంశం. ఇక్కడి వారిని ఏ క్షణమైనా తరలించేందుకు వీలుగా అధికారులు సిద్ధం చేశారు.

# విమానం గాల్లో ఉండగానే.. నేలపై పడిన రెక్క విడిభాగం!



**వాషింగ్టన్, జూలై 3:** విమానం గాల్లో ఉండగానే దాని రెక్కలోని ఓ భాగం ఊడిపోయి రోడ్డుపై ఘటన అమెరికాలోని నార్త్ కరోలినాలో చోటుచేసుకుంది. ఈ విషయాన్ని అమెరికాలోని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కూడా ధ్రువీకరించింది. మంగళవారం రాత్రి హార్ట్స్‌ఫీల్డ్-జాక్సన్ అట్లాంటా ఇంటర్నేషన్ ఎయిర్ పోర్టు నుంచి డెల్టా ఫ్లయిట్ నెంబరు 3247 బోయింగ్ 737-900 విమానం నార్త్ కరోలినాలోని రెలీ-దర్హం ఎయిర్‌పోర్టుకు బయల్దేరింది. ఈ విమానం ప్రయాణం మొత్తం సాఫీగానే సాగింది. కానీ, రెలీ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ సమయంలో అత్యంత కీలకమైన విమానం రెక్కలోని ఫ్లాప్‌కు సంబంధించిన విడిభాగం ఊడిపోయింది. ఇది కింద ఉన్న రోడ్డుమార్గంపై పడింది. అదృష్టవశాత్తు విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఆ సమయంలో 109 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది దానిలో ఉన్నారు. ఎయిర్‌పోర్టులో సదరు విమానం ఎడమ రెక్క వెనుక ఫ్లాప్‌లో కొంత భాగం కనిపించడం లేదు. పూర్తి స్థాయి తనిఖీలు నిర్వహించగా.. ప్రయాణం సమయంలోనే ఆ భాగం ఊడిపోయి మార్గం మధ్యలో పడిపోయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై డెల్టా ఎయిర్‌లైన్స్ ఎఫ్ఎఎకు సమాచారం అందించింది. దీనిపై బుధవారం ఎఫ్ఎఎ స్పందిస్తూ.. రెలీలోని ఓ మోటార్‌వేలో వింగ్ ఫ్లాప్‌లోని విడిభాగం దొరికిందని ప్రకటించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. దీనిపై డెల్టా ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని చెప్పారు. ఫ్లాప్స్ అనేవి విమానం రెక్క వెనకభాగంలో ఉంటాయి. వీటిని కదిలించే అవ కాశం ఉంటుంది. ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో లిఫ్ట్, డ్రాగ్‌ను నియంత్రించడానికి వీటిని వినియోగిస్తారు. వీటి నియంత్రణలు పైలట్ చేతిలో ఉంటాయి. ఇటీవల కాలంలో బోయింగ్ విమానాల్లో భద్రతా లోపాలు తరచూ బయటపడుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని బోయింగ్‌పై న్యాయస్థానంలో కేసులు వేసిన సంస్థలో పనిచేసే న్యాయవాదికి చెందిన బీచ్‌హౌస్ ఎదుటే డెల్టా ఎయిర్‌లైన్స్ విమానం ఫ్లాప్ పడిపోవడం కొసమెరుపు. ఫ్లాప్ ఊడిపడిన ఘటనలో ఎవరూ గాయపడలేదు.

# స్టూడెంట్ వీసాలకు దరఖాస్తుల స్వీకరణ షురూచేసిన అమెరికా!

**వాషింగ్టన్,జులై 3:** అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విదేశీ విద్యార్థులకు సుమారు నెల రోజుల విరామం తర్వాత విద్యార్థి వీసా దరఖాస్తుల స్వీకరణను పునఃప్రారంభించినట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఈసారి దరఖాస్తుదారులకు కొన్ని కఠినమైన నిబంధనలతో పాటు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. వీసా మంజూరు ప్రక్రియలో కీలక మార్పులు చేసినట్లు స్పష్టం చేసింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మిగ్నాన్ హ్యూస్టన్ మాట్లాడుతూ విద్యార్థి వీసా దరఖాస్తులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఒక విషయాన్ని విద్యార్థులు స్పష్టంగా గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. విద్యార్థులు ఏ ఉద్దేశంతో వీసా కోసం దరఖాస్తు చేసుకున్నారో, ఆ పని కోసమే దానిని ఉపయోగించుకోవాలి. అమెరికాకు వచ్చిన తర్వాత చదువును మధ్యలో వదిలేయడం లేదా క్యాంపస్‌లలో విధ్వంసానికి పాల్పడటం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని ఆమె స్పష్టం చేశారు.

దేశ జాతీయ భద్రత, వలస చట్టాలను దృష్టిలో ఉంచుకునే తమ విధానాలు ఉంటాయని, అమెరికా ఇమిగ్రేషన్ వ్యవస్థ అత్యున్నత ప్రమాణాలతో కొనసాగేలా చూస్తామని ఆమె వివరించారు. ఈ నిబంధనలు కేవలం అమెరికా పౌరులకే కాకుండా, వారితో కలిసి చదువుకునే ఇతర దేశాల విద్యార్థుల భద్రతకు కూడా అవసరమని అన్నారు. సోషల్ మీడియా ఖాతాల పరిశీలన ప్రక్రియ (వెట్టింగ్ ప్రాసెస్) కోసం గత నెల రోజులుగా నిలిపివేసిన దరఖాస్తుల స్వీకరణను జూన్ 18 నుంచి తిరిగి ప్రారంభించినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమ అన్ని సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను తప్పనిసరిగా పబ్లిక్ వ్యూలో ఉంచాలని ఆదేశించింది. ఈ నిబంధనను పాటించని వారి దరఖాస్తులను తిరస్కరించడమే కాకుండా, భవిష్యత్తులో వారు అమెరికాకు వచ్చే అవకాశాలనుకూడా కోల్పోతారని తేల్చిచెప్పింది. మరోవైపు విద్యార్థి వీసాలకు కూడా నిర్దిష్ట కాలపరిమితి విధించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయడం విదేశీ విద్యార్థుల్లో కొత్త ఆందోళనకు కారణమవుతోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ఎఫ్1, జె1 వీసాలపై అమెరికాలో ఉంటున్న వారిపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది. దీని ప్రకారం వీసా గడువు ముగిసిన ప్రతిసారీ విద్యార్థులు పొడిగింపు కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ విభాగం సమీక్షలో ఉన్నాయి.

# ఉన్నత విద్య బలోపేతానికి సమగ్ర నివేదిక

### త్వరలోనే ప్రభుత్వానికి సమర్పిస్తాం
### రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్య బలోపేతానికి సమగ్ర నివేదికను సిద్ధం చేయనున్నట్టు తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ తెలిపారు. ఉన్నత విద్య బలోపేతానికి తగు సూచనలతో సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులు గురువారం మొదటిసారిగా పాలమూరు యూనివర్సిటీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డితోపాటు వివిధ విభాగాలధిపతులు బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళీ మాట్లాడుతూ విద్యావ్యవస్థలోని సమస్యలను విద్యార్థుల నుంచి వివిధ సంఘాల నాయకుల నుంచి ప్రజాభిప్రాయాలను సేకరించి ఒక సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కేజీ టు పీజీ విద్యలో గల సమూల మార్పులకై అధ్యయనం చేస్తున్నామని, యూనివర్సిటీ స్థాయిలో గల వివిధ సమస్యల పైన ప్రత్యక్షంగా విద్యార్థుల నుంచి, మేధావుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని, విద్యా రంగంలో వెనుకబడిన గట్టు మండలాన్ని ఆధారంగా చేసుకుని పాలమూరు యూనివర్సిటీని సందర్శించినట్టు చెప్పారు. త్వరలో మరిన్ని యూనివర్సిటీలను సందర్శించి నివేదిక తయారు చేస్తామన్నారు. యూనివర్సిటీ ఉపకులపతి(విసి) ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిలబస్ రూపకల్పన మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉందా? లేదా? అని.. చాలామంది విద్యార్థులు మంచి పర్సంటేజీతో పాస్ అయినప్పటికీ జీవితంలో స్థిరపడడం లేదని, సమాజ అవసరాల కొరకు సిలబస్ రూపకల్పన జరగాలని, విద్యా కమిషన్ సభ్యులు యూనివర్సిటీలో సమస్యలను చర్చించి ఒక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేయడంలో సహకరించాలని సూచించారు. యూనివర్సిటీ అధ్యాపకులు అధ్యాపకేతరులు, విద్యార్థులు వివిధ సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.



గురువారం ఆర్ అండ్ బి కార్యాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులతో సమీక్షిస్తున్న దృశ్యం

## ఆగస్టులోగా హ్యామ్‌రోడ్ల టెండర్ ప్రక్రియ దశకు చేరాలి

### కన్సల్టెన్సీలు, ప్రతిపాదనలపై క్షేత్రస్థాయిలో క్రాస్‌చెక్ చేయండి
### చిన్న కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు ఈ నెలలో చెల్లిస్తాం
### ఇంజినీర్ల సమీక్షా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** హ్యామ్ రోడ్ల టెండర్ ప్రక్రియ ఆగస్టులో చేపట్టేందుకు సాధ్యాసాధ్యాలపై అధికారులు దృష్టి సారించాలని ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. రోడ్లు భవనాలు శాఖ కార్యాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇంజనీర్లతో సమీక్ష సమా వేశం జరిపారు. కన్సెల్టెన్సీలు అందించిన ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు క్రాస్ చెక్ చేసుకొని మరింత నాణ్యత ప్రమాణాలతో రోడ్ల నిర్మాణానికి సూచనలు చేయాలని ఆయన కోరారు.గ్రామీణ రోడ్లు మూడేళ్ళలో పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. హ్యామ్ రోడ్ల ప్యాకేజీ, డిపిఆర్ మంత్రి పరిశీలించినారు.ఫిక్ ఇబ్బంది ఉన్న రోడ్లకు మొదటి ప్రియార్టీహామ్ మోడల్ లో రోడ్ల నిర్మాణం జరపాలని నిర్ణయించామని అన్నారు. మా ప్రభుత్వం వచ్చాక 6500కోట్లు రూరల్ రోడ్స్ టెండర్లు పిలిచామని చెప్పారు. రోడ్స్ నిర్మాణం జరుగుతుందిపెండింగ్ రోడ్స్ పూర్తి చేయాలని నిర్ణయించామని అన్నారు. తెలంగాణ లో మాశాఖ రోల్ మోడల్ గా ఉండేలావచర్యలు చేపట్టాం .పెండింగ్ ప్రమోషన్స్, పోస్టింగ్స్ ఇచ్చాం. రోడ్లు మాకోసం,కాంట్రాక్టర్ల కోసం కాదు ప్రజల కోసం నిర్మించాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల వారీగా ప్యాకేజీ లు గుర్తింపు చేయాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో మన రాష్ట్రంలో మరణాల సంఖ్య ఎక్కువ ఉందని ఆవేదన చెందారు.రోడ్డు సేఫ్టీ కింద బ్లాక్ స్పాట్స్ గుర్తించి పనులు జరుపుతున్నామని చెప్పారు.చిన్న కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్స్ ఈనెలలో చెల్లిస్తామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు విషయంలో ప్రధానిని, గడ్కారీ ని త్వరలో కలుస్తామని చెప్పారు. ఆరులైన్ల రోడ్డు కోసం త్వరలో క్యాబినెట్ అమోదం లభిస్తుందని అన్నారు. టెండర్ ప్రక్రియ వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఓఆర్ఆర్ నిర్మాణం కాంగ్రెస్ రాజశేఖరరెడ్డి హయాంలో పూర్తి చేశామని అన్నారు. గత ప్రభుత్వం 42 బ్రిడ్జిలను అప్రూవల్ లేక వదిలేసిందన్నారు. ఆర్ అండ్ బీలో ఎలాంటి వివాదాలు లేకుండా పోస్టింగ్స్, ప్రమోషన్స్ ఇచ్చామని.. గత ప్రభుత్వం కనీసం ఏఈలను కూడా రిక్రూట్ చేయలేదని విమర్శించారు. రోడ్లు వేసేది ప్రజల కోసమని.. తమకు పేరు కోసం కాదన్నారు. మూడున్నరేళ్లలో ఆర్‌అండ్‌బీ ద్వారా 12 వేల కిలోమీటర్ల రోడ్లు పూర్తి చేస్తామని ప్రకటించారు. మంత్రిసమీక్షలోఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంత రావు ఇఎన్‌సి టి. జయ భారతి, సి.ఇ మోహన్ నాయక్,లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి పలువురు ఎస్.ఇలు,ఇఇ.ఈ తదితరులు పాల్గొన్నారు.

## పసుపు రైతుల కోసం జాతీయ సహకార ఎగుమతి సంస్థ

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** పసుపు రైతుల కోసం జాతీయ సహకార ఎగుమతి లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్), జాతీయ సహకార ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సీవోఎల్)ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఈ విషయాన్ని గురువారం ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సంస్థలను తెలంగాణలోని నిజామాబాద్‌లో స్థాపించాలని కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సహకార సంస్థలు పసుపు దిగుమతులను పెంపొందించడంలో పూర్తి సహాయ సహకారాలను అందిస్తాయన్నారు. అలాగే సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలోను, రైతులకు న్యాయమైన లాభాలను అందించడంలో ఆయా సంస్థలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

## డిమాండ్లను అమలు చేయకపోతే ఆగస్టు 13న 'దివ్యాంగుల మహాగర్జన' నగర దిగ్బంధనం

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలను వెంటనే అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు, విహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆగస్టు 13న 'దివ్యాంగుల మహాగర్జన' పేరిట హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధం చేస్తామని ఆయన హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన దివ్యాంగుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటిందని, అన్ని అవయవాలు ఉండి ఏదో ఒకపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న వర్గాలకు హామీలు అమలు చేస్తూ అవయవ లోపాలతో ఎలాంటి పనులు చేసుకోలేక నిరాశ, నిస ్పృహాలతో ఉన్న దివ్యాంగుల హామీ లను అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో వివిధ దివ్యాంగ సంఘాల నాయకులు ఎల్.గోపాల్‌రావు, అందె రాంబాబు, సుజాత, సామినేని భవాని చౌదరి, కొల్లి నాగేశ్వర్‌రావు, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 18న ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు అనుమతి ఇవ్వండి

### పోలీసు ఉన్నతాధికారులకు మాజీ సర్పంచ్ జెఎసి విజ్ఞప్తి

**హైదరాబాద్ జూలై, 3, ప్రభాతవార్త:** మాజీ సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాకు అనుమతి ఇవ్వాలని మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన తెలంగాణ సెంటర్ జోన్ డీజీపీ, చిక్కడపల్లి దోమల గూడ సిఐని కలిసి వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి 24 వరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల గురించి ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినిపించిన తమ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. డబ్బులు వడ్డీలకు తెచ్చి అభివృద్ధి పనులు చేసి బిల్లులు రానందువల్ల కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని హైదరాబాద్ ఇందిరాపార్క్ దగ్గర ధర్నాచౌక్ మాజీ సర్పంచులు ధర్నా చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ హెల్పర్ల పదోన్నతుల వయోపరిమితి పెంపు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** అంగన్వాడీ హెల్పర్లు టీచర్లుగా పదోన్నతి పొందేందుకు వయోపరిమితిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం వాటికి సంబంధించిన ఫైలుకు అమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం పదోన్నతికి గాను గరిష్ట వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,322 మంది అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి పొందే అవకాశం ఏర్పడనుంది. గతంలో 45 ఏళ్లు దాటిన తర్వాత ప్రమోషన్ కోసం అవకాశాలు లేకపోయినా, ఇప్పుడు వారికీ మళ్ళీ అవకాశం లభించనుంది. గరిష్ట వయోపరిమితిని పెంచాలని అంగన్వాడీ హెల్పర్ యూనియన్ల నుంచి ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు వచ్చాయి. అర్హతలు ఉన్న 50 ఏళ్ల లోపు హెల్పర్లకు టీచర్ పదోన్నతి ఇవ్వడంలో ఎలాంటి అడ్డంకులు లేవని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారులు నివేదిక సమర్పించారు. 50 ఏళ్ల వయస్సులో టీచర్ గా పదోన్నతి పొందే హెల్పర్లు మరో 15 ఏళ్లు విధులు నిర్వర్తించవచ్చని అందులో సూచించారు. 45 యేళ్లు దాటిన అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వడంలో ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రభుత్వం దానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

## బిల్లులు చెల్లించాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

### మంత్రి సీతక్కకు సుర్వి యాదయ్యగౌడ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ మాజీ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు ఆయన బుధవారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్కకు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించామని అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.మంత్రిని కలిసి వినతి పత్రం అందచేసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షు గుంటి మధుసూదన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి మల్లయ్య, అరవింద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## తల్లి సాయంతో తండ్రి హత్య

### ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన నాగోల్ పోలీసులు

**హైదరాబాద్ (ఎల్‌బినగర్), జూలై 3, ప్రభాతవార్త:** తల్లి సాయంతో తండ్రిని ఓ మైనర్ బాలుడు హత్య చేశాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హత్యకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అశోక్‌మహాతొ అనే వ్యక్తి పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి కాచిగూడలో జ్యూస్ పాయింట్ పెట్టుకొని నివసిస్తుండగా, మూడు సంవత్సరాల క్రితం తన కుటుంబసభ్యులు కూడా కాచిగూడకు వచ్చి అశోక్‌మహాతొ జ్యూస్ పాయింట్ ఎదురుగానే మరో జ్యూస్ పాయింట్ పెట్టుకొని జీవనం కొనసాగిస్తూ కాచిగూడలోని వీరన్నగుట్టలో నివాసం ఉంటున్నారు. అయితే అశోక్‌మహాతొ సంపాదించిన డబ్బులను తన కుటుంబసభ్యులకు ఇవ్వకుండా, తన తమ్ముళ్లకు ఇవ్వడంతో తన కుమారుడికి, భార్యకు తనకు మధ్య గొడవ జరగగా అశోక్‌మహాతొ గత అయిదు రోజుల క్రితం తనకు తెలిసిన వ్యక్తిని పంపించి తన పెద్ద కుమారుడిని కొట్టించాడు. అది మనసులో పెట్టుకొని అశోక్ మహాతొ పెద్ద కుమారుడు అయిన రాజేందర్ కుమార్‌యాదవ్ (20), భార్య క్రాంతిదేవి (40) కలిసి అశోక్ మహాతొను ఒక పథకం ప్రకారం మైనర్ బాలుడి సహాయంతో చంపాలని నిర్ణయించుకున్నారు. అశోక్‌మహాతొను జూన్ 30వ తేదీ రాత్రి 1:00 గంటల సమయంలో తన కొత్తపేటలోని పెద్ద కుమారుడి టీ కౌంటర్‌ను చూసివద్దామని చెప్పి మైనర్‌ను వెంటపెట్టుకొని తన స్కూటీ పైన కొత్తపేట్ నుండి నాగోల్ నుంచి ఒఆర్ఆర్ మార్గంలో పసుమాముల గ్రామం వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి పథకం ప్రకారం వారి వెంట తీసుకువచ్చిన ఐస్‌ను కొట్టే బ్యాటు సహాయంతో బాలుడు, రాజేందర్‌కుమార్‌యాదవ్ కలిసి అశోక్‌మహాతొను తలపైన తీవ్రంగా కొట్టారు. దీంతో అశోక్‌మహాతొ తలకు బలమైన గాయాలు కాగా అతను అక్కడికక్కడే చనిపోయాడు. నిందితులు తమ ఫోన్‌లను స్విచ్‌ఆఫ్ చేసుకొని పారిపోయారు. సమాచారం తెలుసుకున్న నాగోల్ పోలీసులు విచారణ చేపట్టి ఈ నెల 2న నిందితులను పట్టుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినారు. హత్య కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన నాగోల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. సూర్యనాయక్, సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.శివనాగప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శంషుద్దీన్, కానిస్టేబుల్ సుభాష్, సాయిష్‌లను డిసిపి ప్రవీణ్ కుమార్ అభినందించారు.

## ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్‌కు 88,802 మంది దరఖాస్తు

### 6 నుంచి వెబ్‌ఆప్షన్లు.. 40,561 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు..13న మాక్ సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 88,802 మంది కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 28 నుంచే కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా.. ఈ నెల 1 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు 40,561 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. ఈ నెల 7 వరకు విద్యార్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకొని స్లాట్‌బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. అలాగే ఈ నెల 8 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగనుంది.

ఈ నెల 6 నుంచి 10 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మొదటిసారిగా మాక్ సీట్ అలాట్‌మెంట్‌ను ప్రవేశపెట్టగా..ఈ నెల 13న మాక్ సీట్ అలాట్‌మెంట్ చేయనున్నారు. అందులో మార్పులు చేసుకోవడానికి ఈ నెల 14, 15 తేదిల్లో అవకాశం కల్పించారు. అనంతరం ఈ నెల 18లోపు మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు.

మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 18 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో ఈనెల 25న వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలి. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది. 26, 27 తేదిల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. 30లోపు రెండోవిడత సీట్ల కేటాయింపు చేస్తారు. ఈ నెల 30 నుంచి ఆగస్టు 1 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలి.

## బిసి రిజర్వేషన్ల తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాస్తున్నా: ఎమ్మెల్సీ కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 3:** బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితఎఔ అన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తానన్న సీఎం ఇంకా తీసుకెళ్లలేదని విమర్శించారు. జూలై 8 లోపు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీ బిల్లు విషయంమై బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకి లేఖ రాస్తున్నామని చెప్పారు. ఈ నెల 17న బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం జాగృతి ఆధ్వర్యంలో చేపట్టనున్న రైల్ రోను విజయంతం చేయాలన్నారు. రైల్ రోకోకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైల్ రోకో కార్యక్రమానికి వివిధ పార్టీల మద్దతు కూడగట్టామన్నారు.

బీసీ బిల్లుపై బీజేపీ చొరవ తీసుకోవాలని, ఈ విషయమై ఆ పార్టీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుకు లేఖ రాశామని చెప్పారు. ఆయన చొరవ తీసుకోని బీజేపీ అధ్యక్ష హోదాలో తొలి విజయం నమోదు చేసుకోవాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ బీసీల కోసం పార్లమెంట్‌లో ఎన్నడూ మాట్లాడలేదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా బీజేపీపై ఖర్గే ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాత లెక్కలే చెబుతున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణన వివరాలు బయట పెట్టాలన్నారు. జూలై 17న రైల్ రోకో నిర్వహించి తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి రైలును ఆపుతామన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు సాధించేందుకు బీజేపీపై ఒత్తిడి తెస్తామని వెల్లడించారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ మెతక వైఖరి కనబరుస్తున్నదని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబును ఒక్క మాట కూడా అనలేదని ధ్వజమెత్తారు. కొందరి కాంట్రాక్టుల కోసమే బనకచర్ల ప్రాజెక్టు అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారని చెప్పారని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి బనకచర్లను ఆపాలని గట్టిగా కొట్లాడాలని చెప్పారు.



## గంజాయి అమ్ముతూ పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

**హైదరాబాద్ జూలై 3, ప్రభాతవార్త:** సాఫ్ట్‌వేర్‌ఉద్యోగంతో వస్తున్న జీతం సరిపోలేదంటూ స్నేహితుడి సహకారంతో గంజాయి అమ్మకాలకు దిగిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఏకంగా కారును అద్దెకు తీసుకొని కారులో గంజాయి అమ్మకాలు చేపడుతూ ఎక్సైజ్ ఎస్.టి.ఎఫ్ డి టీం సీఐ నాగరాజు బృందానికి పట్టుబడిన వైనం ఇది.మల్లేపల్లి మంగళహార బస్తీలో నివాసం ఉంటూ ఉన్న మహమ్మద్ నదీమ్(26) అనే సాఫ్ట్వేర్ ఉద్యోగి అర్జున్ రెడ్డి అనే స్నేహితుడితో స్నేహం ఏర్పడింది. స్నేహం కాస్త గంజాయి అమ్మకాల వరకు వెళ్ళింది. అర్జున్ రెడ్డి తీసుకు వచ్చినటువంటి గంజాయిని లాంగ్ డ్రైవ్‌యాప్ ద్వారా బుక్ చేసుకుని నారాయణగూడ ప్రాంతంలో అమ్మకాలు చేపడుతున్న తరుణంలో ఎస్.టి.ఎఫ్‌డి టీం సీఐ నాగరాజు సిబ్బంది కలిసి నారాయణగూడ పార్క్ సమీపంలో పట్టుకున్నారు.నిందితుడు వద్దనుంచి 500. 20 గ్రాముల గంజాయిని, కారును సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ నదీమ్ ను అరెస్ట్ చేసి నారాయణగూడ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

గంజాయి అమ్మకాలకు గంజాయి ఇచ్చిన అర్జున్ రెడ్డి పై కూడా కేసు నమోదు చేశారు.అతను పరారీలో ఉన్నాడు.మరో కేసులో..రమావత్ లోక్‌నాథ్ నాయక్ (29) అనే డెలివరీబాయ్ కుకట్పల్లి ఫోర్త్ స్టేజి వద్ద గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నారనే సమాచారంమేరకు అతని బాలానగర్ ప్రాంతంలోపట్టుకున్నారు.నిందితుడువద్ద నుంచి 2.1కేజీల గంజాయిస్వాధీనం చేసుకున్నారు.నిందితుడిది అనంతపూర్ జిల్లా పీకేపీతండా నల్లమడ ప్రాంతం కెపిహెచ్‌బిలో నివాసముంటూ గంజాయి అమ్మకాలు చేపడుతున్నట్లు ఎస్‌సిఎఫ్‌డి టీం లీడర్ నాగరాజు తెలిపారు. నిందితుడిని గంజాయిని బాలానగర్ స్టేషన్‌లో అప్పగించారు.

## ఐటి కారిడార్‌లో బోనాల జాతర

### శిల్పకళావేదిక నుంచి దేవస్థానానికి శోభాయాత్ర

**హైదరాబాద్ జూలై, 3, ప్రభాతవార్త:** తెలంగాణ సాంప్రదాయాలకు ఆధునికతను మేళవిస్తూ, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టీహబ్ వేదికగా తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) బోనాలు 2025 పోస్టరు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటా గ్లోబల్ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాలా, బోనాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ యేడాది ఐటీ బోనాలు వేడుకలు, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ భాగస్వామ్యంలో నిర్వహించనున్నారు. ఈ సంద ర్భంగా సందీప్ మక్తాలా, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి. హరి కృష్ణకు సంస్కృతి పరిరక్షణలో అందిస్తున్న అప్రతిహత మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆషాఢ మాసం రెండో ఆదివారం, జూలై 6న జరగనున్న ఈ ఐటీ బోనాలు సంప్రదాయం నిలిపే ఈ వేడుకలు ఎంతో గొప్పవని, టీటా ద్వారా ఈ సంస్కృతి ఆధారిత కదలిక ఐటీ కారిడార్లో నిలబెట్టడం అభినందనీయమని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశంసించారు. ఈ సంవత్సరం వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా, శిల్పకళావేదిక నుంచి చిన్న పెద్దమ్మ దేవస్థానానికి భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఊరేగింపు ప్రారంభానికి ముందు సందీప్ ముక్తాలా కుటుంబం, అమ్మవారికి చీరెసారెలతో, ఒడి బియ్యాన్ని సమర్పించి ప్రత్యేక సంప్రదాయ పూజ నిర్వహిస్తారు. భక్తితోపాటు సంగీతం, సంప్రదాయం, ఐక్యత నిండిన ఈ ప్రదర్శన ఉద్యోగులకు ఓ సాంస్కృతిక పండుగను రుచి చూపించనుంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి వాకిటీ, శ్రీనివాస్ మారి, హరిని గోలీ, యామిని, మనసా, దినేష్, కీర్తన్, ప్రణీత్, వెంకట్ బూర వంటి బోనాల కమిటీ సభులు పాల్గొన్నారు.

## త్వరలో జిపిఒలకు నియామక పత్రాలు

### రెవెన్యూ జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి

**హైదరాబాద్ జూలై, 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అతి త్వరలోనే గ్రామ పరిపాలన అధికారులు (జీపీఓ)కు నియామక పత్రాలను అందజేసి విధుల్లోకి తీసుకోనున్నారని రెవెన్యూ జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి అన్నారు. ఇప్పటికే జీపీఓ నియామకం కోసం పరీక్ష రాసి అర్హత సాధించిన 3,454 మందికి మొదటి విడతలో ఈ అవకాశం దక్కుతుందన్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ, సిసిఎల్‌ఏలోకేష్ కుమార్ గురువారం రెవెన్యూ ఉద్యోగ సంఘాలు డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్‌ఏ లోకేష్ కుమార్ దృష్టికి పలు విషయాలను లచ్చిరెడ్డి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఉన్న 10,954 గ్రామాలలో అదే సంఖ్యలో జీపీఓల నియామకం చేయాలన్నారు. కానీ ప్రస్తుతం 3,454 మంది మాత్రమే ఎంపిక అయ్యారని గుర్తు చేశారు. ఇదే కాకుండా ఆసక్తి కలిగిన పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలకు మరో సారి జీపీఓ అర్హత పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

61 ఏళ్లు దాటిన వీఆర్‌ఎల వారసులకు సైతం జీపీఓలుగా అవకాశం కల్పించాలని కోరారు. ఇంకా మిగిలిన పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసేలా చూడాలన్నారు. అలాగే వీఆర్‌వోలను ఇతర డిపార్ట్‌మెంట్‌లలో సర్దుబాటు చేసే సమయం కంటే మృతి చెందిన వారి కుటుంబాలలో కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు.

సర్దుబాటు సమయంలో ఇతర జిల్లాలకు పంపిన పూర్వ వీఆర్‌ఎలను సొంత జిల్లాలకు బదిలీ చేయాల న్నారు. అన్ని అంశాలపై సీసీఎల్ఏ లోకేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు.ఎంపికైన జీపీఓల, ఇతర విషయాలను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో చర్చించి అతి త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.పని ఒత్తిడిని బట్టి కార్యాలయాలలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లతో కూడా భూభారతి సదస్సుల దరఖాస్తులు ఎంక్వైరీ చేయించడానికి జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు ఇస్తామన్నారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు

## కంటిన్యుయేషన్ ఆర్డర్లను తక్షణమే జారీ చేయాలి

### ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 3, ప్రభాతవార్త:** నాలుగు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కంటిన్యుయేషన్ ఆర్డర్లను తక్షణమే జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కంటిన్యుయేషన్ సాధనకై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వెంకటేష్, ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి జే.కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశపడ్డారని, కానీ 20 నెలలు గడుస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థలు, శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో కంటిన్యుయేషన్ ఆర్డర్లు జారీ చేయాలి, కానీ అనేక సంస్థలలో, శాఖలలో ఇప్పటి వరకు కొనసాగింపు ఉత్తర్వులు రాకపోవటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నేతలు వై.సోమన్న, టి.సాంబయ్యలతోపాటు వివిధ యూనియన్ నాయకులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



## ఘనా దేశ ప్రముఖులందరికీ మోడీ స్పెషల్ గిఫ్టులు!

**అక్రా,(ఘనా), జూలై 3:** ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన పర్యటనలో ఘనా దేశాధ్యక్షుడికి, ఆయన జీవిత భాగస్వామి ఘన తొలి మహిళకు, ఘనా దేశ ఉపాధ్యక్షుడికి, అలాగే ఘనా పార్లమెంట్ స్పీకర్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక బహుమతులు అందించారు. ఘనా అధ్యక్షుడికి బహుమతిగా ఫైన్ బిద్రి ఆర్ట్‌వర్క్ వాసే. కర్ణాటకలోని బీదర్‌లో తయారైన ఈ అద్భుతమైన బిద్రివేర్ పూలకుండీలు నల్లటి ముగింపు, చక్కటి వెండి పొదుగుదలతో భారతదేశపు ప్రఖ్యాత లోహ చేతిపనులను ప్రసిద్ధి చెందింది. శతాబ్దాల నాటి సాంకేతికతను ఉపయోగించి నైపుణ్యం కలిగిన కళాకారుల చేతితో తయారు చేయబడిన ఈ కుండీలు జింక్‌రాగి మిశ్రమంతో తయారు అవుతాయి. అందం, శ్రేయస్సును సూచించే పూల నమూనాలతో చెక్కబడ్డాయి. వాటి ఐకానిక్ లుక్ కోసం ప్రత్యేకమైన ఆక్సీకరణ ప్రక్రియతో తయారీ పూర్తి అవుతుంది. సాంప్రదాయ కళాత్మకతను సమకాలీన రూపంతో కలిపి సామరస్యం, ఐక్యతను సూచిస్తాయి. వివాహాలు, వార్షికోత్సవాలు, పండుగల సందర్భాలలో వాటిని ఒక బహుమతిగా ఇచ్చి పుచ్చుకుంటారు. కర్ణాటక గొప్ప చేతిపనుల వారసత్వాన్ని, కాలాతీత కళాత్మకతను అవి ప్రతిబింబిస్తాయి. ఘనా అధ్యక్షుడి జీవిత భాగస్వామికి సిల్వర్ ఫిలిగ్రీ వర్క్ పర్స్ బహుమతి. ఒడిశాలోని కటక్‌లో తయారైన సొగసైన సిల్వర్ ఫిలిగ్రీ వర్క్ పర్స్ ఆమెకు గిఫ్ట్‌గా ఇచ్చారు. కటక్‌లోని ప్రఖ్యాత తారకాసి క్రాఫ్ట్‌కు అద్భుతమైన ఉదాహరణ 500 సంవత్సరాలకు పైగా పరిపూర్ణమైన క్లిష్టమైన వెండి ఫిలిగ్రీ. నైపుణ్యం కలిగిన కళాకారులు చేతితో దీన్ని తయారు చేస్తారు. చక్కటి వెండి తీగల నుండి ఏర్పడిన సున్నితమైన పూలు, వైన్ మోటిఫ్‌లను కలిగి ఉంటుంది. ఘనా స్పీకర్‌కు బహుమతిగా చిన్న ఏనుగు అంబారి. పశ్చిమ బెంగాల్‌లో చేతితో తయారు చేసిన ఈ అద్భుతమైన చిన్న ఏనుగు అంబావారి, రాజ సంప్రదాయాన్ని, భారతదేశ గొప్ప కళాత్మక వారసత్వాన్ని సూచిస్తుంది. ఇందులో పూల నమూనాల నుండి గ్రాండ్ పందిరి వరకు ప్రతీది నైపుణ్యం కలిగిన కళాకారులచే కచ్చితత్వంతో చెక్కబడ్డాయి.

## ఖనిజ ఉత్పత్తి, కార్మికుల సంక్షేమం, పర్యావరణ రక్షణే ధ్యేయం

### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** తమ ప్రభుత్వం బొగ్గు తదితర ఖనిజాల ఉత్పత్తిని పెంచడంతోపాటుగా, కార్మికుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో గురువారం బొగ్గు, గనులకు సంబంధించి కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న దాని కంటే ప్రతి ఒక్కరికీ అదనంగా కోట రూపాయల ఇన్సూరెన్స్ ఇస్తున్నమని వెల్లడించారు. ప్రమాదాలు జరగకుండా అన్నిరకాల చర్యలను పకడ్బందీగా తీసుకుంటున్నామని చెప్పారు. మైన్ క్లోజర్, మినరల్ ఎక్స్‌ప్లొరేషన్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. అనంతరం సింగరేణిలో పచ్చదనం పెంపుదలకు మంత్రి సమక్షంలో కన్హా ఆశ్రమంతో అవగాహన ఒప్పందం కుదిరింది. సింగరేణిలో పచ్చదనంతో పాటు, స్థానికుల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు, ఓపెన్ కాస్ట్ ఓవర్ బర్డెన్ డంపులు, ఖాళీ ప్రదేశాలు, బొగ్గు రవాణా బెల్టుల పక్కన పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టనున్నారు. పర్యావరణ పార్కులు, వర్షారణ్యాలు, హరిత కంచెల ఏర్పాటు. పనుల్లో స్థానికులకు భాగస్వామ్యం కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, అదనపు కార్యదర్శి రూపేంద్ర బ్రార్, సింగరేణి సిఎండి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రూడ్ పామాయిల్ దిగుమతి సుంకాన్ని పెంచాలి

### కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** క్రూడ్ పామ్‌ఆయిల్ పై దిగుమతి సుంకాన్ని గతంలో మాదిరిగా 44 శాతానికి పెంచాలని కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి నిర్మలసీతారామన్‌ను గురువారం ఆయన లేఖ రాశారు. ఇటీవల కేంద్రం క్రూడ్‌పామ్ ఆయిల్‌పై ఉన్న దిగుమతి సుంకాన్ని 27.5 నుండి 16.5 కి తగ్గించిందన్నారు, దీంతో పామ్‌ఆయిల్ సాగుకు రైతులు వెను కంజ వేసే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా సాగు లక్ష్యాల్లో వెనకబడే అవకాశం ఉందని వెల్లడించారు. ఆయిల్‌పామ్ సాగు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1.25 లక్షల హెక్టార్ల సాగును లక్ష్యంగా పెట్టు కున్న ట్లు తెలి పారు. ఇప్పటి వరకు 78,870 హెక్టార్లలో 56,231 మంది రైతులతో సాగునుచేపట్టి దేశంలోనే మొదటిస్థానంలో నిలిచిందన్నారు.

## వాయవ్య, నైరుతి చైనాల్లో భారీ వరదలు

### ఆరుగురు మృతి, అత్యవసర పరిస్థితి ప్రకటన

**గ్యాంగ్‌ఝౌ(చైనా), జూలై 3:** చైనాలో భారీ వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దేశంలోని వాయువ్య, నైరుతి ప్రాంతాల్లో కుండపోతగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. భారీ వర్షాలు వరదలతో ఇప్పటివరకు ఆరుగురు మరణించారని అధికారులు ధృవీకరించారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం పలు ప్రావిన్సులలో లెవెల్4 అత్యవసర పరిస్థితిని ప్రకటించి సహాయక చర్యలు ముమ్మరం చేసింది. గుయిజౌ ప్రావిన్సులోని రోంగ్‌జియాంగ్ కౌంటీలో వరదల కారణంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడ వారం వ్యవధిలోనే రెండుసార్లు తీవ్రమైన వరదలు సంభవించాయి. స్థానికంగా ఎంతో ప్రసిద్ధి చెందిన విలేజ్ సూపర్ లీగ్ (కున్ చావో) ఫుట్‌బాల్ స్టేడియం సైతం ఐదు రోజుల్లో రెండుసార్లు నీట మునిగింది. చైనా జలవనరుల మంత్రిత్వ శాఖ గురువారం క్విన్‌ఘై ప్రావిన్సులో కొత్తగా లెవెల్4 ఎమర్జెన్సీని ప్రకటించింది. రాబోయే మూడు రోజుల పాటు ఈ ప్రాంతంలో అతి భారీ వర్షాలు కురుస్తాయని, దీనివల్ల ఎల్లో రివర్ ఉపనదుల్లో నీటిమట్టం గణనీయంగా పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# భారత్ నుంచి గల్ఫ్ దేశాలకు తరలిపోతున్న మిలియనీర్లు

అధికపన్నులు, సుంకాల భారమే ఇందుకు కారణం

**న్యూఢిల్లీ, జూలై 3 :** అధికపన్నులు, ఇతర అదనపుసుంకాల కారణంగా భారత్‌లోని మిలియనీర్లు, బిలియనీర్లు గల్ఫ్‌దేశాలవైపు మొగ్గుచూపిస్తున్నారు. అత్యధికశాతం సంపన్నులు, భారత్‌నుంచి దుబాయి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్లి అక్కడే స్థిరపడాలని చూస్తున్నారు. ఈ రెండుదేశాల్లోనూ ఆదాయపు పన్నులు ఉండవు. కార్పొరేట్ పన్నులు కూడా అతితక్కువగానే ఉంటాయి. క్యాపిటల్‌గెయిన్స్‌ట్యాక్స్ అనేది అక్కడ కనిపించదు. అందువల్లనే సంపన్నులంతా తమ సంపదను అటువైపు మళ్లించేందుకే ఆసక్తి ఎక్కువచూపిస్తున్నారు. భారత్‌లో ఉన్న పన్నుల వ్యవస్థలో ఆదాయపు పన్ను 15 లక్షలకు మించి ఆదాయం ఉన్నవారికి 30శాతం పనున్లఉ చెల్లించాలి. ఐదుకోట్లకుపైబడి ఆదాయం ఉన్నవారు కూడా పన్నులుచెల్లించాలి. వీటికితోడు మూలధన లబ్ధిపై పన్ను(సిజిటి), సంపద పన్నులు, ఇతర సుంకాలు లావాదేవీలపై విధిస్తున్నారు. ప్రత్యేకించి భారీ సంపన్నులు (హైనెట్‌వర్త్ ఇండివిద్యువల్స్) అయితే ఈ పన్నులభారంనుంచి బయటపడేందుకు ఈ రెండు దేశాల్లోనే స్థిరపడేందుకు ఎక్కువ ఆసక్తిచూపిస్తున్నారు. అదే యుఎఇ ప్రత్యేకించి దుబాయిలో అయితేపన్నురహిత వాతావరణం ఉంటుంది. ఎలాంటి వ్యక్తిగత ఆదాయపు పన్నులుండవు. తొమ్మిదిశాతం మాత్రమే కార్పొరేట్ పన్నులు ఉంటాయి. మూలధనలబ్ధి, వారసత్వపు పన్నులు, సుంకాలు, సంపదపై పన్నులు, లావాదేవీలపై పన్నులు సుంకాలు వంటివి లేనేలేవు. అందువల్లనే ఎక్కువ మంది భారత మిలియనీర్లు, బిలియనీర్లు ఈ రెండు ప్రాంతాలకు వెళ్లేందుకే ఇష్టపడుతున్నారు. అలాగే దుబాయిలో బిజినెస్ ఫ్రెండ్లీ వీఆఇరణం ఉంది. ప్రత్యేక ఆర్థిక మండళ్లు, విదేశీ పెట్టుబడులకు రెడ్‌కార్పెట్ స్వాగతం వంటివి ఉంటాయి. అలాగే అత్యున్నతస్థాయి జీవనశైలి అందుకు అనుగుణమైన ప్రపంచ స్థాయి మౌలకవసరులు, లగ్జరీ వసతులు, కాస్మోపాలిటన్ వాతావరణం ఉంటుంది. యుఎఇ లో రాజకీయ స్థిరత్వం ఉంటుంది. పెట్టుబడులకు భద్రత ఎక్కువ. స్థిరనివాసం ఉండే కుటుంబాలకు, వారి ఆస్తులకు కూడా రక్షణ ఎక్కువ లభిస్తుంది. అందుకే మిలియనీర్లు, బిలియనీర్లు అటు వైపు దృష్టిపెంచుతున్నారు. హెన్లీ ప్రైవేట్ వెల్త్‌మైగ్రేషన్ నివేదికను బట్టిచూస్తే 3500 మంది మిలియనీర్లు విదేశాల్లో స్థిరపడేందుకే ఆసక్తితో ఉన్నట్లు తేలింది. 2023లో 5100 మంది భారత మిలయనీర్లు, 2024లో 4300 మంది మిలియనీర్లు అటుగా వెళ్లినట్లు నివేదికలోప్రస్తావించింది. ఇలా భారత్‌నుంచి వలస పోతున్న మిలియనీర్ల సంపద 2014నుంచి 2024 మధ్యకాలంలో సుమారు 26.2 బిలియన్ డాలర్లవరకూ ఉంటుందని సంస్థ అంచనావేసింది. అదే సమయంలో భారత్‌లో మిలియనీర్ల సంఖ్య 72శాతంపెరిగింది. అంతర్జాతీయంగా సుమారు 1.42 లక్షలమంది మిలియనీర్లు తమతమ స్థావరాలను రీలొకేట్ చేసుకున్నారు. 2026 నాటికి వీరి సంఖ్య 1.65 లక్షలకు పెరిగినా ఆశ్చర్యంలేదని తేలింది. ఒక్కభారత్‌లోనే కాదు యూరోప దేశాలు యుకె, రష్యాలతోపాటు ఆగ్నేయాసియా, ఆఫ్రికా దేశాలు కూడా ఇపుడు గోల్డెన్ వీసా అవకాశాలిస్తున్నాయి. యుఎఇలో అయితే 9800వరకూ జారీచేసింది. సౌదీ అరేబియాకు అయితే ఈ ఏడాది 2400 మందివరకూ కొత్తగా మిలియనీర్లు రావచ్చని అంచనా. అలాగే ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ వంటి దేశాల్లోకూడా 1700



మందివరకూ మొత్తంగా మిలియనీర్లు వలసవెళ్లే ప్రమాదం ఉందని సర్వేసంస్థ ఉటంకించింది. అలాగే సాంప్రదాయంగా బిలియనీర్లు సింగపూర్‌కు 1600మంది వెళ్లిపోయారు. ఆస్ట్రేలియాకు వెయ్యి, కెనడాకు వెయ్యి, న్యూజిలాండ్‌కు 150 మంది మిలియనీర్లు తమ సంపదను అక్కడ భద్రపరుచుకుని స్థిరనివాసం కోసం ఆసక్తితో ఉన్నట్లు హెన్లీ సంస్థ స్పష్టంచేసింది.

# నేడు పాలిసెట్-2025 సీట్ల కేటాయింపు

### 114 కాలేజీల్లో అందుబాటులో 28,590 సీట్లు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలీసెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా నేడు(శుక్రవారం0 సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యే నాటికి 21,316 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 15,691 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. పాలీసెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా జూన్ 24 నుంచి 28 వరకు పాలీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు తమ వివరాలను అప్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జూన్ 26 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చేపట్టారు. వెబ్ ఆప్షన్లను ఇచ్చిన వారికి నేడు సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు.

రాష్ట్రంలో 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 14,280 సీట్లు అందుబాటులో ఉండగా.. 55 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 14,310 సీట్లు ఉన్నాయి. మొత్తం 114 పాలిటెక్నిక్ కాలేజీల్లో 28,590 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా కేసముద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రారంభం కానుండగా అందులో నాలుగు కోర్సుల్లో 240 సీట్లను భర్తీ చేయనున్నారు. అలాగే పటాన్‌చెర్వులో మరో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మూడు కోర్సుల్లో 180 సీట్లను అందుబాటులోకి తెచ్చారు.

గత ఏడాది 57 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీలు ఉండగా..ఈ ఏడాది రెండు కాలేజీలు మూతపడటంతో 55 కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకోనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 6 వరకు ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి అవకాశం కల్పించారు. ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 9, 10 తేదిల్లో నిర్వహించనున్నారు.

జులై 11న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 11, 12 తేదిల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. వారికి జులై 15లోపు సీట్ల కేటాయింపు చేస్తారు. సీటు పొందిన వారు జులై 15, 16 తేదిల్లో ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. జులై 15 నుంచి 17 వరకు సీటు పొందిన కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. జులై 18 లోపు కాలేజీల్లో జాయినింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. జులై 15 నుంచి అకడమిక్ సెషన్‌ను ప్రారంభించనున్నారు.

# రాహుల్‌జీని ప్రధాని చేయడమే నా లక్ష్యం

**రేవంతన్నను ఇంకో పదేళ్లు సిఎంగా చూడాలని అనుకుంటున్నా**

**నేను బిసిని, బిసి కోసం కడదాకా కొట్లాడుతా;**

**కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి వ్యాఖ్యలు**

**సతీమణి, మంత్రి కొండా సురేఖతో కలిసి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షినటరాజన్‌తో భేటీ**

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** భారత్ జోడో యాత్రతో దేశంలోని ప్రతి పేదవాడి సమస్యలు తెలుసుకుంటూ, ముందుకు కదులుతున్న రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయడమని తన లక్ష్యమని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రకటించారు. గురువారం అటవీశాఖ మంత్రి కొండ సురేఖతో కలిసి కొండమురళి ఎఐసిసి తెలంగాణ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్‌ను ఎమ్మెల్యే క్వార్టర్‌లో కలిశారు. తాను బిసిని అని బిసిల కోసం కడదాకా కొట్లాడుతా అంటూ ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై ఆమెకు కొండా దంపతులు సుదీర్ఘంగా వివరించారు. వారు చెప్పిన అంశాలు మీనాక్షి నటరాజన్ సావధానంగా విన్న ట్టు తెలిపారు.

తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్ళగా అన్ని అంశాలు పరిష్కరిస్తానని సానుకూలంగా మీనాక్షి చెప్పినట్టు వివరిం చారు. అనంతరం కొండమురళీ మీడియాతో మాట్లాడుతూ తాను అణగారిన వర్గాల కోసం పని చేస్తానని చెప్పారు ఆ వర్గంలో తాను బలమైన నేతను అయిందున అందరూ తన దగ్గరికి వస్తారని చెప్పారు. పేదల సమస్యలు తీర్చుతున్నాను. కాబట్టే జనం తన దగ్గరికి వస్తారని చెప్పుకొచ్చారు. తనకి ప్రజాబలం ఉందని, పనిచేసే వారిపైనే రాళ్ళు వేస్తారని అన్నారు. నడిచే ఎద్దునే పొడుస్తారని కొండా మురళి వ్యాఖ్యానించారు. పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చినా, గెలిపించే బాధ్యత తాను తీసుకుంటానని మీనాక్షితో చెప్పానన్నారు. తమను పార్టీ ఉపయో గిం చుసుకోవాలని చెప్పినట్టు వెల్లడించారు. తన సేవలు పార్టీకి అవసరమని మీనాక్షి ఉద్ఘాటించినట్టు వివరించారు. 'నేను బీసీ కార్డును పట్టుకునే బతుకుతున్నాను. అణగారిన వర్గాలు బలం ఉన్నవాడి దగ్గరికే వస్తారు. పేదల సమస్యలు తీర్చుతాను కాబట్టే జనం నా దగ్గరికి వస్తాను. నాకు ప్రజాబలం ఉంది. పనిచేసే వారిపైనే బండలు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు . పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చిన గెలిపించే బాధ్యత నేను తీసుకుంటానని మీనాక్షి తో చెప్పాను. మమ్మల్ని పార్టీ ఉపయోగించుకోవాలని చెప్పాను. పార్టీకి మీ సేవలు అవసరమని మీనాక్షి చెప్పారు. కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా



ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా ఉద్దేశం.. రేవంతన్నను ఇంకో పదేండ్లు ముఖ్యమంత్రిగా చూడాలని అనుకుంటున్నట్టు చెప్పారు. బిసి బిడ్డ అయిన టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్ కు అండగా నిలుస్తా ' అని కొండా మురళి స్పష్టంగా వివరించారు.

**నేను ఏ తప్పు చేయలేదు: మంత్రి కొండా సురేఖ**

ఇంచార్జ్‌తో భేటీ అనంతరం కొండా దంపతులు మీడియాతో మాట్లాడారు. 'నాకు ఇచ్చిన శాఖలకు న్యాయం చేస్తున్నాను. రూల్స్ ప్రకారమే నేను పని చేస్తున్నాను. నా డిపార్ట్మెంట్‌లో ఉన్న ఫైల్స్ అన్నీ పరిశీలించుకోవచ్చు. మంత్రిగా నేను ఇప్పటి వరకు ఎలాంటి తప్పులు చేయలేదు. నా మంత్రి పదవిపై ఎవరు మాట్లాడినా నేను స్పందించాను. సుష్మితలో పారేది కొండా మురళీ, కొండా సురేఖ రక్తం. నా కూతురికి మా ఆలోచనలు వంశ పారపర్యంగా రావడంలో తప్పు లేదు. సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేం' అని కొండా సురేఖ అన్నారు.

# రాహుల్‌గాంధీ తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 3:** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. 2014 విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని ఏ రోజు మోడీ ప్రభుత్వాన్ని రాహుల్ నిలదీయలేదు అని కేటీఆర్ గుర్తు చేశారు.ఎంత పెరిగినా గొర్రెకు బెత్తడే తోక అన్నట్టు ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ సాధించింది ఏం లేదన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్.. తెలంగాణ సమస్యలు, ఈ ప్రాంతానికి హక్కుగా రావాల్సిన అంశాల మీద ఏ రోజు కూడా మాట్లాడలేదన్నారు. తెలంగాణకు ద్రోహం చేయడంలో బీజేపీతో రాహుల్ గాంధీ కలిసి పనిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొట్టే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాహుల్ మౌనంగా ఉండడం ముమ్మాటికి కుట్రే అన్నారు. గోదావరిలో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను తన గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ధారాదత్తం చేస్తుంటే ఆపకుండా రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.

2014 పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఇప్పటి వరకు రాహుల్ గాంధీ ప్రశ్నించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కాళేశ్వరం లేదా పాలుమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి కేంద్రాన్ని రాహుల్ ఎందుకు నిలదీయ డం లేదో చెప్పాలన్నారు. విభజన చట్టంలో ఉన్న ఐటి ఇన్వెస్టిమెంట్ రీజియన్ (ఐటిఐఆర్) ను 2015లోనే మోడీ ప్రభుత్వం రద్దు చేస్తే రాహుల్ గాంధీ మాట మాట్లాడకుండా కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికారన్నారు. వరంగల్ ప్రజల చిరకాల కోరిక అయిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయంలో కూడా రాహుల్ వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు.

ఇక బొగ్గు బ్లాక్‌లను కేటాయించకుండా తెలంగాణ కొంగు బంగారం సింగరేణి అస్థిత్వాన్నే మాయం చేయాలనుకున్న మోడీ ప్రభుత్వ కుట్రలపై రాహుల్ గాంధీ ఏ రోజు కూడా లోక్‌సభలో మాట్లాడలేదన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అమలుచేయలేక రేవంత్ రెడ్డి చతికిలపడితే రాహుల్ తప్పించుకు తిరుగుతున్నారని కేటీఆర్ విమర్శించారు.

హామీల అమలుకు తనదే గ్యారంటీ అని గప్పాలు కొట్టిన రాహుల్, ఇప్పుడు తెలంగాణకు రాకుండా ముఖం చాటేశారన్నారు. ఎన్నో ఆశలతో కాంగ్రెస్‌ను గెలిపించిన తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ ఇచ్చిన శాపం రేవంత్ సర్కార్ అని కేటీఆర్ మండిపడ్డారు.

## 9న జరిగే కార్మిక సంఘాల జాతీయ సమ్మెకు సంపూర్ణ మద్దతు

### వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన వామపక్ష యువజన సంఘాలు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఈ నెల 9న జరగనున్న కార్మిక సంఘాల జాతీయ సార్వత్రిక సమ్మెకు వామపక్ష యువజన సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్ నాయకులు గురువారం ఆవిష్కరించారు. దేశంలోని కార్మికులకు నష్టం కలిగించే 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 9న కార్మిక సంఘాలు తలపెట్టిన జాతీయ సార్వత్రిక సమ్మెకు వామపక్ష యువజన సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొనాలని నిర్ణయించాయి. సమ్మెకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్ సంఘాల రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కెఎస్ ప్రదీప్, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం రవి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వామపక్ష యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ .. బ్రిటిష్ కాలంలోనే 44 కార్మిక చట్టాలను సాధించుకోవడం జరిగిందని నాయకులు గుర్తు చేశారు. కానీ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. రానున్న రోజుల్లో దేశంలోని యువత మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తారని, ఈ నెల 9న జరగనున్న సమ్మెలో రాష్ట్ర వ్యాప్తంగా యువజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యువజన సంఘాల నాయకులు యువతకు పిలుపునిచ్చారు.

## విద్యుత్ కనెక్షన్లు సులభతరం

### ఎస్పీడిసిఎల్ సిఎండి ఫరూఖీ

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** వినియోగదారులకు సమర్థవంతమైన, పారదర్శకమైన సేవలను త్వరితగతిన అందించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ (ఎస్పీడీసీఎల్) చర్యలు చేపట్టిందని ఆ సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖీ వెల్లడించారు. ఇందులో భాగంగా తమ సంస్థ పరిధిలో 33 కేవీ కొత్త హెచ్‌టి సర్వీసు దరఖాస్తుల కోసం ఆటో ఎస్టిమేట్ సాఫ్ట్ వేర్ అభివృద్ధి చేసిందన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో ఈ విధా నంలో ముందుగా నూతన హెచ్‌టి సర్వీసు కు దరఖాస్తు చేసిన తరవాత హైటెన్షన్ కన్స్యూమర్ సర్వీస్ కనెక్షన్ సిస్టమ్ జిఐఎస్ కోఆర్డినేట్లను సేకరించి ఆ వివరాలను యాప్ ద్వారా డైరెక్ట్‌గా చీఫ్ ఇంజినీర్ కమర్షియల్‌కు పంపు తుందని వివరించారు. ఈ సమాచారం అందగానే నేరుగా ఎస్టిమేట్ రూపొందించబడుతుందని చెప్పారు. దాని ఆమోదం తర్వాత డిమాండ్ నోటీసు ఆటోమేటిక్‌గా సంబంధిత వినియోగదారుడికి ఎస్ఎమ్మెఎస్, ఈమెయిల్ ద్వారా పంపబడతాయని వెల్లడించారు. ఈ సింగల్ విండో పద్ధతిలో జరిగే ఈ ప్రక్రియ వలన అతి తక్కువ సమయంలో అన్ని అనుమతులు జారీ అవుతాయని పేర్కొన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుదారులు. సాఫ్ట్‌వేర్ సంస్థల యాజమాన్యాలకు హెచ్‌టి కనెక్షన్లు మరింత సులభంగా అందించేందుకు ఆటో ఎస్టిమేట్ సాఫ్ట్‌వేర్ సిస్టంను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ విధానంలో నేరుగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

## ఎస్పీడిసిఎల్‌లో 339 పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలో 339 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు విడుదల చేశారు. ఇంత క్రితం విద్యుత్ శాఖలో 217 మంది జూనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు, మరో 216 ఇతర కేటగిరి పోస్టులు ఉండేవని వివరించారు. గ్రేడ్-1 డీఎం పోస్టు నుంచి మొదలుకొని స్టోర్ కీపర్ వరకూ ఉన్న పోస్టులను క్రోడీకరించి అవసరమైన వాటిని ఉంచి, మిగిలిన వాటిని తొలగించినట్లు అందులో వెల్లడించారు, వీటికి మరి కొన్ని పోస్టులు చేర్చడం ద్వారా వీటి సంఖ్య 339కి చేరిందన్నారు.

## వియన్నాలో నిలిచిపోయిన ఎయిరిండియా విమానం

**వియన్నా, జూలై 3:** ఎయిరిండియా విమానాల్లో వరుసగా సాంకేతిక సమస్యలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా, ఢిల్లీ నుంచి వాషింగ్టన్ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం (ఏఐ103) ఆస్ట్రియా రాజధాని వియన్నాలో నిలిచిపోయింది. ఇంధనం నింపుకోవడానికి అక్కడ ఆగిన విమానంలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో ప్రయాణాన్ని రద్దు చేశారు. ముందురోజు ఢిల్లీలో బయలుదేరిన ఈ విమానం ప్రణాళిక ప్రకారమే వియన్నాలో ఆగింది. అయితే, సాధారణ తనిఖీల సమయంలో విమానంలో ఒక ముఖ్యమైన నిర్వహణ సమస్యను సిబ్బంది గుర్తించారు. దాన్ని సరిచేయడానికి అదనపు సమయం పట్టే అవకాశం ఉండటంతో, వియన్నా నుంచి వాషింగ్టన్‌కు కొనసాగాల్సిన ప్రయాణాన్ని రద్దు చేసినట్టు ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు. దీంతో ప్రయాణికులను విమానం నుంచి దించివేసి, వారికి ప్రత్యామ్నాయ విమానాల్లో ఏర్పాట్లు చేయడం లేదా టిక్కెట్ డబ్బులు పూర్తిగా వాపసు ఇవ్వడం వంటివి చేసినట్టు చెప్పారు. ఈ కారణంగా, వాషింగ్టన్ నుంచి ఢిల్లీ రావాల్సిన ఏఐ 104 విమానాన్ని కూడా రద్దు చేశారు. ఎయిరిండియా విమానాల్లో సాంకేతిక లోపాలు తలెత్తడం ఇటీవలి కాలంలో ఇది మొదటిసారి కాదు. గతనెల 14న ఢిల్లీ నుంచి వియన్నా వెళ్లిన ఏఐ187 విమానంలో గాల్లోనే తీవ్రమైన హెచ్చరికలు వెలువడ్డాయి. విమానం గాల్లోకి లేచిన కొద్దిసేపటికే 'స్టిక్ షేకర్' వార్నింగ్‌తో పాటు, 'కిందకు వెళ్లొద్దు' (డొంట్ సింక్) అంటూ గ్రౌండ్ ప్రాక్సిమిటీ వార్నింగ్ సిస్టమ్ హెచ్చరించింది. ఆ సమయంలో విమానం దాదాపు 900 అడుగుల ఎత్తును కోల్పోయిందని, అయితే సిబ్బంది వెంటనే తేరుకుని విమానాన్ని సురక్షితంగా వియన్నా చేర్చారని అధికారులు వెల్లడించారు. గతనెల 12న 260 మందికి పైగా ప్రయాణికులను బలిగొన్న అహ్మదాబాద్‌లండన్ విమాన ప్రమాదం జరిగిన 38 గంటల్లోనే ఈ ఘటన జరగడం గమనార్హం.

# రక్షణ శాఖకు 435 ఎకరాల హెచ్‌ఎండిఎ భూములు

### రిజర్వ్ ఫారెస్ట్ స్థలాలకు బదులు రెవెన్యూ భూములు

### త్వరలో ఎలివేటెడ్ కారిడార్ల పనులు, 4 స్కైవాక్స్ నిర్మాణానికి చర్యలు

### హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్‌అహ్మద్ మీడియాతో చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 3:** హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ల పనులు త్వరలోనే పట్టాలెక్కనున్నాయని, రక్షణశాఖకు సంబంధించిన భూములను హెచ్‌ఎండీఏకు బదలాయించడానికి ఒప్పందం చేసుకోవడం కీలక పరిణామమని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. అమీర్ పేట్ లోని హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయంలో గురువారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో రక్షణశాఖకు చెందిన 142 ఎకరాల సేకరించడంతో తిరిగి రక్షణశాఖకు జవహార్ నగర్ లోని 435 ఎకరాల హెచ్‌ఎండీఏ భూములను ఇవ్వనున్నట్టు తెలిపారు. రావిర్యాల రతన్ టాటా ఇంటర్ ఛేంజ్ నుంచి ఆమన్ గల్ వరకు నిర్వహించనున్న గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ల నిర్మాణ పనులకు టెండర్లు పూర్తయ్యాయని, కోర్టు కేసుల కారణంగా పనులు ప్రారంభించలేదన్నారు. ఈ ప్రాజెక్టులో 231 రిజర్వ్ ఫారెస్టు భూములను సేకరించామని, వీటికి బదులుగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలోని రెవెన్యూ భూములు ఇవ్వనున్నట్టు ఆయన చెప్పారు. కొత్తగా మూడు ప్రాంతాలైన కంది,ఫసల్‌వాడీ, పెద్ద కంజర్లలో హెచ్‌ఎండిఏ లేఅవుట్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికే ప్రతాపసింగారం, బాచుపల్లి, ఇనుముల్ నర్వ,లేమూరు ప్రాంతాల్లో లే అవుట్లను అభివృద్ధి చేశామని తెలిపారు. రైతులతో చర్చించి భూములు తీసుకుంటున్నామని తెలిపారు. దీంతో పాటు హెచ్‌ఎండిఏ పరిధిలోని ప్రభుత్వ,అసైన్ భూములను సేకరించి పెద్ద పెద్ద లేఅవుట్లు చేయాలని భావిస్తున్నామని చెప్పారు. హెచ్‌ఎండిఏక చెందిన భూములు,లేఅవుట్లలో 10శాతం మార్టిగేజ్ స్థలాలు కబ్జాకు గురువుతున్నాయని, వాటిని పరిరక్షించడంతో పాటు రెంట్,లీజ్ వంటి విధానంలో ఆదాయాన్ని రాబట్టుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో నాలుగు స్కైవాక్స్ ఏర్పాటు చేయడానికి హెచ్‌ఎండిఏ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మెట్రో రైలు ప్రాజెక్టు ఈస్ట్,వెస్ట్ స్టేషన్లతో పాటు రేతిఫైల్,సికింద్రబాద్,కీస్ హైస్కూల్ బస్టాప్‌లను కలిపేవిధంగా స్కైవాక్ రూపొందించామని చెప్పారు. కూకట్‌పల్లి జెఎన్టీయు నుంచి మెట్రో స్టేషన్ వరకు,జెఎన్‌టియు నుంచి ప్రగతి నగర్ మార్గంలో వెళ్లేందుకు పాదచారుల కోసం స్కైవాక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉప్పల్ జంక్షన్ వద్ద ఉప్పల్ వెళ్లే మార్గం(ఎడమ)లో శ్మశానవాటిక ఉండటంతో స్కైవాక్ ఏర్పాటు చేయలేకపోయాయని, దీంతో ప్రమాదాలు జరుగుతుండటంతో అక్కడ కూడా స్కైవాక్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మెహిదీపట్నం స్కైవాక్‌ను ఆగస్టు 15న ప్రారంభించనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎండిఏ మాస్టర్ ప్లాన్-2050 పనులు 2026 ఏప్రిల్,మే మాసాల్లో పూర్తి కానుందని కమిషనర్ తెలిపారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్,ఎకానమిక్ డవలప్‌మెంట్ ప్లాన్, బ్లూ,గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు.

# 'సోలో బాయ్' విడుదలకు సిద్ధం

సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బిగ్ బాస్ ఫేమ్ గౌతమ్ కృష్ణ హీరోగా రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరోయిన్స్‌గా నవీన్ కుమార్ దర్శకత్వంలో సతీష్ నిర్మాతగా జులై 4వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. త్రిలోక్ సుద్దు ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా చేయగా ప్రవీణ్ పూడి ఎడిటింగ్ చేశారు. సోలో బాయ్ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో చిత్ర నిర్మాత సతీష్ మీడియా వారితో ఇంటర్వ్యూలో పాల్గొని మీడియావారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం జరిగింది. **సోలో బాయ్ చిత్ర ప్రస్థానం ఎలా మొదలైంది?**




సోలో బాయ్ చిత్ర హీరో గౌతమ్ కృష్ణ నాకు చాలా మంచి స్నేహితుడు. అతను ఈ సినిమా లైన్ చెప్పినప్పుడు మధ్యతరగతి కుటుంబంలోని 17 సంవత్సరాల నుండి సెటిల్ అవ్వడానికి పడే కష్టం తాలూకా పాయింట్ నాకు చాలా బాగా నచ్చింది. **ప్రొడక్షన్ విషయంలో మీరు తీసుకున్న జాగ్రత్తలు ఏంటి?** అనవసరమైన ఖర్చులు ఎక్కడ పెట్టకుండా ప్రతి విషయంలో జాగ్రత్తపడి ఖర్చు పెట్టాము. చిత్రానికి పనిచేసిన యంగ్ టీం అంతా తక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటూ సినిమాకు బాగా సపోర్ట్ చేశారు. **ప్రస్తుత సినిమాలపై, బయట మార్కెట్ పై మీ ఉద్దేశం ఏంటి?** గతంలో బట్టల రామకృష్ణ బయోపిక్ సినిమా తీసినప్పుడు ఒక ఎక్స్పరిమెంట్ లాగా చేశాము. అది మాకు వర్కౌట్ అయింది. ఇప్పుడు ఆ సమయంలో నేర్చుకున్న వాటిని బేస్ చేసుకుని తగ్గ జాగ్రత్తలు తీసుకుంటూ సోలో బాయ్ సినిమా చేశాము. **సినిమా రన్ టైమ్ ఎం? ఎన్ని థియేటర్లలో విడుదల కానుంది?** ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకునేప్పటికీ రెండు గంటల పది నిమిషాలు ఫైనల్ అవుట్ పుట్ వచ్చింది. గౌతమ్ కృష్ణ బిగ్బాస్ ఫేమ్ **సినిమాకు ఎంతవరకు ప్లస్ అవుతుంది?** గౌతమ్ ఈ సినిమా ప్రమోషన్లలో 100 మంచి సపోర్ట్ ఇస్తున్నారు. బిగ్ బాస్ రెండు సీజన్లో ఉండటం వల్ల అతని ఫేమ్ ఈ సినిమాకు మరింత తోడ్పడు తుంది అనుకుంటున్నాను.

# 'హరి హర వీరమల్లు' ట్రైలర్ లాంచ్

పవన్ కళ్యాణ్ చారిత్రక యోధుడిగా కనువిందు చేయనున్న చిత్రం హరి హర వీరమల్లు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ.దయాకర్ రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం.జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. జూలై 24న విడుదల కానున్న హరి హర వీరమల్లు సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలకు విశేష స్పందన లభించింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌తో అంచనాలు రెట్టింపు అయ్యాయి. జూలై3 (గురువారం) హైదరాబాద్‌లోని విమల్ థియేటర్‌లో హరి హర వీరమల్లు ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. అలాగే అభిమానుల కోసం దేశవ్యాప్తంగా పలు థియేటర్లలో ట్రైలర్‌ను ప్రదర్శించారు. భారీ సంఖ్యలో అభిమానులు తరలి రావడంతో థియేటర్లన్నీ కళకళలాడాయి. హరి హర వీరమల్లు ట్రైలర్‌ను మూడు నిమిషాల నిడివితో రూపొందించారు. ట్రైలర్‌లో ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా ఉంది. పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్తగా కనిపిస్తున్నారు. ఢిల్లీ సుల్తానులు నుండి సనాతన ధర్మాన్ని రక్షించడానికి నడుం బిగించిన యోధుడు, మొఘల్ శక్తిని ధిక్కరించిన వీరుడు వీరమల్లుగా పవన్ కళ్యాణ్ కనిపించిన తీరు కట్టిపడేసింది. మొఘల్ సామ్రాజ్యంలో అత్యంత అపఖ్యాతి పాలైన పాలకులలో ఒకరైన ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్ భయంకరంగా కనిపిస్తున్నారు. కోహినూర్ వజ్రం కోసం పోరాటం, మొఘలులతో వీరమల్లు తలపడటం వంటి సన్నివేశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

గంభీరమైన రూపాన్ని కనబరుస్తూ, సనాతన ధర్మం పట్ల మక్కువను వ్యక్తపరుస్తూ.. భయమనేది ఎరుగని వీరుడు వీరమల్లుగా పవన్ కళ్యాణ్ కనిపించిన తీరు నభూతో నభవిష్యత్. వీరమల్లు పాత్ర కోసం తనని తాను మలచుకున్న తీరు అమోఘం. యాక్షన్ సన్నివేశాల్లో పవన్ కళ్యాణ్ మరింతగా ఆకట్టుకున్నారు. తన అద్భుతమైన అభినయం, ఆహార్యంతో వీరమల్లు పాత్రకు ప్రాణం పోశారు. ట్రైలర్‌లోని ఆంధి వచ్చేసింది అనే డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ కళ్యాణ్ స్ఫూర్తి దాయక రాజకీయ ప్రయాణాన్నిఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన మాటను గుర్తు చేసేలా ఉన్న ఈ డైలాగ్.. అభిమానుల రోమాలు నిక్కబొడిచేలా చేస్తోంది. అందరూ నేను రావాలని దేవుడిని ప్రార్థిస్తారు.. కానీ మీరు మాత్రం నేను రాకూడదని కోరుకొంటున్నారు అనే మరో డైలాగ్ కూడా పవన్ కళ్యాణ్ ప్రస్తుత ఇమేజ్ కి తగ్గట్టుగా అభిమానులు మెచ్చేలా ఉంది.




# 25న 'ఫెంటాస్టిక్ ఫోర్:ఫస్ట్ స్టెప్స్' రిలీజ్



రీడ్ రిచర్డ్స్ (మిస్టర్ ఫెంటాస్టిక్) పాత్రలో పెడ్రోపాస్కల్ ఫెంటాస్టిక్ ఫోర్ నాయకుడు, రీడ్ రిచర్డ్స్ తన శరీరాన్ని తిరిగి ఆకృతి చేయడానికి తన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాడు. కానీ ఈ వెర్షన్ ఒక కొత్త మలుపును పరిచయం చేస్తుంది: రీడ్ రబ్బరు లాగా ఉండడమే కాకుండా, అతను స్థలాన్ని కూడా తారుమారు చేస్తాడు, దాదాపు అపరిమిత స్థితిస్థాపకతను అనుమతిస్తాడు. అతని మానవాతీత తెలివితేటలతో కలిపి, అతను యొక్క అత్యంత బలీయమైన శాస్త్రీయ మనస్సులలో ఒకరిగా మిగిలిపోయాడు. అతని సాగతీత క్వాంటం షిమ్మర్‌తో చిత్రీకరించబడింది. సూ స్టార్మ్ (ఇన్విజిబుల్ ఉమెన్)గా వెనెస్సా కిర్బీ తరచుగా తక్కువ అంచనా వేయబడిన సూ స్టార్మ్ జట్టు యొక్క వ్యూహాత్మక మరియు భావోద్వేగ మిళితమైన వ్యక్తిగా ఉద్భవిస్తుంది. ఆమె తనను మరియు ఇతరులను అదృశ్యంగా మార్చుకోగలదు, కానీ ఆమె నిజమైన బలం క్షిపణుల నుండి ఇంటర్ డైమెన్షనల్ శక్తి వరకు దాడులను నిరోధించేంత శక్తివంతమైన సైయోనిక్ శక్తి క్షేత్రాలను ఉత్పత్తి చేయడంలో ఉంది.

# బెస్ట్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ మూవీ 'తమ్ముడు'

**సంక్రాంతికి వస్తున్నాం** బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. నితిన్ హీరోగా దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమ్ముడు సినిమా ఈ నెల 4న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్‌ను ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో తెలిపారు ప్రొడ్యూసర్ దిల్ రాజు. శ్రీరామ్ వేణు మా సంస్థలో ఆర్య నుంచి వర్క్ చేస్తున్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా, అసోసియేట్ డైరెక్టర్‌గా, స్క్రిప్ట్ రైటర్‌గా మాతోనే ట్రావెల్ చేస్తున్నాడు. శ్రీరామ్ వేణు మా దగ్గరనే ఉన్నాడంటే అందుకు మా మధ్య ఉన్న రిలేషన్, వేవ్ లెంగ్త్ కారణం. ఇండస్ట్రీలో డబ్బుతోనే పనులు జరుగుతుంటాయి. నాది భిన్నమైన పద్ధతి. నేను వేవ్ లెంగ్త్ కలిసిన వాళ్లతోనే జర్నీ చేస్తుంటాను. అనిల్ రావిపూడి, శ్రీకాంత్ అడ్డాల, హరీశ్ శంకర్, వంశీ పైడిపల్లి, దశరథ్..ఇలా డైరెక్టర్స్ మా సంస్థలో వర్క్ చేసి హిట్ చిత్రాలు ఇచ్చారు. శ్రీరామ్ వేణు మా సంస్థలోనే ట్రావెల్ అవుతున్నాడంటే అతనికి భారీగా డబ్బు ఇవ్వడం వల్ల కాదు. మాతో ఆయనకు ఒక కంఫర్ట్ ఉంటుంది. అనిల్ రావిపూడితో నాకొక బాండింగ్ ఉంది. ఆ బాండింగ్ లో ఒక కంఫర్ట్ ఉంటుంది. ఈ డైరెక్టర్స్ టాలెంట్ నాకు తెలుసు. కాబట్టి కథ టైమ్ లో, ఎడిటింగ్ టేబుల్ దగ్గర నాకు అనిపించినవి అడుగుతా. నేను క్వశ్చన్ అడిగితే ఎందుకు అడిగాడు అని ఆలోచిస్తారు. అంతే గానీ వారి పనిలో ఇంటర్ ఫియర్ కాను. తమ్ముడు మూవీ మొదటి 20 నిమిషాల తర్వాత మిగిలిన కథంతా ఒక్కరోజులో జరుగుతుంది. ఐదారు యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. వాటిలో రెండు యాక్షన్ ఎపిసోడ్స్ వైలెంట్‌గా ఉన్నాయని ఎ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ వాళ్లు చెప్పారు. ఆ రెండు ఎపిసోడ్స్ తీసేస్తే యు బై ఎ ఇస్తామని చెప్పారు. ఈ సినిమాను థియేటర్ ఎక్స్‌పీరియన్స్ కోసమే చేశాం కాబట్టి ఆ ఫైట్ సీక్వెన్సులు తీసేయకుండా ఎ సర్టిఫికెట్ కు అంగీకరించాం. ఇది సంక్రాంతికి వస్తున్నాం లాంటి ఎంటర్ టైనర్ అయితే ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ రండి అని చెబుతాం. తమ్ముడు మూవీ యాక్షన్ ఓరియెంటెడ్ కంటెంట్ ఉన్న మూవీ. థియేటర్స్‌కు వచ్చిన వాళ్లనైనా సంతృప్తి పరచాలి కదా అని ఎ సర్టిఫికెట్ తీసుకున్నాం. ఈ చిత్రాన్ని 150 రోజులు చిత్రీకరించారు. 80 పర్సెంట్ మూవీ అడవి లో ఉంటుంది. విజువల్స్, సౌండింగ్ హై క్వాలిటీతో ఉంటూ థియేటర్‌లో ఎంజాయ్ చేసేలా రూపొందించారు దర్శకుడు శ్రీరామ్ వేణు. పైరసీ అరికట్టేందుకు ఇండస్ట్రీ నుంచి గట్టి చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో సపోర్ట్ చేస్తోంది.




# 'అఖండ 2'లో భజరంగీ భాయిజాన్ బాలనటి

**గాడ్ ఆఫ్ మాసెస్** నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హైలీ యాంటిసిపేటెడ్ అఖండ 2: తాండవం కోసం నాల్గవ సారి కొలాబరేట్ అయ్యారు. ఈ హైఆక్టేన్ సీక్వెల్ కథ, స్కేల్, నిర్మాణం, సాంకేతిక నైపుణ్యం.. ప్రతి అంశంలో అఖండను మించి ఉంటుదని హామీ ఇస్తోంది. ప్రతిష్టాత్మకమైన 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట అత్యంత భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎం. తేజస్విని నందమూరి సగర్వంగా సమర్పిస్తున్నారు. మేకర్స్ జననిగా హర్షాలీ మల్హోత్రా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. సల్మాన్ ఖాన్ బజరంగీ భాయిజాన్‌లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కనిపించిన హర్షాలీ మల్హోత్రా అఖండ 2తో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. ఆమె సాంప్రదాయ చీరలో అందమైన చిరునవ్వుతో అద్భుతంగా కనిపిస్తుంది. ఈ చిత్ర టీజర్‌కు నేషనల్ వైడ్‌గా ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. టీజర్‌లో బాలకృష్ణ మునుపెన్నడూ చూడని అవతార్‌లో కనిపించారు. టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్నారు. ఆది పినిశెట్టి పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. సి రాంప్రసాద్ డీవోపీగా పని చేస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. ఎఎస్‌ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. అఖండ 2 దసరా కానుకగా సెప్టెంబర్ 25న భారీ స్థాయిలో పాన్‌ఇండియా రిలీజ్ కానుంది. నటీనటులు: గాడ్‌ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా.






# 'మార్గన్' సక్సెస్ మీట్

**విజయ్ ఆంటోని** నటిస్తూ, నిర్మించిన మార్గన్ చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంతో తన మేనల్లుడు అయిన అజయ్ ధీషన్‌ను విజయ్ ఆంటోని తెరకు పరిచయం చేశారు. ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మించగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్‌పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పిం చారు. ఈ సినిమాను జూన్ 27న సురేష్ బాబు తెలుగులో రిలీజ్ చేశారు. రిలీజ్ అయిన ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ దక్కింది. ఈ క్రమంలో చిత్రయూనిట్ థాంక్యూ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో.. విజయ్ ఆంటోని మాట్లాడుతూ, మార్గన్ సినిమాను సురేష్ బాబు, రామాంజనేయులు చాలా గ్రాండ్‌గా తెలుగులో రిలీజ్ చేశారు. ఇకపై నా సినిమాల్ని తెలుగులో రిలీజ్ చేస్తానని సురేష్ బాబు అన్నారు. నాకు ఇంత మంచి మూవీని ఇచ్చిన లియో జాన్ పాల్‌కు థాంక్స్. అజయ్‌ను ఇంత బాగా లాంచ్ చేసినందుకు నాకు చాలా సంతోషంగా అనిపించింది. తెలుగు, తమిళంలో అజయ్‌కు మంచి పేరు వచ్చింది. అజయ్ ఇకపై ఇలానే మంచి కంటెంట్ చిత్రాల్ని చేస్తూ ఆడియెన్స్ నుంచి ప్రేమను సంపాదిస్తూనే ఉండాలి. బిచ్చగాడు 2, రోమియో చిత్రాలకు అజయ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పని చేశారు. అజయ్‌తో కలిసి నేను ఇక స్ట్రెయిట్ తెలుగు సినిమాల్ని నిర్మిస్తాను. తమిళంలో ప్రస్తుతం ఏడు చిత్రాల్ని చేస్తున్నాను. అందులో తెలుగు డబ్బింగ్ కోసం మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాను. త్వరలోనే భద్రకాళి రానుంది. అదొక పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్. మార్గన్‌ను ఇంత పెద్ద సక్సెస్ చేసిన తెలుగు ఆడియెన్స్‌కు థాంక్స్ అని అన్నారు. అజయ్ ధీషన్ మాట్లాడుతూ, మార్గన్ సినిమాకు తెలుగులో ఇంత సక్సెస్ వస్తుందని అనుకోలేదు. ఇది తమిళ చిత్రం అయినా కూడా తెలుగు ఆడియెన్స్ పెద్ద విజయాన్ని అందించారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన విజయ్ ఆంటోనీకి, ఫాతిమా విజయ్ ఆంటోనికి థాంక్స్. నాకు సపోర్ట్ చేసిన లియో జాన్ పాల్‌కి థాంక్స్. మా మూవీని తెలుగులో ఇంతబాగా రిలీజ్‌చేసిన సురేష్, రామాజంనేయులుకి థాంక్స్ అని అన్నారు. భాష్య శ్రీ మాట్లాడుతూ, మార్గన్ మూవీని ఫస్ట్ నుంచి లాస్ట్ వరకు కూడా ఆడియెన్స్ అలా సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా ఫీల్ అయ్యారు. ఈ చిత్రానికి నేను మాటలు, పాటలు రాశాను. నా మీద నమ్మకంతో నాకు ఈ అవకాశం ఇచ్చిన విజయ్ ఆంటోనికి థాంక్స్ అని అన్నారు.




# నా మాటల్ని అపార్థం చేసుకోవద్దు: నిర్మాత శిరీష్ రెడ్డి

**తెలుగు** సినీ ప్రేక్షకులకు, మెగా అభిమానులకు నమస్కారం. మా ఎస్వీసీ సంస్థకు, రామ్ చరణ్‌కి, చిరంజీవికి ఎంతో అవినాభావ సంబంధం ఉంది. చరణ్‌కి నాకు మంచి అనుబంధం ఉంది. నేను అభిమానించే హీరోల్లో రామ్ చరణ్ఒకరు. ఆయన్ని అవమానపరచడం గాని, కించపరచడం గాని నా జన్మలో ఎప్పుడూ చేయను. నేను ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన గురించి చిన్న మాట దొర్లినా అది నా తప్పే. అది జరిగిందని అభిమానులు అనుకుంటున్నారు కాబట్టి నిజంగానే క్షమాపణలు చెబుతున్నాను. చరణ్ గారికి కూడా క్షమాపణలు చెబుతున్నాను. చరణ్‌తో నాకు ఉన్నటువంటి రిలేషన్‌షిప్‌ను పాడుచేసుకోదల్చుకోలేదు. ఈరోజు జనం మాట్లాడుకుంటున్న మాటలు, బయట ట్రోలింగ్, అభిమానుల బాధలు నేను అర్థం చేసుకోగలను. ఎందుకంటే ఒక హీరోని అలా అన్నప్పుడు ఎవరూ భరించలేరు. నేను అన్న ఇంటెన్షన్ అది కాదు. మాకున్న రిలేషన్‌షిప్ కన్ఫ్యూజన్‌లో నేను మాట దొర్లాను తప్పా ఆయన్ని అవమానపరచడానికి కాదు. మెగా హీరో లందరి తోనూ మాకు మంచి అనుబంధం ఉంది. వరుణ్ తేజ్‌తో ఫిదా చేశాం. సాయితేజ్‌తో రెండు సినిమాలు చేశాం. చరణ్‌తో రెండు సినిమాలు చేశాం. చిరంజీవి దిల్‌రాజుతో, మాతో మాట్లాడుతూనే ఉంటారు. ఇంత మంచి అనుబంధం ఉన్నవారిని అవమానపరిచే అంత మూర్ఖుడిని కాదు. దయచేసి అభిమానులందరూ అర్థం చేసుకోవాలి. సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం చరణ్ ఒప్పుకోకపోతే ఆ సినిమా రిలీజ్ అయ్యేది కాదు. ఆయన మనసు గొప్పది కాబట్టి ఆ సినిమాను కూడా రిలీజ్ చేసుకోండి అని ఒక గొప్ప మనసుతో ఒప్పుకున్న వ్యక్తి చరణ్. ఆయన్ని ఎందుకు అవమాన పరుస్తాం. నా మాటల్ని అపార్థం చేసుకోవద్దని కోరుతున్నాను. ఫ్యాన్స్‌కి క్షమాపణలు చెబుతున్నాను. దయచేసి మా రిలేషన్‌ను పాడు చేయొద్దు. మళ్లీ నెక్స్ట్ ఒక ప్రాజెక్టు రెడీ అయింది. నెక్స్ట్ చరణ్‌తో సినిమా తీయబోతున్నాను. మా ఇద్దరి మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలు తీసుకురావద్దని అందర్నీ వేడుకుంటున్నాను. తెలుగు ప్రజలందరూ కూడా గమనించాలి. నాకు చరణ్‌తో మంచి రిలేషన్ ఉంది. ఆయన గురించి నేను ఎప్పుడూ తప్పుగా మాట్లాడను. నేను ఫస్ట్ ఇంటర్వ్యూ ఇచ్చాను కాబట్టి, నాకు తెలియకుండా ఏదైనా మాట దొర్లిందేమో. అది కూడా అర్థం చేసుకోవాలని అందరిని కోరుతున్నాను. థాంక్యూ వెరీ మచ్.



# నేడే విడుదల 'షోటైం'

**అనిల్ సుంకర** ప్రొడ్లీ ప్రెజెంట్.. స్కై లైన్ మూవీస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కిషోర్ గరికిపాటి నిర్మాతగా మదన్ దక్షిణామూర్తి దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం షో టైం. నవీన్ చంద్ర హీరోగా కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తున్న వినూత్నమైన థ్రిల్లర్ చిత్రం జూలై 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు రంగం సిద్ధమైంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర ప్రజెంట్ చేస్తున్నారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించారు. షో టైమ్ మూవీ జర్నీ ఎలా స్టార్ట్ అయింది అనే ప్రశ్నకు నవీన్ చంద్ర సమాధానం చెప్పారు. డైరెక్టర్ మదన్ స్టోరీ చెప్పినప్పుడు చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఒక ఫ్యామిలీలో తక్కువ క్యారెక్టర్ల నడుమ సాగే ఈ కథలో ఎన్నో మలుపులు ఉన్నాయి. ప్రతీ అంశం ప్రేక్షకుడిని రంజింప చేస్తుంది అన్నారు. పోలీసు ఆఫీసర్ కామెడీనా? స్ట్రిక్ట్ ఆఫీసర్ అంటే క్యారెక్టర్ యాక్టర్ రాజా రవింద్ర మాట్లాడు.. ఇందులో చాలా మంచి పోలీసు క్యారెక్టర్ చేశాను అన్నారు. అయితే క్యారెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నా.. ప్రేక్షకులకు మాత్రం మంచి ఎంటర్ టైన్ మెంట్ ఇస్తుందన్నారు. ఆఫీసర్ లుక్ కోసం తీసుకున్న జాగ్రత్తలు గురించి మాట్లాడుతూ, పెద్దగా కష్టపడలేదు కానీ ఫిట్ నెస్ మేయింటైన్ చేసినట్లు చెప్పారు. ఇదే ప్రశ్నకు హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, రాజా రవింద్రది ఒక విచిత్రమైన పర్సనాలిటీ అని ఆయన పాత్రలో ఇట్టే పరకాయ ప్రవేశం చేస్తారు. అందిరిలా మెథడ్ యాక్టింగ్ ఫాలో కాదు... అందరితో నవ్వుతూ.. నవ్విస్తూ.. సరదగా ఉంటాడు.. ఆయన షాట్ రెడీ అవగానే స్ట్రిక్ట్‌గా మారిపోతాడు అని చెప్పారు. ఇలాంటి జోనర్స్ మలయాళంలో ఎక్కువగా వస్తాయి.. తెలుగులో వర్కౌట్ అవుతాయా? అంటే కచ్చితంగా ప్రేక్షకులు ఆదరిస్తారని డైరెక్టర్ మదన్ దక్షిణామూర్తి చెప్పారు.దృశ్యం సినిమాలా అనిపించింది.. ఇది కూడా ఫ్యామిలీని కాపాడే కథే కదా అనే ప్రశ్నకు.. డైరెక్టర్ సమాధానం చెబుతూ.. అంత పెద్ద సినిమాతో పోల్చడం సంతోషంగా ఉంది కానీ ఇది దృశ్యం సినిమాకు భిన్నంగా ఉంటుంది. ట్రైలర్ చూసి ఇదే సినిమా ఫిక్స్ అవకండి... సినిమా చాలా కొత్తగా, చాలా ఆసక్తిగా ఉంటుందన్నారు. షో టైమ్ అని టైటిల్ పెట్టడానికి కారణం ఏంటి? అని మీడియా ప్రశ్నకు.. ఈ సినిమా చూసిన తరువాత ఈ టైటిల్ కరెక్ట్ అని ప్రేక్షకులే అంటారు. ఇది కచ్చితంగా షో టైమ్ అని చెప్పారు. ఎక్కువగా థ్రిల్లర్ జోనర్లే ఎందుకు ఎంచుకుంటున్నారు అని నవీన్ చంద్రను ప్రశ్నించగా.. ఒకే రకమైన సినిమాలు చేయాలని ఎవరికి ఉండదు.. కానీ ఇది సీరియస్ ఇన్విస్టిగేషన్ సినిమా కాదు.. ఇందులో ప్రేక్షకులను ఆకర్షించే అనేక అంశాలు ఉన్నాయి అని చెప్పారు. స్క్రిప్ట్స్ సెలెక్షన్స్ చాలా బాగుంటాయి కదా... ఏమైన జాగ్రత్తలు తీసుకుంటారా అంటే.. కచ్చితంగా మంచి స్క్రీప్ట్ ను ప్రేక్షకులకు అందించాలనే తపన ఉంటుంది అని హీరో నవీన్‌చంద్ర చెప్పారు. నరేష్ లాయర్‌గా చేశారు, రాజారవింద్ర పోలీసుగా చేశారు కదా.. వీరిద్దరి మధ్య కాంబినేషన్ సీన్స్ ఎలా ఉంటాయి అంటే.. వీరిద్దరి కాంబినేషన్ చాలా బాగుంటుంది. థియేటర్లో వీరి కాంబినేషన్ వచ్చినప్పుడు నవ్వులే నవ్వులు.. ఇంకో రెండురోజుల్లో ఆ మ్యాజిక్ చూస్తారు కదా అంటూ హీరో సమాధానమిచ్చారు.విడుదలైన ట్రయిలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రేక్షకుడిని థియేటర్లో కట్టిపడేసి, అన్ని వర్గాల ప్రేక్షకులను రంజింపజేసే అద్భుతమైన థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు కడుపుబ్బ నవ్వించే కామెడీ ఉందని తెలుస్తుంది.



# గోరింటా పూసింది



**ఆషాఢ మాసపు వర్షపు జల్లులకు కొత్త చివుర్లు తొడిగి, నిండా ఆకులతో ఉల్లాసంగా కనిపిస్తుంది.** గోరింట చెట్టు. అత్తవారింటే నుంచిపుట్టింటికి చేరిన నవ వధువు, మరదలిని ఆటపట్టించే వదినలు, ఆజాయిషీ చేస్తూ తిరిగే అత్తలు, ఆటపాటలతో సందడి చేసే యువతులు.. అందరినీ కట్టిపడేసి కుదురుగా కూర్చోబెట్టి, ఎర్రని పంట కోసం ఎదురు చూపుల సహనాన్ని అలవాటు చేస్తుంది కోరింట.

ఈ కాలమే ఎందు కంటే..

* ఆషాఢంలో వర్షాలు పడు తుంటాయి. ఇన్ఫెక్షన్లు, అంటు వ్యాధుల వ్యాప్తికి అవకాశాలు ఎక్కువ. అలాగే, చల్లబడిన బయటి వాతావరణానికి, శారీరక వేడికి సమతుల్యత లోపిస్తుంది. దీనిని బ్యాలెన్స్ చేసే శక్తి గోరింటాకకు ఉంటుందనేది పెద్ద చెప్పే మాట.
* వర్షాల కారణంగా నీళ్లలో తరచూ పాదాలు తడుస్తుంటాయి. ఇలాంటప్పుడు పాదాల చర్మానికి సూక్ష్మక్రిముల వల్ల ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది.
* గోళ్లకు కూడా గోరింటాకు పెట్టడం వల్ల గోళ్లు పెళుసుబారడం, గోరుచుట్టు రావడం వంటి సమస్యలు దరిచేరవు.
* ఎర్రగా పండిన చేతులను చూసుకొని ఎంతగానో మురిసిపోయే వనితలు గోరింటాకును సౌభాగ్యానికి ప్రతీకగానూ భావిస్తారు.



గోరింటాకు ప్రాముఖ్యతను తెలుసుకోవడమే కాదు మహిళలంతా ఒకచోట చేరి, వేడుకలా మార్చుకుంటున్నారు. వివాహ వేడుకల్లో మెహిందీ ఫంక్షన్‌కు ఉన్న ప్రధాన్యత ఆషాడం గోరింటాకుకూ వర్తింపజేస్తున్నారు.

# ఎయిమ్స్‌లో తొలి మహిళా డైరెక్టర్



**ఆమె స్నేహ్ భార్గవ రేడియాలజిస్ట్, అడ్మినిస్ట్రేటర్ పనిచేశారు. ప్రొఫెసర్ ప్రత్యేక ఎయిమ్స్ చరిత్రలోనే డైరెక్టర్‌గా చేసిన ఒకే ఒక్క మహిళ, భారతీయ తొలి మహిళా రేడియాలజిస్ట్ విశేష కృషి దక్షిణాసియాలోనే తొలి సీటీ స్కానర్ ఎయిమ్స్‌లో ఏర్పాటయ్యేలా చేయడం. ప్రస్తుతం రచన, వైద్యశాస్త్రంలోని కొత్త ఆవిష్కరణ ఏఐ గురించి తెలుసుకోవడం. 'ద ఉమెన్ హూ రాన్ ఎయిమ్స్' పుస్తకంతో వార్తల్లో నిలిచారు. ఇందులో ఆమె రాసుకన్న కొన్ని సంగతులు తెలుసుకుందాం.**

అక్టోబర్ 31, 1994 ఎయిమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నా. ఇంకా డెస్క్‌లో కూర్చోలేదు. ప్రధాని వచ్చారని ముందుగా చెప్పకుండా రాదుకదా అనుకుంటూ వెళ్లేసరికి కనిపించారు. ఇందిర...స్ట్రెచర్‌మీద రక్తమయం.. షాక్ నుంచి తేరుకుని ఆపరేషన్‌థియేటర్‌కి పంపించమని చెబుతూనే పల్స్ చూశాం అప్పటికే నాడి అందడం లేదు అమెను బతికించడానికి శాయశక్తులా ప్రయుత్నంచాం ఆపై రాజీవ్ గాంధీ వచ్చే వరకు విషయాన్ని బయటకు పొక్కకుండా చికిత్స చేస్తున్నామని నమ్మించల్సిన పరిస్థితి. అలా ఆ రోజు నేను డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నదీ.. ఇందిరాగాంధీ మరణించినదీ ఒకే రోజు కావడం బాధాకరం. దాన్నుంచి తేరుకుని జనాగ్రహం నుంచి మా సిక్కు మత సిబ్బంది, విద్యార్థుల రక్షణ కోసం పోలీసుల సాయం తీసుకున్నా. ఆ సమయంలో ఢిల్లీలో చెలరేగిన హింసలో ఎంతోమంది గాయపడ్డారు. వాళ్లంతా ఆసుపత్రులకి వెళ్లే పరిస్థితీ లేదు. దాంతో మా వైద్యుల్నే వాళ్ల ఇళ్లకి దగ్గర్లోని పాఠశాలల్లో ఓపి విధుల్ని నిర్వర్తించేలా చేశాను. రోగనిర్ధారణలో అపార నైపుణ్యం గడిచా. మా విభాగంలో ఓ బోర్డు మీద మనసుకు తెలియనది కన్ను చూడదు అని రాసుండేది. అందుకే సబ్జెక్టులో అప్ టు డేట్‌గా ఉంటూ రోగాన్ని కచ్చితంగా కనిపెట్టేదాన్ని. దాంతో నాకు మూడోకన్ను ఉందనేవారు. ఎయిమ్స్‌లో వివిఐపి సంస్కృతి ఎక్కువ. ఒకసారి మంత్రి బంధువులు నిబంధనలకి విరుద్ధంగా గదిలో ఉన్నారు. నేను వాళ్లను బయటకు వెళ్లమంటే.. అదే జరిగితే ఆసుపత్రి పగులుగొడతా అన్నారాయన. బదులుగా సంస్థ గోడలు, నా భుజాలు మరీ అంత బలహీనంగా లేవు. నేను ఇక్కడున్నంతవరకూ నిబంధనలు పాటించాల్సిందే అన్నా. 1961లో ఎయిమ్స్ రేడియాలజీ విభాగంలో చేరా. అప్పటికి అక్కడ ఇద్దరు టెక్నీషియన్లు, పాత సామాన్లే ఉండేవి. అప్పట్లో రోగి శరీరంలోపల చూడటానికి ఏకైక మార్గం ఎక్స్-రే. అయినా రేడియాలజీ పట్ల గౌరవం లేదు. వాళ్లనో ఫొటోగ్రాఫర్లుగా బ్యాక్ ఆఫీస్ ఉద్యోగులుగా చూసేవారు. ఆ విభాగానికికో గుర్తింపు తేవడానికి చాలా కష్టపడ్డా. ఇందిగాంధీ నన్ను డైరెక్టర్‌గా నియమించారు. కానీ కొన్ని ఫార్మాలిటీస్ మిగిలున్నాయి. దాంతో నా నియామకం చెల్లదనే అన్నారంతా. ఎయిమ్స్ లాంటి సంస్థను ఓ మహిళ నడపగలదా అన్నది మరికొందరి సందేహం. అయితే ప్రధానిగా రాజీవ్‌గాంధీ సంతకం చేసిన తొలి ఫైళ్లలో నాదీ ఒకటి. ఓ మహిళ దేశానికి ప్రధానిగా చేయగలిగినప్పుడు నేను ఎయిమ్స్ డైరెక్టర్‌గా చేయలేనా అనుకున్నా. ఆరేళ్ల పూర్తి పదవీ కాలాన్ని బాధ్యతగా నిర్వర్తించా శక్తిమంతమైన నాయకురాలిగా పేరు తెచ్చుకున్నా. రేడియాలజీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన నాకు, మొదట్లో అదేమీ ఇష్టం కాదు. ఢిల్లీలో ఎంబిబిఎస్ అయ్యాక స్పెషలైజేషన్ ఎందులో చేయాలా అని ఆలోచించా. పిజి కోసం లండన్‌కి వెళ్లినప్పుడు రేడియాలజీలోనే సీటు వచ్చింది. ఆ బ్యాచ్‌లో ఏకైక మహిళను రేడియాలజిస్ట్ అర్హత సాధించిన తొలి భారతీయురాలిని కూడా. 70లో న్యూయార్క్ కాన్ఫరేన్స్‌కి వెళ్లినప్పుడు-గాడ్ ఫ్రే హౌన్స్‌ఫీల్డ్ ప్రపంచానికి పరిచయం చేసిన సీటి స్కానర్ చూసి ఆశ్చర్యపోయా. మెదడు లోపల చూడగలగడం. ఎంత గొప్ప సంగతి. అది రేడియాలజీలోనే పెద్ద విప్లవం. ఎలాగైనా ఆ పరికరాన్ని ఎయిమ్స్‌కు తీసుకురావాలనుకున్నా. వృథా ఖర్చు అని కొందరు వెనక్కి లాగారు. కానీ పట్టుదలతో దక్షిణాసియాలోనే తొలి సిటీ స్కానర్ ఎయిమ్స్‌లో ఏర్పాటయ్యేలా చేశా. అల్ట్రాసౌండ్ మెషీన్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, ఫెర్టిలిటీ సెంటర్ రావడానికీ కృషిచేశా. మూడు దశాబ్దాల పదవీకాలంలో ఎన్నో కొత్తననగాలతోపాటు మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకీ కృషిచేశా. 'ద నేషనల్ మెడికల్ జర్నల్ ఆఫ్ ఇండియా' స్థాపనమునకు కారణమైన సభ్యుల్లో నేనూ ఉన్నా.



ఎయిమ్స్‌లో రిటైరయ్యాక రెండు ఆసుపత్రుల్లో తొంభై ఏళ్లు వచ్చే వరకూ పనిచేశా. ఆపై కొవిడ్ కారణంగా ఇంటికే పరిమితమై పుస్తకాలు రాస్తున్నా. ఇప్పటికీ బిజీగా ఉండటమే ఇష్టం. ఈ వయసులోనూ ఉదయాన్నే కాసేపు నడుస్తా. 40ల నుంచి గార్డెనింగ్, యోగాలను అలవాట్లుగా మార్చుకున్నా. గ్రీన్ టీ, కొబ్బరినీళ్లు, ఇంట్లో చేసిన ఢోక్లా.. నా రోజువారీ ఆహారంలో తప్పక ఉంటాయి. ఇవే నా ఆరోగ్య రహస్యం. ఓ రేడియాలజిస్ట్‌గా ఎఐ ద్వారా మానవ శరీరాన్ని మరింత లోతుగా పరిశీలించాలని ఉంది. అప్పట్లో నాకా అవకాశం లేదు. ఏఐ మెడికల్ పరీక్షలకు ఎంతో దోహదపడుతుంది. అయితే పేషెంట్ హిస్టరీ అనేదీ కీలకమే. పరీక్షల్లో ఎంత గొప్ప పురోగతి ఉన్నా రోగి స్వయంగా చెప్పేది వినడం అత్యవసరం. ఈ తరం ఆ రెండిటినీ కలిపి వైద్యం చేయాలి. ప్రతిరోజూ పని చేశాను. నేనెప్పుడూ డైరీ నోట్స్ రాయలేదు. కానీ గుర్తున్నవన్నీ ఈ పుస్తకంలో కచ్చితంగా రాశా. అంటూ ఆమె రాసుకొచ్చిన 'ద ఉమన్ హూ ర్యాన్ ఎయిమ్స్' బుక్‌లో వ్యక్తిగతం కన్నా ఓ వైద్యురాలి క్రమశిక్షణ. భారతీయ వైద్య రంగాన్ని అభివృద్ధి చేయాలన్న తపన.. వంటివే ఎక్కువగా కనిపిస్తాయి.

# దోమలు కుట్టకుండా..

జోరున వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడో ఓ చోట కాసిని నీళ్లు నిలబడినా.. దోమలు మన ఇంటిని చుట్టుముట్టేస్తాయి. దాంతో జ్వరాల బారిన పడక తప్పడం లేదు. అలాగని మస్కిటో రెపెల్లెంట్, మస్కిటో మ్యాట్‌లు వాడితే వాటి రసాయనాల వల్ల మన ఆరోగ్యానికే చేటు. అలాకాకూడదంటే ఈ సహజ చిట్కాలు పాటించి చూడండి.

- మూడు టేబుల్ స్పూన్ల ఎప్సమ్ సాల్ట్‌ని ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో వేసుకుని స్నానం చేయండి. దోమ కాటు నుంచి మీ శరీరాన్ని కాపాడుకోవచ్చు.
- కొందర్ని దోమలెక్కువగా కుడతాయి. మీరూ బాధితులే అయితే.. వేపనూనెకి రెండుచుక్కల కొబ్బరినూనె చేర్చి ఒంటికి రాసుకోండి. కనీసం ఎనిమిది గంటలపాటు దోమలు మీ దరిచేరవు.
- యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఎక్కువగా ఉండే వేప క్రిమికీటకాలనే కాదు దోమలనూ అరికడుతుంది. కాస్త కర్పూరం, వేప ఆకులు కలిపి నలిపి పొడి చేసి కిటికీలు, గుమ్మాల దగ్గరా పొగ వేయండి. ఆ వాసనకు పరారవుతాయి.
- సాయం సంధ్యవేళలో కాస్త సాంబ్రాణి తీసుకుని పొగ వేసి తలుపులు మూసేయండి. ఇది దోమల్నినఇంట్లోకి దూరనీయదు.
- కప్పు నీళ్లల్లో యూకలిప్టస్ ఆయిల్ రెండు చుక్కలు కలిపి ఇల్లంతా స్ప్రే చేస్తే సరి. ఆ ఘాటైన పరిమళం దెబ్బకి దోమలు పోతాయి.
- నాలుగు వెల్లుల్లిపాయలను దంచి దానికి కాస్త కర్పూరం, కొద్దిగా ఏదైనా నూనె చేర్చి.. వెలిగిస్తే సరి మీ సమస్య దూరమవుతుంది.
- బంతి ఆకుల్ని నలిపి కిటికీ దగ్గర పెట్టండి. లేదా బంతిపూల రేకల్ని నీళ్లల్లో వేసి మరిగించి ఆ నీటిని ఇల్లంతా చిలకరించండి



దోమల బెడద తప్పుతుంది.

# జరీ నిజమైనదేనా ?

**పట్టు దుస్తులంటే ప్రతి ఒక్కరకీ ఓ ఎమోషన్. ప్రత్యేక సందర్భాలకోసం కొన్ని వీటిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుచుకుంటాం.** అయితే, మెరిసేదంతా బంగారం కాదన్నట్లు. పట్టు పేరుతో అమ్మేదంతా స్వచ్ఛమైనదీ కాదు. అచ్చమైన జరీ అంచుల్ని తలపించేలా అనుకరణ రకాలెన్నో మార్కెట్‌ని ముంచెత్తుతున్నాయి. అయితే అసలైన జరీ, సింథటిక్ మెరుపుల మధ్య తేడాను అర్థం చేసుకోగలగాలి. ప్యూర్ జరీని రాగితో ఎలక్ట్రోప్లేట్ చేసిన పట్టు దారాలను ఉపయోగించి చేస్తారు. ఆపై వెండితో చుట్టి బంగారు పూతతో పూర్తి చేస్తారు. అయితే, దీనికి విరుద్ధంగా టెస్టెడ్ జరీ అనుకరణలు, కౌకైన లోహాల చుట్టూ ప్లాస్టిక్, ల్యూరెక్స్ వంటివి ఉపయోగించి చేస్తారు. దూరం నుంచి చూస్తే ఆ మెరుపు మనల్ని మాయ చేయొచ్చు. కానీ, ఇవి ఎక్కువ కాలం మన్నవు. ఇక ప్యూర్ జరీ సాఫ్ట్‌గా, వార్మ్‌గ్లోతో ఉంటుంది. కానీ, సింథటిక్ జరీ ఎక్కువ మెరుపుతో, మెటాలిక్‌లుక్‌తో మెరిసిపోతుంది. కృత్రిమ రకాలతో పోల్చితే స్వచ్ఛమైన జరీ బరువుగా ఉంటుంది. పైగా ఇది గట్టిగా నేసి ఉంటుంది. ఫ్యాబ్రిక్ వెనుకభాగం వదులుగా గజిబిజిగా ఉంటే అది స్వచ్ఛమైనది కాదు. వెనుక దారాలు లేకుండా చక్కగా ఉండాలి. వీటిని టెస్టు చేయడానికి ప్రసిద్ధ బ్రాండ్‌లు ప్రత్యేక యంత్రాలనూ ఉపయోగిస్తున్నాయి చెక్ చేసుకోవచ్చు.



# నూడుల్స్ మసాలా పౌడర్



**ఇన్‌స్టంట్‌గా అప్పటికప్పుడు చేసుకునే వాటిల్లో నూడుల్స్ ఒకటి. ఇది చాలా రుచిగా ఉంది,** మనందరికీ నచ్చుతుందంటే.. అందులో వేసే పొడి వల్లే కదా! ఆ పౌడర్‌ను ఇంట్లోనే చేసుకోవచ్చు.



ఎలాగంటారా? ముందుగా ధనియాల పొడి 4 చెంచాలు, పంచదార పొడి, సోంపు, ఆనియన్ పౌడర్, ఆమ్‌చూర్ పౌడర్, మొక్కజొన్న పిండి, జీలకర్ర పొడి, కారం, గరంమసాలా, డ్రైజింజర్ పౌడర్, గార్లిక్ పౌండర్, మిరియాల పొడి..ఇవన్నీ అర చెంచా చొప్పున, పసుపు పావు చెంచా,రుచికి సరిపోయేంత ఉప్పు సిద్ధంగా ఉంచుకోవాలి. ఇక చేయడం ఎలాగంటే ఒక పాత్రలో ధనియాల పొడి, జీలకర్ర పొడి, కారం, గరంమసాలా, పసుపు వేసి కలపాలి. అందులో.. డ్రై.జింజర్ పౌడర్, గార్లిక్ పౌడర్, ఆనియన్ పౌడర్, ఆమ్‌చూర్ పౌడర్, మిరియాల పొడి, పంచదార పొడి, ఉప్పు, మొక్కజొన్న పిండి వేసి మళ్లీ కలపాలి. అన్నీ బాగా కలిశాయనుకున్నాక. తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేయాలి. ఈ కొలతల ప్రకారం మరింత కూడా చేసుకోవచ్చు. కానీ మరీ ఎక్కువ పరిమాణంలో చేసి నిలవుంచితే రుచి తగ్గుతుంది. అందువల్ల మితంగా కలపడమే మంచిది.

# నలభై దాటాక పొట్ట పెరుగుతోందా ?



అప్పటిదాకా నాజూగ్గా, సన్నజాజి తీగలా ఉన్న నడుము కొలతలు పిల్లలు పుట్టాక, వయసు పెరుగుతున్న కొద్దీ మారుపోతుంటాయి. పొట్ట పెరగడం, నడుం చుట్టూ కొవ్వు పేరుకుపోవడంతో అక్కడి చర్మం వేలాడినట్లుగా కనిపిస్తుంటుంది. ఇక మెనోపాజ్ తర్వాత చాలామంది మహిళల్లో ఈ మార్పు కనిపించడం చూస్తుంటాం. దీన్ని మహిళలు జీర్ణించుకోలేరు. తిరిగి పూర్వ స్థితికి రావడానికి ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషిస్తుంటారు. అయితే అందం విషయం కాసేపు పక్కన పెడితే.. ఇలా పెరిగే పొట్ట ఇతర అనారోగ్యాలకూ దారి తీస్తుందంటున్నారు నిపుణులు. అందుకే నలభై దాటాక/మెనోపాజ్ దశలో చక్కటి పోషకాహారం తీసుకోవడం వల్ల పెరిగే పొట్టను తగ్గించు కోవచ్చుంటున్నారు. అదెలాగో తెలుసుకుందాం..

**హార్మోన్ల ప్రభావమే ...** హార్మోన్ల ప్రభావం కారణంగా మన శరీరంలో వివిధ మార్పులు చోటుచేసుకుంటాయి. మెనోపాజ్ దశలో పొట్ట పెరగడానికీ ఇవే కారణమంటున్నారు నిపుణులు. ఈ దశలో ఈస్ట్రోజెన్ వంటి హార్మోన్లు తక్కువగా ఉత్పత్తవడం వల్లన వాటి స్థాయుల్లో సమతుల్యత లోపిస్తుంది. ఇది పొట్ట చుట్టూ, పొత్తి కడుపు దగ్గర కొవ్వులు పేరుకుపోయేందుకు ప్రేరేపిస్తుంది. కొంతమందిలో శరీర బరువు పెరగకపోయినా ఇలా పొట్ట పెరిగేసరికి అసౌకర్యానికి గురవుతుంటారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. క్రమంగా బరువు పెరిగి శ్వాస సంబంధిత సమస్యలు, గుండె సమస్యలు, టైప్-2 మధుమేహం. వంటి దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అందుకే ముందే జాగ్రత్త పడి. కొన్ని ఆహార పదార్థాల్ని మెనూలో చేర్చుకోవడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు.

**ఈ ఆహారంతో...**

- అవిసె గింజలు ఆరోగ్యానికే కాదు.. అధిక బరువు తగ్గించడానికీ దోహదం చేస్తాయి. వీటిలో ఉండే మోనోఅన్‌శ్చాచురేటెడ్ కొవ్వులే ఇందుకు కారణం. ఇవి శరీరంలో అధిక నీరు చేరకుండా చేయడంతోపాటు ఈస్ట్రోజెన్ స్థాయుల్నీ క్రమబద్ధీకరిస్తాయి.
- మన శరీరంలో విడుదలయ్యే కార్టిసాల్ హార్మోన్ ఒత్తిడికి కారణమవుతుంది. ఇదీ పొట్టభాగంలో కొవ్వు పేరుకుపోయేందుకు కారణమవుతుంది. కాబట్టి ఈ హార్మోన్ స్థాయుల్ని తగ్గించడంలో దాల్చిన చెక్క సమర్థంగా పని చేస్తుంది.
- సబ్జా గింజల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది పేగు కదలికల్ని ప్రేరేపించి వివిధ జీర్ణ సంబంధిత సమస్యల్ని దూరం చేస్తుంది. అంతేకాదు.. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు కరుగుతుందని పలు అధ్యయనాలు కూడా రుజువు చేశాయి.
- చెడు కొవ్వుల్ని కరిగించడంలో యాపిల్ సైడర్ వెనిగర్ సమర్థంగా పనిచేస్తుంది. పైగా ఇందులో క్యాలరీలు కూడా తక్కువే! కాబట్టి పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వునుకరిగించాలంటే ఇది చక్కటి ప్రత్యామ్నాయం అంటున్నారు నిపుణులు. ఈ ఫలితం పొందాలంటే. గ్లాసు నీటిలో టేబుల్‌స్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ వేసుకొని పరగడుపున తీసుకోవాలి.
- పప్పులు, కాయధాన్యాల్లో ఫోలికామ్లం, మెగ్నీషియం, పొటాసియం, విటమిన్ 'బి', ఫైబర్, ప్రొటీన్..వంటి పోషకాలుంటయి. ఇవి పొట్ట చుట్టూ పేరుకున్న కొవ్వుల్ని కరిగించడానికి దోహదం చేస్తాయి.
- ఆకుకూరల్లో మెగ్నీషియం పుష్కలంగా లభిస్తుంది. ఇది ఒత్తిడి, ఆందోళన, యాంగ్జైటీ వంటి మానసిక సమస్యల్ని తగ్గించడంలో దోహదపడుతుంది. అంటే పరోక్షంగా శరీరంలో పేరుకున్న చెడు కొవ్వులు, పొట్టనూ తగ్గిస్తుందన్నమాట.
- మెనోపాజ్ దశలో తలెత్తే దుష్ప్రభావాలే మహిళల్లో వివిధ మానసిక సమస్యలకు కారణమవుతుంటాయి. వీటిని దూరం చేసుకోవాలంటే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే చేపలు, సీ-ఫుడ్, వాల్‌నట్స్‌ని డైట్‌లో చేర్చుకోవాలని చెబుతోంది ఓ అధ్యయనం ! ఇక వీటితో పాటు బరువులెత్తడం, నడక, పరుగు, ఈత, సైక్లింగ్..వంటి వ్యాయామాలు కూడా నలభై దాటిక పొట్టను తగ్గించడంలో సహకరిస్తాయంటూన్నరు నిపుణులు. అయితే ఈ నియమాలు పాటిస్తున్నా ఫలితం లేకపోతే, ఇతర సమస్యలేవైనా ఎదురైతే..ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించడం ఉత్తమం అంటున్నారు.

# పవిత్రమైన రోజు

ఆధ్యాత్మికం

హిందూ ధార్మిక పంచాంగంలో అత్యంత పవిత్రమైన ఏకాదశులలో శయన ఏకాదశి (ఆషాఢ శుక్ల ఏకాదశి) విశిష్ట స్థానం కలిగి ఉంది. ఈ ఏకాదశికి ఇతర పేర్లు కూడా ఉన్నాయి పద్మ ఏకాదశి, దేవశయనీ ఏకాదశి, హరి శయన ఏకాదశి, ఆషాఢ ఏకాదశి. ఈ రోజు నుండి శ్రీ మహా విష్ణువు నాలుగు నెలలు యోగ నిద్రలోకి ప్రవేశి స్తాడన్న విశ్వాసం ఉంది. ఈ కాలాన్ని చాతుర్మాస్యం అని పిలుస్తారు.చాతుర్మాస్యం అంటే నాలుగు నెలల ఆధ్యాత్మిక నియమాల కాలం. ఇది శయన ఏకాదశి నుంచి ప్రారంభమై ప్రబోధినీ ఏకాదశి వరకు సాగుతుంది. ఈ సమయంలో సాధువులు ఏకస్థాన వాసంలో ఉంటూ ధ్యానం, జపం, వేదపఠనం, ఉపవాసం, మౌనవ్రతం వంటి కఠిన నియమాలను పాటిస్తారు. మాంసాహారం, ఉల్లిపాయ వంటివి వర్జించటం, రాత్రి భోజనం మానటం వంటి నియమాలు ఈ కాలంలో అనుసరిస్తారు. ప్రజలకు ధర్మబోధ చేస్తూ సత్సంగాలను నిర్వహిస్తారు. ఇది ఇంద్రియ నిగ్రహానికి, మానసిక స్థిరత్వానికి, భక్తిలో లోతుకు మార్గం. కార్తీక మాసంలో దీపారాధన, పుణ్యస్నానాలతో చాతుర్మాస్యం ముగుస్తుంది. ఈ దినం నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు భగవంతుడు శేషతలపై క్షీరసాగరంలో నిద్రిస్తాడు. భక్తులు ఉపవాసంతో, జాగరణతో, శ్రీహరి సేవలో నిమగ్నమవుతారు. శాస్త్రప్రకారం ఈ రోజు ఉపవాసం, దానధర్మాలు, భగవన్నామ స్మరణలు చేయడం వల్ల పాపక్షయమవుతుంది, పుణ్యఫలాలు లభిస్తాయి. పురాణాల ప్రకారం, దేవతలు ఈ నాలుగు నెలలపాటు దేవుడి నిద్రను గౌరవిస్తూ, అతని సేవలో ఉండాలని భక్తులకు ఉపదేశించారు. గృహస్థులు ఈ చాతుర్మాస్యంలో కొన్ని నియమాలను పాటిస్తూ, భక్తి మార్గాన్ని అనుసరించడం సంప్రదాయం. శయన ఏకాదశి నాటి ఉపవాసం వల్ల శరీర శుద్ధి, మనస్సు స్థిరత, ఆధ్యాత్మిక చైతన్యం ఏర్పడుతాయి. ఇది శ్రద్ధతో జరిపిన ఒకే ఒక్క ఏకాదశి అయినా, ఎన్నో ఏకాదశులకు సమానంగా ఫలితాన్నిస్తుంది అని స్కంద పురాణంలో చెప్పబడింది. శయన ఏకాదశి భగవంతుడి నిద్రలో మన భక్తిని సమర్పించుకునే పవిత్ర దినం. విశ్రాంతిలోని ఆధ్యాత్మిక జాగృతి - జీవన మార్గాన్ని ధర్మసంపన్నంగా మలచుకునే ప్రవేశ ద్వారం.

**- సి. హెచ్. ప్రతాప్**

# పిల్లలకు నత్తి ఎందుకు వస్తుంది..

**ప్రపంచంలోని ఆరుశాతం** పిల్లలూ, ఒక్క శాతం పెద్దల్లోనూ నత్తి ఉంటుందట. మాట్లాడేటప్పుడు మెదడు అనవసరమైన మాతృతకి గురికావడమే ఇందుకు కారణమని వైద్యులు ఎప్పటి నుంచో చెబుతూ వస్తున్నారు. అయినా మెదడులో ఏ భాగంలో ఈ సమస్య ఏర్పడుతుందో పసిగట్టలేకపోయారు.



తాజాగా ఆ భాగమేదో కనిపెట్టారు ఫిన్‌లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ తుర్కు శాస్త్రవేత్తలు. మన మెదడులో ఆవేశాలని అదుపు చేసేందుకు 'అమిగ్దలా' అని, కదలికల్ని నియంత్రించేందుకు 'పుటేమన్' అనీ, మనకొచ్చే భిన్న సాచారాల్ని విశ్లేషించేందుకు 'క్లాస్ట్రమ్' అనీ మూడు విభాగాలుంటాయి. ఆ మూడింటినీ కలిపే న్యూరాన్‌ల విధభాగం కూడా ఒకటుందట. ఆ భాగంలోని మెదడు కణాల్లో ఏర్పడే చిన్నపాటి అంతరాయమే నత్తికి కారణమని తాజాగా కనిపెట్టారు శాస్త్రవేత్తలు. వేలాది బ్రెయిన్ స్కానర్‌లని 'ఎఐ'తో విశ్వేలషించడం ద్వారా దీన్ని సాధించారట. ఈ భాగాన్ని గుర్తించడం వల్ల అక్కడ చిన్నపాటి విద్యుత్తు ప్రేరణలు (స్టిమ్యులేషన్) ఇవ్వడం ద్వారా నత్తి సమస్యని అధిగమించొచ్చని చెబుతున్నారు. ఆ దిశగా చికిత్సా విధానాలనీ రూపొందిస్తున్నారు.







# టెస్ట్ క్రికెట్‌లో.. జెట్ స్పీడ్ హీరోలు

## డబుల్ సెంచరీలతో మెరిసిన బ్యాటర్స్

### త్రిబుల్ సెంచరీలతో సెహ్వాగ్

**న్యూఢిల్లీ:** టెస్ట్ క్రికెట్‌లో డబుల్ సెంచరీ కొట్టడం అనేది ఏ బ్యాట్స్‌మన్‌కైనా ఒక గొప్ప లక్షణం. అది కూడా అత్యంత వేగవంతంగా డబుల్ సెంచరీ చేయడం ప్లేయర్ల సత్తాపై ఆధారపడి ఉంటుంది. భారీ స్కోర్లు చేయడంలో, స్వేచ్ఛగా డబుల్ సెంచరీలు చేయడంలో నైపుణ్యం కలిగిన బ్యాటర్లు పలువురు ఉన్నారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న వ్యక్తి న్యూజిలాండ్‌కు చెందిన నాథన్ ఆస్టల్. 2002లో 153 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడు. క్రైస్ట్‌చర్చ్ మైదానంలో వెలుగులోకి వచ్చిన అతని వీరోచిత ప్రదర్శనలు, ఆ పోటీలో ఆధిపత్యం చెలాయింప చేసింది. అలాగే ఇంగ్లీష్ శిబిరంలో బ్యాటింగ్‌లో దిట్ట అయిన బెన్ స్టోక్స్ మీడియం పేస్ బౌలర్‌గా కూడా పేరుగాంచాడు. టెస్ట్ మ్యాచ్లో ఇప్పటివరకు నమోదైన రెండవ వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. స్టోక్స్ తన డబుల్ సెంచరీని చేరుకోవడానికి తీసుకున్న 163 బంతుల్లోనే ఈ సెంచరీ వచ్చింది. బెన్ స్టోక్స్ 198 బంతుల్లో 258 పరుగులు చేసి ఆధిపత్యం చెలాయించాడు. అతను 30 ఫోర్లు బాదాడు, 11 సిక్సర్లు బాదాడు. టెస్ట్ క్రికెట్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీలు సాధించిన వారి జాబితాలో భారత్‌కు చెందిన వీరేంద్ర సెహ్వాగ్ ఒకరుగా ఉన్నాడు. సెహ్వాగ్ టెస్ట్ క్రికెట్‌లో ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా మూడు డబుల్ సెంచరీలు సాధించాడు. శ్రీలంకపై 168 బంతుల్లో డబుల్ సెంచరీ చేసిన అతను, ఆ తర్వాత లాహోర్లో పాకిస్థాన్‌పై 182 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడు. ఆ సందర్భంలో అతను మొత్తం 254 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. చివరకు కుడిచేతి వాటం బౌలర్ 2008లో దక్షిణాఫ్రికాపై 194 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడు. ఇక క్రికెట్ బంతిని నిజంగా స్మాష్ చేసే వ్యక్తి బ్రెండన్ మెకల్లమ్ ఒక లెజెండ్ అయ్యాడు. మెకల్లమ్ కేవలం 186 బంతుల్లోనే తన టెస్టు డబుల్ మైలు రాయిని చేరుకున్నాడు. అంతేకాకుండా ఈ మ్యాచ్‌లో 11 సిక్సర్లు సైతం కొట్టి అద్భుత ప్రదర్శన చేశాడు. కాగా యూనివర్స్ బాస్ క్రిస్టోఫర్ హెన్రీ గేల్ తన బ్యాటింగ్‌లో బిగ్ సిక్స్ కొట్టడం ద్వారా స్కోరును పరుగు పెట్టించాడు. ఈ ఎడమ చేతి వాటం బౌలర్స్ టెస్టు మ్యాచ్‌లో 98 సిక్సర్లు కొట్టాడు. తన కెరీర్‌లో పదో వంతు సిక్సర్లు కొట్టడానికి ఒకే ఇన్నింగ్స్ పట్టింది. ఆ సమయంలో శ్రీలంకపై క్రిస్ గేల్ 333 ట్రిపుల్ సెంచరీలు సాధించాడు. ఆ ఇన్నింగ్స్‌లో గిల్ కేవలం 221 బంతుల్లోనే తన ట్రిబుల్ సెంచరీ పూర్తి చేశాడు.

# టీమిండియా భారీ స్కోరు

## ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో 564 పరుగులతో పటిష్ట స్థితి

### 265 రన్స్‌తో గిల్ డబుల్, అర్ధ సెంచరీ

**న్యూఢిల్లీ:** బర్మింగ్‌హామ్ లో ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు భారీ స్కోరు సాధించింది. గురువారం రాత్రి 8.30 గంటలకు టీ సమయానికి భారత్ 7 వికెట్లు కోల్పోయి 564 పరుగులతో కొనసాగుతోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుతమైన డబుల్ సెంచరీ, అర్ధ సెంచరీతో చెలరేగడంతో టీమిండియా పటిష్ఠ స్థితిలో నిలిచింది. యువ ఆటగాడు గిల్ కు కెరీర్ లో ఇదే తొలి డబుల్ సెంచరీ. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రెండో రోజు ఆట లంచ్ అనంతర సెషన్ లో భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా, భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మన్



ఆట

గిల్ ముందుండి జట్టును నడిపించాడు. ఓపికగా ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న గిల్, 380 బంతుల్లో 30 ఫోర్లు, 3 సిక్సర్లతో 265 పరుగులు చేసి అజేయంగా క్రీజులో ఉన్నాడు. అతనికి రవీంద్ర జడేజా (89), యశస్వి జైస్వాల్ (87), వాషింగ్టన్ సుందర్ (42) చక్కటి సహకారం అందించారు. ఆరంభంలో కేఎల్ రాహుల్ (2) వికెట్‌ను త్వరగానే కోల్పోయినా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడారు. జైస్వాల్, జడేజా ఔటైన తర్వాత, గిల్, వాషింగ్టన్ సుందర్ (42)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపిస్తున్నాడు. కానీ ఇదే సమయంలో జో రూట్ చేతిలో ఔటయ్యాడు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ రెండు వికెట్లు పడగొట్టగా, బెన్ స్టోక్స్, షోయబ్ బషీర్, జోష్ టంగ్, బ్రైడన్ కార్స్, జో రూట్ తలో వికెట్ తీశారు. భారీ స్కోరు సాధించిన టీమిండియా ఈ మ్యాచ్‌పై పట్టు బిగించింది.



## వరల్డ్ మహిళా బాక్సింగ్ కప్ సెమీస్‌కు

# భారత్ బాక్సర్లు

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్-2025లో భారత్ బాక్సర్లు బలమైన ఆరంభాన్ని ప్రదర్శించారు. కజకిస్తాన్‌లోని అస్తానాలోని బీలైన్ అరీనాలో పూజా రాణి, సంజు, మీనాక్షి తమతమ విభాగాల సెమీఫైనల్‌కు చేరుకోవడంతో ప్రపంచ బాక్సింగ్ కప్ సర్క్యూట్‌లో భారత్ బాక్సర్లు అద్భుతమైన అరంగేట్రం చేసి ఆకట్టుకున్నారు. మహిళల 48 కిలోల క్వార్టర్ ఫైనల్‌తో తొలి రోజు ప్రారంభమైంది. ఇక్కడ మినాక్షి చైనీస్ తైపీకి చెందిన యిజువాన్ గువోపై 5-0 తేడాతో ఆధిపత్య విజయం సాధించి బలమైన ప్రదర్శన ఇచ్చింది, తద్వారా ఈ ఈవెంట్‌లో ఆమెకు పతకం ఖాయమైంది. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బాక్సర్ మడేలిన్ బోవెన్‌పై విజయం సాధించిన మినాక్షి కిది ప్రాథమిక రౌండ్ తర్వాత టోర్నమెంట్‌లో ఇది రెండవ బౌట్. ఆమె తర్వాత, అనుభవజ్ఞురాలైన రెండుసార్లు ఆసియా ఛాంపియన్ పూజా రాణి కూడా మహిళల 80 కిలోల విభాగంలో కజకిస్తాన్‌కు చెందిన గుల్సయా యెర్జాన్‌పై స్ప్లిట్ డెసిషన్ 4-1 విజయంతో ఆమెకు పతకాన్ని నిర్ధారించింది. సాయంత్రం సెషన్‌లో, సంజు 60 కిలోల విభాగంలో అమెరికన్ బాక్సర్ జజైరా గొంజాలెజ్‌పై 5-0 తేడాతో విజయం సాధించి ఫైనల్ ఫోర్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకుంది. ఇక పురుషుల విభాగంలో బ్రెజిల్ ప్రపంచ కప్ కాంస్య పతక విజేత లైట్ వెయిట్ బాక్సర్ జదుమణి సింగ్ (50 కిలోలు) 2-3 తేడాతో ఫిలిప్పీన్స్ బాక్సర్ జే బ్రయాన్ బారికువాట్రో చేతిలో క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించాడు. మరోవైపు, మనీష్ రాథోడ్ (పురుషులు 50 కిలోలు), సనమ్చా చౌను (మహిళలు 70 కిలోలు) ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో పోటీ నుండి నిష్క్రమించగా, ముస్కాన్ (75 కిలోలు) తన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో ఓడిపోయారు.

## వింబుల్డన్‌లో భారత్ లెజెండ్

# బోపన్న నిష్క్రమణ

### ముందంజలో శ్రీరామ్

**న్యూఢిల్లీ:** వింబుల్డన్‌లో రోహన్ బోపన్న అనూహ్యంగా ఓటమిపాలవ్వగా, శ్రీరామ్ బాలాజీ ముందంజలో ఉన్నాడు. వింబుల్డన్-2025 ప్రారంభ రౌండ్‌లో పురుషుల డబుల్స్ పోటీ నుండి భారత లెజెండరీ ఆటగాడు రోహన్ బోపన్న మరియు అతని భాగస్వామి సాండర్ గిల్లె నిష్క్రమించారు. అనుభవజ్ఞుడైన బోపన్న అలవోకగా గెలుస్తాడనుకుంటే తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. ఈ జోడీ ఒక గంటా నాలుగు నిమిషాల్లో మూడో సీడ్ జర్మన్ జంట కెవిన్ క్రావిట్జ్ మరియు టిమ్ పుయెట్జ్ చేతిలో 3-6, 4-6 తేడాతో పరాజయం పాలయ్యాడు. అయితే పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ ముందంజ వేశాడు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో శ్రీరామ్ మిగెల్ రెయ్స్(మెక్సికో) ద్వయం అమెరికా జంటను చిత్తు చేసింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన పోరులో లెర్నర్ థియెన్, అలెగ్జాండర్ కొవసెవిక్ ద్వయంపై 64, 64తో జయకేతనం ఎగురవేసింది. దాంతో, ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్‌కు దూసుకెళ్లిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు శ్రీరామ్. లండన్ వేదికగా జరుగుతున్న వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో యుకీ బాంబ్రీ, రిత్విక్ బొల్లిపల్లి దూసుకెళ్లారు. ఇప్పుడు శ్రీరామ్ కూడా తొలి రౌండ్ దాటాడు. రెండో రౌండ్‌లో శ్రీరామ్ ద్వయం నాలుగో సీడ్‌తో తలపడనుంది. భారత డబుల్స్ స్టార్ యుకీ భాంబ్రీ మరియు అతని అమెరికన్ భాగస్వామి రాబర్ట్ గాల్లోవే, ఫ్రాన్స్‌కు చెందిన మాన్యుయెల్ గినార్డ్ మరియు మొనాకోకు చెందిన రొమైన్ ఆర్నియోడోలను వరుస సెట్లలో ఓడించి వింబుల్డన్ పురుషుల డబుల్స్ పోటీలో రెండవ రౌండ్‌కు చేరుకున్నారు. గంటా 49 నిమిషాల పాటు జరిగిన మొదటి రౌండ్ పోరులో, 16వ సీడ్ ఇండోఅమెరికన్ ద్వయం ఆర్నియోడో మరియు గినార్డ్‌ను 7-6(8), 6-4 తేడాతో ఓడించింది. గ్రాండ్‌స్లామ్‌కు సిద్ధమయ్యే క్రమంలో, మల్లోర్కా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత వారు తమ ప్రదర్శనను మరింత పెంచుకున్నారు.




## కెనడా ఓపెన్ ఉత్కంఠ పోరులో

# శ్రీకాంత్ విజయం

### మహిళల సింగిల్స్‌లో శ్రీయాన్షి గెలుపు

**న్యూఢిల్లీ:** కెనడా ఓపెన్-2025లో ప్రియాంషు రజావత్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో భారత్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ విజయం సాధించాడు. అలాగే మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ యువ క్రీడాకారిణి వలిశెట్టి శ్రీయాన్షి గెలుపొందింది. కెనడా ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ తన స్వదేశీయుడు ప్రియాంషు రాజవత్‌పై మూడు గేమ్‌ల ఉత్కంఠభరితమైన విజయంతో పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల రజత పతక విజేత, మేలో జరిగిన మలేషియా మాస్టర్స్‌లో రన్నరప్‌గా నిలిచిన శ్రీకాంత్, 53 నిమిషాల పాటు జరిగిన ఉత్కంఠభరితమైన ప్రారంభ రౌండ్ పోరులో 18-21, 21-19, 21-14 తేడాతో విజయం సాధించాడు. ఇంతకు ముందు రెండుసార్లు తలపడిన ఈ ఇద్దరు అకాడమీ సహచరుల మధ్య ఇది తీవ్రమైన పోరాటం. రాజవత్ రెండు సందర్భాలలోనూ విజయం సాధించాడు. అలాగే ఇద్దరు భారతీయ పురుషులు తలపడిన మరో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో శంకర్ సుబ్రమణియన్ తొలి రౌండ్‌లో ఆయుష్ శెట్టిని ఓడించాడు. 23-21, 21-12 తేడాతో అద్భుతమైన విజయాన్ని సాధించాడు. మొదటి గేమ్ హోరాహోరీగా సాగింది, చివరికి సుబ్రమణియన్ 23-21తో ఆధిక్యంలో నిలిచాడు. ఇక మహిళల సింగిల్స్‌లో, యువ క్రీడాకారిణి వలిశెట్టి శ్రీయాన్షి 21-18, 22-20 తేడాతో ఉక్రెయిన్‌కు చెందిన ఏడో సీడ్ పోలినా భూరోవాను ఓడించింది. ఇరా శర్మ మరియు తాన్య హేమంత్ తమప్రారంభ రౌండ్ ప్రత్యర్థులను అధిగమించడంలో విఫలమవడంతో, మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16 డ్రాలో ఉన్న ఏకైక భారతీయురాలుగా శ్రీయాన్షి నిలిచింది. మరోవైపు, టాప్ సీడ్ మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం తనీషా క్రాస్టో మరియు ధ్రువ్ కపిల వరుసగా రెండో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు, స్పానిష్ జంట చేతిలో 15-21, 19-21 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయారు.

# హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సిఇఒపై క్రిమినల్ కేసు

**ముంబై, జులై 3:** ముంబైలోని లీలావతి ఆసుపత్రి ట్రస్టీలు తనపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయడంతో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ శశిధర్ జగదీషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రిమినల్ కేసులో బలమైన ఆధారాలేవీ లేవని, పెండింగ్ చెల్లింపులపై ఒత్తిడి తప్పా మరేమీ కాదని జగదీషన్ తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. జగదీషన్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తూ ఆసుపత్రి ట్రస్టీలు నమోదు చేయించిన ఎఫ్ఐఆర్‌కు బలమైన ఆధారాలు లేవని, ఆసుపత్రి నుంచి డబ్బు రికవరీ చేయడానికి బ్యాంకు ప్రయత్నిస్తున్నందునే ఎఫ్ఐఆర్ దాఖలు చేశారని వాదించారు. ఈ కేసును బాండే హైకోర్టులోని మూడు వేర్వేరు బెంచ్‌లు పలుమార్లు ప్రయత్నాలు చేసినప్పటికీ విచారించలేకపోయాయని ఆయన అన్నారు. కొద్దిసేపు వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ కేసును శుక్రవారంకు వాయిదా వేశారు. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్



బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డిఎఫ్‌సి చీఫ్‌పై ఇలా ఎఫ్ఐఆర్ నమోదు కావడానికి గల కచ్చితమైన కారణాలను ఇరువర్గాలు పంచుకోలేదు. అయితే కొన్ని సంస్థలు తెలిపిన వివరాలు కింది విధంగా ఉన్నాయి. ట్రస్ట్ పాలపై అనవసర నియంత్రణ కోసం జగదీషన్ మాజీ ట్రస్టీ చేత్ మెహతా నుంచి అనధికారికంగా రూ.2.05కోట్లు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. హెచ్‌డిహెచ్‌సి బ్యాంకు సిఇఒగా ఆయన స్వచ్ఛంద సంస్థ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునానరని ట్రస్ట్ పేర్కొంది. లీలావతి ఆసుపత్రిలో జగదీషన్, తన కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యంఅందించారని తెలిపింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో ట్రస్ట్ డిపాజిట్ల కింద రూ.48కోట్లు ఉన్నాయని చెప్పింది.

# అమల్లోకి వస్తున్న ఇండియా-అమెరికా మినీ ట్రేడ్ డీల్

**వాషింగ్టన్, జులై 3:** భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జోరుగా జరుగుతున్నాయి. ఈ తరుణంలో రెండు దేశాల మధ్య మినీ ట్రేడ్ డీల్ (మధ్యంతర వాణిజ్య ఒప్పందం) కుదరనున్నట్లు తెలుస్తోంది. 48 గంటల్లో అది ఖరారు కావొచ్చని, ఆ దిశగా వాషింగ్టన్‌లో చర్చలు జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, ఆటోమొబైల్, ఇండస్ట్రియల్ గూడ్స్, లేబర్ ఇంటెన్సివ్ ప్రొడక్ట్‌ల పైనే దృష్టిపెట్టారు. ముఖ్యంగా వ్యవసాయం, డెయిరీ రంగాల విషయంలో ఇరుదేశాల మధ్య చిక్కుముడులు నెలకొన్నాయి. భారత్ పాల ఉత్పత్తుల మార్కెట్‌ను విదేశీ సంస్థల కోసం తెరిచేందుకు సిద్ధంగా లేదు. మరోవైపు అమెరికా కొన్నిరకాల ఇండస్ట్రియల్ గూడ్స్‌కు, ఆటోమొబైల్ రంగంలో రాయితీలు కోరుతోంది. విద్యుత్తు కార్లు, వైన్స్, పెట్రోకెమికల్స్, డెయిరీ, యాపిల్, నట్స్, జన్యుపరమైన మార్పులు చేసిన పంటల విషయంలో లబ్ధి కోసం పట్టుబడు



తోంది. ఇక, భారత్ నుంచి చేసుకొనే దిగుమతులపై ట్రంప్ యంత్రాంగం విధించిన 26 శాతం టారిఫ్‌లు జులై 9 వరకు అమల్లోకి రావు. ఇక బేస్‌లైన్ టారిఫ్ 10శాతం మాత్రం వర్తిస్తోంది. ఈ చర్చల సందర్భంగా భారత్ 26శాతం పన్నుపై రాయితీ కోరుతోంది. మరోవైపు.. వాణిజ్య ఒప్పందంపై కీలక ప్రకటన జులై 8 కంటే ముందే వెలువడవచ్చని నిన్న వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ చర్చలకు నాయకత్వం వహిస్తున్న వాణిజ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాషింగ్టన్‌లో ఉండి తుదివిడత సంప్రదింపులు మొదలుపెట్టారు. ఇప్పటికే ట్రంప్ విధించిన టారిఫ్‌ల సస్పెన్షన్ జులై 9వ తేదీ వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. ఎందుకంటే ఈ డెడ్‌లైన్‌ను మరోసారి పొడిగించే ఉద్దేశం తనకు లేదని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. అతిత్వరలోనే టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మినీ ట్రేడ్ డీల్ జరగొచ్చని తెలుస్తోంది.

# పతంజలికి ఢిల్లీ హైకోర్టు వార్నింగ్



**న్యూఢిల్లీ, జులై 3:** డాబర్ చ్యవన్‌ప్రాశ్‌ను లక్ష్యంగా చేసుకొని పతంజలి ఆయుర్వేద్ జారీ చేసిన ప్రకటనలను వెంటనే నిలిపివేయాలని ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జస్టిస్ మణి పుష్కర్ణ ఆదేశాలిచ్చారు. అంతకుముందు.. తమ ప్రముఖ ఉత్పత్తులను అవమానిస్తూ పతంజలి వాణిజ్య ప్రకటనలు జారీ చేస్తోందని డాబర్ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి తాజాగా ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆయుర్వేద గ్రంథాల్లో చెప్పినట్లు కేవలం తాము మాత్రమే చ్యవన్‌ప్రాశ్‌ను తయారుచేస్తామని పతంజలి తమ ప్రకటనలో చెబుతోంది. ఇతర సంస్థలు సరైన పరిజ్ఞానంతో ఉత్పత్తులు చేయడం లేదని వెల్లడించింది. దీంతో డాబర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈవాణిజ్య ప్రకటనలను నిలిపివేయడంతో పాటు.. తమపేరుకు భంగం కలిగించినందుకు రూ.2కోట్ల మేరకు నష్టపరిహారం ఇప్పించాలని కోరింది. తమ ఉత్పత్తే సరైందని పతంజలి వాణిజ్య ప్రకటనల్లో తప్పుగా క్లెయిమ్ చేస్తోందని ఆరోపించింది. ఈ అంశంపై న్యాయస్థానం జులై14న తదుపరి విచారణను చేపట్టనుంది. గతంలో కరోనా వైద్యం విషయంలో పతంజలి తప్పుడుప్రచారం చేసినప్పుడు సుప్రీంకోర్టు ఆసంస్థపైచర్యలు తీసుకొన్న విషయంతెలిసిందే. నాడు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆ సంస్థపై న్యాయ పోరాటం చేసింది.

# రూ.4250 కోట్లకు మీషో ఐపిఒ

**ముంబై, జులై 3:** ఇ-కామర్స్ కంపెనీ మీషో ఐపిఒకు వస్తోంది. సెబి వద్ద తన డిఆర్‌హెచ్‌పి దరఖాస్తులను అత్యంత గోప్యంగా దాఖలు చేసింది. సాఫ్ట్‌బ్యాంక్ అధీనంలోని ఈ సంస్థ 497.30 మిలియన్ డాలర్లు అంటే భారతీయ కరెన్సీలో 4250 కోట్ల విలువైన నిధులు సమీకరించేందుకు నిర్ణయించింది. ప్రస్తుత సంస్థలో ఉన్న ఇన్వెస్టర్లుకూడా తమ వాటాలను విక్రయించుకునే అవకాశం ఉంది. మీషో సెబి అనుమతులతో సెప్టెంబరు లేదా అక్టోబరులో మార్కెట్లకు రావచ్చని తేలింది. అమెరికా, భారత్‌లోని వాటాదారుల ఆమోదం తర్వాత లిస్టింగ్ కూడా పూర్తవుతుంది. మీషో తమ వాటాదారుల తాజా ఆమోదంకూడా పొందామని, మూలధన వనరుల సమీకరణకు ఐపిఒకు వస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. గతనెలలోనే నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) కంపెనీ కేంద్ర కార్యాలయాన్ని డెలావేర్‌నుంచి భారత్‌కు మార్చేందుకు అనుమతించింది. దీనితో మీషో ఇపుడు యుఎస్ సంస్థ నుంచి వేరుపడి భారత సంస్థగా కొనసాగుతుంది. అలాగే కార్పొరేట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు చెపుతోంది. భారత్‌లో తన ఉనికిని మరింత పటిష్ఠంచేసుకునే దిశగా ఈ ఐపిఒ వస్తోంది. కస్టమర్లు, విక్రేతలు, సృష్టికర్తలు, వాల్మో భాగస్వాములు ఇప్పటికే ఇక్కడ ఉన్నారు. ఈరీలొకేషన్ కారణంగా కంపెనీ 288 మిలియన్ డాలర్లుపన్నులరూపంలో చెల్లించాల్సి వస్తోంది. మీషోకు అనేకపెట్టుబడిసంస్థలున్నాయి. ప్రోసస్; ఎలివేషన్ క్యాపిటల్, వెస్ట్‌బ్రిడ్జి క్యాపిటల్; సాఫ్ట్‌బ్యాంకు, పీక్ 15 భాగస్వాములుగా ఉన్నారన్నది తెలిసిందే. 2024లో కంపెనీ నష్టాలు 53 కోట్లకు తగ్గాయి. రాబడులు కూడా 33 శాతంపెరిగి 7615 కోట్లకు చేరాయి. స్థూల వాణిజ్య విలువలు 2025లో 6.2 బిలియన్ డాలర్లకు చేరాయి. దీనితో మీషో ఇపుడు భారత్‌లోనే విలువలపరంగా మూడో అతిపెద్ద ఇ-కామర్స్ సంస్థగా నిలిచింది.




# చివరి క్షణంలో అమ్మకాల జోరు.. నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, జులై 3:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. భారత్ అమెరికా మధ్య మినీట్రేడ్ డీల్ మరికొన్ని గంటల్లో కుదరొచ్చన్న వార్తల నేపథ్యంలో లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. లాభాల స్వీకరణతో వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం 83,540.74 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,409.69) లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. మధ్యాహ్నం వరకు లాభాల్లోనే కొనసాగాయి. ఇంట్రాడేలో83,850.09 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీలు.. తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్నాయి. చివరికి 170.22 పాయింట్ల నష్టంతో 83,239.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 48.10 పాయింట్ల నష్టంతో 25,405.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.31గా ఉంది. కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్, ఎన్టీపీసీ, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.71 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,356 డాలర్ల వద్ద ట్రేడయింది.



# వాణిజ్యం

## భారత్ ఆర్థికవృద్ధి 6.7%

### సిఐఐ కొత్త అధ్యక్షుడు రాజీవ్‌మెమాని

**న్యూఢిల్లీ, జులై 3:** భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.4 నుంచి 6.7శాతం వరకూ నమోదుకావచ్చని భారత వాణిజ్య మండలి (సిఐఐ) ప్రకటించింది. భౌగోళిక ఉద్రిక్తతలు ఎదురవుతున్నా, ఇతర సమస్యలు సవాళ్లు ఉన్నప్పటికీ ఆర్థికవృద్ధి ఆగడం మాత్రం ఉండదని సిఐఐ అధ్యక్షుడు రాజీవ్‌మెమాని గురువారం వెల్లడించారు. సిఐఐ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి మీడియా సమావేశంలో ప్రసంగించిన మెమాని భారత్ ఆర్థికవృద్ధికి అన్ని సంకేతాలున్నాయన్నారు. మంచి రుతుపవనాలు, నగదు లభ్యంత అందుబాటులోకి రావడం, ఆర్బీఐ సిఆర్‌ఆర్ కోతలు, వడ్డీరేట్ల తగ్గింపులు వంటి దేశ ఆర్థికవృద్ధికి దోహదం చేస్తాయని ప్రకటించారు. గతనెలలోనే ఆర్బీఐ నగదునిల్వల నిష్పత్తిని 100 బేసిస్ పాయింట్లకు తగ్గించింది. దీనితో బ్యాంకింగ్ వ్యవస్థలోకి 2.5 లక్షల కోట్లు



అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా విభిన్న ఉత్పత్తిరంగాలకు రుణపరపతి సులువుగా అందే అవకాశం లభించింది. బెంచ్‌మార్క్ వడ్డీరేట్లు కూడా 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.5శాతానికి చేర్చింది. ఈ కారణాలవల్లనే సిఐఐ 6.4 నుంచి 6.7శాతం వరకూ భారత ఆర్థికవ్యవస్థ వృద్ధిచెందే అవకాశం ఉందని రాజీవ్‌మెమాని అన్నారు. బయటినుంచి వచ్చే సవాళ్లు ఎక్కువగానే ఉన్నాయని, అయినప్పటికీ కూడా దేశీయంగా ఆర్థిక పటిష్టతకు అన్ని వనరులున్నట్లు మెమానీ చెప్పారు. భౌగోళిక అనిశ్చితితో బయటిప్రాంత రిస్కులు ఉన్నప్పటికీ దేశీయంగా డిమాండ్ మరింతగా ఉండటంతో అనివార్యంగా వృద్ధి పెరుగుతుందన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.